RNI No.TELTEL/2005/16755

# ప్రజాబలం

PRAJABALAM Telugu Daily తెలుగు దినపత్రిక

Website: prajabalam.in




హైదరాబాద్ | 16 నవంబర్ 2025 ఆదివారం | పేజీలు:12 | వెల రూ.2.00 | సంపుటి:21 | సంచిక:141

### ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసిన విన్‌గ్రూప్ ఆసియా సీఈవో..

# తెలంగాణలో పెట్టుబడులకు ఆసక్తి





విన్‌గ్రూప్ కంపెనీ తెలంగాణలో పెట్టుబడులు పె ఆసక్తి కనబర్చారు. శుక్రవారం న్యూఢిల్లీలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని విన్‌గ్రూప్ కంపెనీ ఆసియా సీఈఓ ఫామ్ సాన్ చౌ కలిశారు. తెలంగాణ రాష్ట్రంలో కీలక ప్రాజెక్టులను నెలకొల్పేందుకు సంసిద్ధత వ్యక్తం చేశారు. ఎలక్ట్రిక్ వెహికల్ (ఈవీ) తయారీ యూనిట్లు, బ్యాటరీ స్టోరేజ్ యూనిట్లను స్థాపించేందుకు విన్‌గ్రూప్ ఆసక్తి ప్రదర్శించింది. సోలార్, విండ్ పవర్ ఉత్పత్తి అవకాశాలను పరిశీలిస్తోంది. తెలంగాణ ప్రభుత్వం కొత్తగా ఏర్పాటు చేస్తున్న భారత్ ఫ్యూచర్ సిటీలో పెట్టుబడులకు ఉన్న అవకాశాలను విన్‌గ్రూప్ ఆసియా సీఈఓ ఫామ్ సాన్ చౌ సీఎం తో చర్చించారు. ఫ్యూచర్ సిటీ ఏర్పాటు పట్ల ముఖ్యమంత్రి దార్శనికతను ఆయన అభినందించారు. ఫ్యూచర్ సిటీ అభివృద్ధిలో పెట్టుబడి పెట్టడానికి సంసిద్ధతను వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా డిసెంబర్ 8-9 తేదీలలో జరగనున్న తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ 2025లో పాల్గొనాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి.. ఫామ్ సాన్ చౌ తో పాటు విన్‌గ్రూప్ ఛైర్మన్ ఫామ్ నాట్ వూంగ్‌లను ఆహ్వానించారు. రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సంజయ్ కుమార్, ముఖ్యమంత్రి కార్యాలయ ప్రత్యేక కార్యదర్శి బి.అజిత్ రెడ్డి, సెక్రెటరీ కోఆర్డినేషన్ డాక్టర్ గౌరవ్ ఉప్పల్ ఈ సమావేశంలో పాల్గొన్నారు.

## కులతత్వ విషం, ముస్లింలీగ్-మావోయిస్టు కాంగ్రెస్‌ను ప్రజలు తిరస్కరించారు: నరేంద్ర మోదీ



కులతత్వ విషాన్ని చిమ్మేవారిని, ముస్లిం లీగ్-మావోయిస్టు భావజాలం కలిగిన వారిని బీహార్ ప్రజలు తిరస్కరించారని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు. సూరత్‌లో స్థిరపడిన బీహారీలు ఏర్పాటు చేసిన సన్మాన కార్యక్రమంలో ఆయన ప్రసంగిస్తూ, దశాబ్దకాలంగా ఓటములపై కాంగ్రెస్ పార్టీ ఆత్మపరిశీలన చేసుకోవాలని సూచించారు. ముస్లింలీగ్-మావోయిస్టు కాంగ్రెస్‌ను ప్రజలు తిరస్కరించారని ఆయన అన్నారు. మాజీ ప్రధానులు ఇందిరా గాంధీ, రాజీవ్ గాంధీలతో పనిచేసిన కాంగ్రెస్ జాతీయ నాయకులు కూడా రాహుల్ గాంధీ వ్యవహారశైలితో తీవ్ర అసంతృప్తితో ఉన్నారని ఆయన అన్నారు. కాంగ్రెస్ మిత్రపక్షాలు, కార్యకర్తలకు కూడా పరాజయం గురించి వివరించే పరిస్థితి ఆ పార్టీలో లేదని ఆయన విమర్శించారు. ఈవీఎంలు, ఎన్నికల సంఘం, ఓటరు జాబితా సమగ్ర సవరణ ప్రక్రియను నిందించే సులభ మార్గాన్ని కాంగ్రెస్ పార్టీ ఎంచుకుందని ఆయన అన్నారు. కులతత్వ విషాన్ని చిమ్ముతున్న వారిని ప్రజలు తిరస్కరిస్తారని బీహార్ ఎన్నికలు మరోసారి రుజువు చేశాయని ఆయన అన్నారు. దళితులు అధికంగా ఉండే 38 స్థానాల్లో ఎన్డీయే 34 స్థానాలను గెలుచుకుందని ఆయన తెలిపారు.

# దేశ 'ఏరో ఇంజిన్ రాజధాని'గా తెలంగాణ

**2030 నాటికి తీర్చిదిద్దేలా కాంప్రెహెన్సివ్ రోడ్డు మ్యాప్**
**'ఏరోస్పేస్, డిఫెన్స్ మ్యానుఫ్యాక్చరింగ్ సమ్మిట్'లో**
**మంత్రి శ్రీధర్ బాబు**







2030 నాటికి తెలంగాణను దేశ "ఏరో ఇంజిన్ రాజధాని"గా తీర్చిదిద్దాలన్నదే తమ ప్రభుత్వ సంకల్పమని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. ఇందుకోసం ప్రపంచంతో పోటీపడేలా దిగ్గజ పరిశ్రమలు, ప్రముఖ విద్యాసంస్థల భాగస్వామ్యంతో "ఏరోస్పేస్, డిఫెన్స్ ఎకోసిస్టమ్"ను రాష్ట్రంలో అభివృద్ధి చేసేందుకు కాంప్రెహెన్సివ్ రోడ్డు మ్యాప్ ను రూపొందిస్తున్నామన్నారు. 'ఎండ్ టూ ఎండ్ ఎకోసిస్టం' కోసం గత కాంగ్రెస్ ప్రభుత్వాలు వేసిన పునాదులే ప్రస్తుతం తెలంగాణను దేశ స్ట్రాటెజిక్ డిఫెన్స్ హబ్ గా మార్చాయని వివరించారు. కాలేజ్ ఆఫ్ డిఫెన్స్ మేనేజ్ మెంట్, ఐఎస్ బీ, ముంజాల్ ఇన్స్టిట్యూట్ ఫర్ గ్లోబల్ మ్యానుఫ్యాక్చరింగ్ సంయుక్తాధ్వర్యంలో శనివారం గచ్చిబౌలి లోని ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ (ఐఎస్ బీ)లో నిర్వహించిన 'ఎంపవరింగ్ ఆత్మనిర్భర్ భారత్: ఇండియాస్ ఏరోస్పేస్ %డ% డిఫెన్స్ మ్యానుఫ్యాక్చరింగ్ సమ్మిట్'కు ఆయన ముఖ్య అతిథిగా హాజరై కీలకోపన్యాసం(కీ నోట్ అడ్రస్) చేశారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ... ప్రపంచవ్యాప్తంగా ఏఅండ్ డీ రంగంలో నమోదవుతున్న వేగవంతమైన వృద్ధిని మనకు అనుకూలంగా మార్చుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తుందన్నారు. ఇటీవలి కాలంలో అంతర్జాతీయ స్థాయిలో జరుగుతున్న పరిణామాల వల్ల గ్లోబల్ సప్లై చెయిన్ ఒత్తిడికి గురవుతుందని, ఈ తరుణంలో విశ్వసనీయమైన సరఫరాదారుల కోసం ప్రపంచం ముఖ్యంగా 'భారత్' లాంటి దేశాలవైపు చూస్తోందన్నారు. గతేడాది దేశ రక్షణ రంగ ఉత్పత్తుల విలువ రికార్డు స్థాయిలో రూ.1.5 లక్షల కోట్ల మార్కును దాటిందన్నారు. రక్షణ రంగ ఎగుమతుల్లో 12 శాతం వృద్ధి రేటు నమోదు కావడం ఈ రంగ పురోగతికి నిదర్శనమన్నారు. 2047 నాటికి తెలంగాణను 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మార్చాలనే లక్ష్య సాధనలో 'ఏరోస్పేస్ అండ్ డిఫెన్స్' రంగం కీలక పాత్ర పోషించేలా సమగ్ర ప్రణాళికలు రూపొందించి అమలు చేస్తున్నామన్నారు. ఇప్పటికే రాష్ట్రంలో 25కు పైగా 'ఏఅండ్ డీ' అంతర్జాతీయ, జాతీయ దిగ్గజ సంస్థలు, సుమారు 1500కు పైగా ఎంఎస్ఎంఈలు 'తెలంగాణ బ్రాండ్' ను విశ్వవ్యాప్తం చేస్తున్నాయన్నారు. రాష్ట్ర ఏరోస్పేస్ ఎగుమతుల విలువ 2023-24లో రూ.15,900 కోట్లు కాగా 2024-25లో కేవలం మొదటి తొమ్మిది నెలల్లోనే రూ.30,742 కోట్లకు పెరగడం రాష్ట్ర ప్రభుత్వ పనితీరుకు నిలువెత్తు సాక్ష్యమన్నారు. ఆదిభట్లలో రూ.425 కోట్ల పెట్టుబడితో ఏర్పాటు చేసిన 'టాటా%-%సాఫ్రాన్' ఫెసిలిటీ ఇటీవల అందుబాటులోకి వచ్చిందన్నారు.

త్వరలోనే రూ.800 కోట్లతో జేఎస్ డబ్ల్యూ డిఫెన్స్ 'యూఏవీ మాన్యూఫ్యాక్చరింగ్ యూనిట్', రూ.500 కోట్లతో ప్రీమియర్ ఎక్స్‌ప్లోజివ్స్ డిఫెన్స్ ఫెసిలిటీ కూడా వస్తాయన్నారు. ఈ తరహాలోనే పెట్టుబడులు పెట్టేందుకు మరికొన్ని దిగ్గజ సంస్థలు కూడా ఆసక్తి చూపిస్తున్నాయన్నారు. కార్యక్రమంలో హీరో ఎంటర్ ప్రైజెస్ ఛైర్మన్ సునీల్ కాంత్ ముంజాల్, ఐఎస్ బీ డీన్ ప్రొఫెసర్ పి.మదన్, ప్రొఫెసర్ చందన్ చౌదరి తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ కాంగ్రెస్ నాయకులకు రాహుల్ అభినందన







తెలంగాణ సీఎం రేవంత్, పీసీసీ చీఫ్ మహేశ్, డిప్యూటీ సీఎం భట్టి ఢిల్లీలో రాహుల్ గాంధీతో సమావేశం అయ్యారు. జూబ్లీహిల్స్ ఉపఎన్నికలో ఘన విజయం సాధించినందుకు రాహుల్ వారిని అభినందించారు. ఈ సందర్భంగా ఢిల్లీకి వచ్చిన కొత్తగా ఎన్నికైన ఎమ్మెల్యే నవీన్ యాదవ్‌కు రాహుల్‌గాంధీ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఏఐసీసీ అధ్యక్షులను మర్యాద పూర్వకంగా కలిసి రాష్ట్ర పార్టీ వ్యవహారాల గురించి తెలియచేశారు. ఇటీవల జరిగిన జూబ్లీహిల్స్ ఎన్నికల్లో ఘన విజయం సాధించడం జరిగినదని తెలిపారు. జూబ్లీహిల్స్ ఎన్నికల్లో విజయం సాధించిన నవీన్ యాదవ్‌ని పరిచయం చేశారు.

## ఫాస్టాగ్‌లేనివారికి టోల్ ప్లాజాల వద్ద రెట్టింపు ఛార్జీల నిబంధన సడలింపు

### ఇకపై కేవలం 25 శాతం అదనపు రుసుము చెల్లిస్తే సరిపోతుంది




న్యూ డిల్లీ 15 ఫాస్టాగ్ లేకుండా జాతీయ రహదారుల పై ప్రయాణించే వాహనదారులకు కేంద్రం గుడ్‌న్యూస్ చెప్పింది. ఫాస్టాగ్‌లేనివారికి టోల్ ప్లాజాల వద్ద విధిస్తున్న రెట్టింపు ఛార్జీ ల నిబంధనను సడలించింది. ఇకపై కేవలం 25 శాతం అదనపు రుసుము చెల్లిస్తే సరిపోతుందని స్పష్టం చేసింది. ఈ కొత్త నిబంధన నేటి నుంచి అమల్లోకి వచ్చింది. జాతీయ రహదారులపై ప్రయాణించే వాహనదారులు ఫాస్టాగ్ తప్పనిసరిగా తీసుకుంటున్న విషయం తెలిసిందే. ఫాస్టాగ్ లేనివారు టోల్ రుసుముకు రెండింతలు చెస్తున్నారు. నగదు రూపంలో అయినా యూపీఐ ద్వారా చెల్లించినా ఇదే నిబంధన వర్తిస్తోంది. నేషనల్ హైవేలపై టోల్ ఫీజుగా రూ.100 చెల్లించాల్సి ఉంటే.. రూ.200 వరకూ వసూలు చేసే వారు. అయితే, ఆ నిబంధనలను కేంద్రం తాజాగా సడలించింది. తాజా నిబంధనల ప్రకారం.. ఫాస్టాగ్‌లేని వాహనదారులు యూపీఐ ద్వారా టోల్ ఛార్జీ చెల్లిస్తే 25 శాతం అదనంగా చెల్లిస్తే సరిపోతుంది. రూ.100కు 25 శాతం అదనంగా అంటే రూ.125 చెల్లించి వెళ్లొచ్చు. నగదు రూపంలో చెల్లిస్తే మాత్రం రెట్టింపు ఛార్జీ కట్టాల్సిందే. డిజిటల్ పేమెంట్స్‌ను ప్రోత్సహించేందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది.

**బీఆర్ఎస్**
**ఓటమికి 5 కారణాలు!**
వార్తా 2 లో

ప్రజాబలం

16 నవంబర్ 2025 ఆదివారం

# బీఆర్ఎస్ ఓటమికి 5 కారణాలు!

హైదరాబాద్ , నవంబర్ 15 తెలంగాణ రాజకీయాలను మలుపు తిప్పే ఉపఎన్నికగా జూబ్లీహిల్స్ ఉపఎన్నిక ఫలితాన్ని అందరూ భావించారు. రెండేళ్ల కాంగ్రెస్ సర్కార్ పాలనపై ఓ పరీక్షగా ఈ ఉపఎన్నికను భావిస్తే, రాజకీయంగా కోల్పోయిన ప్రాభవాన్ని నిలబెట్టుకునేందుకు బీఆర్ఎస్‌కు మంచి అవకాశంగా మరో పరీక్షగా విశ్లేషణలు జరిగాయి. కానీ, జూబ్లీ హిల్స్ ఉపఎన్నిక ఫలితం మాత్రం బీఆర్ఎస్‌కు మరో చేదు అనుభవాన్ని మిగిల్చింది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక జరిగిన రెండో ఉపఎన్నికలో కూడా తన సిట్టింగ్ స్థానాన్ని గులాబీ పార్టీ కోల్పోయింది. అయితే ఈ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఓటమికి ఐదు ప్రధాన కారణాలు ప్రముఖంగా చెప్పవచ్చు. ఈ కథనం పూర్తిగా చదివితే ఆ ఐదు కారణాలేంటో స్పష్టంగా అర్థమవుతాయి.

1. అధికార పార్టీ పాలనకు రెఫరెండం

ఈ ఉపఎన్నిక కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక జరిగిన రెండో ఉపఎన్నిక. 2024 లో కంటోన్మెంట్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే లాస్య నందిత అకాల మరణంతో వచ్చిన ఉపఎన్నికలో ఆమె సోదరి నివేదిత బరిలో నిలిచింది. అయితే అప్పటికే అధికారంలోకి వచ్చిన ఊపులో హస్తం పార్టీ కంటోన్మెంట్ స్థానాన్ని హస్తగతం చేసింది. ఆ తర్వాత జూబ్లీ హిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ మరణంతో ఆయన సతీమణి మాగంటి సునీత కారు పార్టీ అభ్యర్థిగా ఉపఎన్నికలో పోటీ చేసింది. అయితే రిజల్ట్ సేమ్. కంటోన్మెంట్ ఉపఎన్నిక ఫలితమే జూబ్లీ హిల్స్‌లో పునరావృతమైంది. హస్తం పార్టీ అధికారంలోకి వచ్చిన రెండేళ్ల తర్వాత వచ్చిన ఉపఎన్నిక ఇది. కాంగ్రెస్ పాలనకు ఇది ప్రజాతీర్పు లాంటిది. ప్రభుత్వ వ్యతిరేకత తీవ్రంగా ఉందని, అది ఈ ఉపఎన్నిక ద్వారా బయటపడుతుందని బీఆర్ఎస్ నేతలు భావించారు. 'ఆరు గ్యారంటీలు' అమలు కావడం లేదని ఇది జూబ్లీహిల్స్ ఓటరు తీర్పు ద్వారా బహిర్గతం అవుతుందని భావించారు. కానీ, కాంగ్రెస్ పార్టీపై జూబ్లీ ఓటర్లు సానుకూలంగా ఉన్నట్లు ఈ ఫలితం తేల్చి చెప్పింది. అభివృద్ధి, సంక్షేమం, 'ఆరు గ్యారంటీలు' అమలు చేసే పాలన తీరుకు ఓటర్లు సానుకూలంగా తీర్పు ఇచ్చినట్లు అర్థమవుతోంది. తాము ఏం చేస్తున్నారో సీఎం రేవంత్ రెడ్డితోపాటు, మంత్రులు, ఎమ్మెల్యేలు, కాంగ్రెస్ క్యాడర్ ప్రజల్లోకి తీసుకెళ్లడంలో సఫలం అయ్యారు. దానికి నిదర్శనమే జూబ్లీహిల్స్ ఉపఎన్నికలో భారీ మెజార్టీతో బీఆర్ఎస్ సిట్టింగ్ స్థానాన్ని కాంగ్రెస్ హస్తగతం చేసుకుంది. అయితే ప్రభుత్వ తప్పులను ఎత్తి చూపడంలో బీఆర్ఎస్ పార్టీ పూర్తిగా విఫలమైంది.

2. ఎం.ఐ.ఎం. మద్దతుతో మైనారిటీ ఓట్ల ఏకీకరణ

జూబ్లీహిల్స్‌లో మైనారిటీ ఓటర్లు విజయాన్ని ప్రభావితం చేసే కీలక అంశం. ఈ నియోజకవర్గంలో మైనారిటీ ఓట్లు సుమారు 1.4 లక్షలు ఉన్నాయి. అయితే ఈ ఓట్లను తమ వైపు తిప్పుకోవడంలో బీఆర్ఎస్ విఫలమైంది. పాత మిత్రపక్షం అయిన ఎం.ఐ.ఎం. కాంగ్రెస్‌తో జట్టు కట్టడంతో బీఆర్ఎస్‌కు గతంలో పడిన మైనారిటీ ఓట్లకు గండిపడింది. ఎం.ఐ.ఎం. ఈ ఉపఎన్నికలో పోటీ చేయకుండా కాంగ్రెస్‌కు బహిరంగంగా మద్దతు ప్రకటించింది. అదే రీతిలో మైనారిటీ ఓట్లను ఆకట్టుకునేందుకు మాజీ క్రికెటర్ అజారుద్దీన్‌కు మంత్రి పదవిని హస్తం పార్టీ కట్టబెట్టింది. దీంతో మైనారిటీ ఓట్లను కాంగ్రెస్ దక్కించుకోవడంలో సక్సెస్ అయింది. దీంతో గులాబీ పార్టీకి మైనారిటీ వర్గం ఈ ఎన్నికలో మొండి చేయి చూపడంతో సిట్టింగ్ స్థానాన్ని కోల్పోవడానికి ముఖ్య కారణంగా మారింది.

3. పనిచేయని మాగంటి 'సానుభూతి' అస్త్రం, కుటుంబ వివాదాలు

మూడు సార్లు ఎమ్మెల్యేగా ఉన్న మాగంటి గోపీనాథ్ సతీమణి సునీతను బీఆర్ఎస్ తన అభ్యర్థిగా నిలబెట్టింది. సానుభూతి ఓట్లు పడి సులభంగా గెలుస్తుందన్నది బీఆర్ఎస్ పార్టీ వ్యూహం. కానీ, ఇది బెడిసికొట్టింది. మాగంటి గోపీనాథ్ సేవలు, సునీతపై సానుభూతి అంశాన్ని జూబ్లీహిల్స్ ఓటర్లు పెద్దగా పరిగణనలోకి తీసుకోలేదు. దీంతో పాటు ఎన్నికల సమయంలోనే మాగంటి సునీత కుటుంబ గొడవలు రచ్చకు దారి తీశాయి. మాగంటి గోపీనాథ్ మొదటి భార్య,, తల్లి జోక్యం చేసుకోవడం వల్ల అప్పటి వరకు ఎంతో కొంత ఉన్న సానుభూతి ఓటు కూడా చీలిపోయింది. ఈ విషయంలో బీఆర్ఎస్ పార్టీకి 'ప్లాన్ బి' లేకుండా పోయింది. దీంతో అనుకున్న రీతిలో సానుభూతి ఓట్లను బీఆర్ఎస్ దక్కించుకోవడంలో పూర్తిగా విఫలమైంది.

4. ప్రచారంలో కానరాని అగ్రనాయకత్వం

ఓ వైపు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థికి ఏకంగా సీఎం రేవంత్ రెడ్డి కాలికి బలం కట్టుకొని ప్రచారం చేస్తుంటే, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ మాత్రం ప్రచారానికి పూర్తిగా దూరంగా ఉన్నారు. అంతేకాకుండా, సీఎం హోదాలో ఇంతగా ప్రచారం చేయాలా అంటూ ఆ పార్టీ ముఖ్య నేతలు ఎద్దేవా చేశారు. తమ విజయం నల్లేరుపై నడకే అన్నట్లుగా ఃఖీూ ముఖ్య నేతలు ఉదాసీనంగా వ్యవహరించారు. తన పాలనపై తానే స్వయంగా ప్రజలను ఒప్పించడానికి సీఎం రేవంత్ ప్రయత్నిస్తుంటే, దానికి వ్యతిరేకంగా బీఆర్ఎస్ నుంచి సరైన రీతిలో కౌంటర్ అటాక్ చేయడంలో విఫలమైంది. ఇక పార్టీ ట్రబుల్ షూటర్‌గా పేరున్న హరీశ్ రావు కీలకమైన సమయంలో తండ్రి మరణంతో ప్రచారంలో పూర్తిగా నిమగ్నం కాలేకపోయారు. దీంతో కేటీఆర్ ఒక్కడిపైనే అధిక భారం పడింది. మరోవైపు కాంగ్రెస్ మంత్రులు, ముఖ్య నేతలు డివిజన్ల వారీగా ప్రచారంలోనూ, కాంగ్రెస్ వ్యూహాల అమలులో కీలకంగా వ్యవహరిస్తే, అదే స్థాయిలో బీఆర్ఎస్ నేతల భాగస్వామ్యం కొరవడింది. ఈ అంశం కూడా బీఆర్ఎస్ ఓటమికి ప్రధాన కారణంగా మారింది.

5. బీఆర్ఎస్ సెటిలర్ ఓటర్లకు గండి కొట్టిన కాంగ్రెస్

జీహెచ్ఎంసీ పరిధిలో గులాబీ పార్టీ వికసించడానికి కీలకమైన 'సెటిలర్ల' ఓట్లను ఈ దఫా హస్తం పార్టీ హస్తగతం చేసుకుంది. నియోజకవర్గంలోని కమ్మ సామాజిక వర్గం ఓట్లు, ఆంధ్ర ప్రాంతం నుంచి వచ్చిన 'సెటిలర్ల' ఓట్లు ఎక్కువగా ఉన్నాయి. అయితే బీఆర్ఎస్‌కు పడకుండా కాంగ్రెస్ వ్యూహాత్మకంగా పోల్ మేనేజ్‌మెంట్ చేసింది. సీఎం రేవంత్ రెడ్డి ఆయా వర్గాల వారితో సమావేశాలు నిర్వహించడం వంటివి ఫలితానిచ్చాయి. మరోవైపు 'సెటిలర్లు' కూడా అధికారంలో ఉన్న పార్టీతోనే తమ సమస్యలు పరిష్కారం అవుతాయన్న ధోరణి కూడా బీఆర్ఎస్ పార్టీకి చేటు చేసింది. ఈ అంశంపై బీఆర్ఎస్ కీలక నేతలు దృష్టి సారించకపోవడం కూడా ఆ పార్టీ ఓటమికి ప్రధాన కారణంగా మారింది. ఈ కారణాలన్నీ మిళితమై చివరకు సిట్టింగ్ స్థానాన్ని బీఆర్ఎస్ కోల్పోవడానికి దారి తీసింది. అయితే ఈ ఉపఎన్నిక ఫలితం తర్వాత 'కారు' జోరు పెంచడానికి పార్టీ అధినేత కేసీఆర్ ఎలాంటి కీలక నిర్ణయాలు తీసుకుంటారో వేచి చూడాల్సిందే.

## కాంగ్రెస్ ఖేల్...ఖతం... బైబై... టాటా... గుడ్ బై... గయా

బిహార్ ఎన్నికల చిత్రం స్పష్టమైంది. 243 స్థానాల్లో 203 స్థానాలతో ఎన్డీఏ రికార్డు విజయం దిశగా దూసుకుపోయింది, మహాకూటమి ఖాతాలో 35 సీట్లు మాత్రమే వస్తున్నాయి. 2020తో పోలిస్తే ఎన్డీఏ 70కి పైగా సీట్లు సాధించగా, మహాకూటమికి అంతే నష్టం జరిగింది. కాంగ్రెస్ పరిస్థితి మరీ దారుణంగా ఉంది, కేవలం 4 సీట్లు మాత్రమే సాధించింది. కాంగ్రెస్ మరోసారి అసెంబ్లీ ఎన్నికల్లో ఓడిపోయింది. అయితే ఇది కొత్తేమీ కాదు, 2014 నుంచి 2025 వరకు చూస్తే, ఇప్పుడు కాంగ్రెస్ ఓటమికి అలవాటు పడి ఉంటుంది.అయితే, గత 11 ఏళ్లలో కాంగ్రెస్ ఎన్ని ఎన్నికల్లో ఓడిపోయిందో, ఏయే రాష్ట్రాల్లో ఓడిపోయింది గత 11 ఏళ్లలో మూడుసార్లు లోక్‌సభ ఎన్నికలు జరిగాయి. లోక్‌సభ ఎన్నికలు ప్రతి 5 సంవత్సరాలకు ఒకసారి జరుగుతాయి. ఇది 11 సంవత్సరాల వ్యవధిలో మూడు పూర్తి సైకిల్స్‌ను కవర్ చేస్తుంది.మొదటి ఎన్నిక- 2014లో 16వ లోక్‌సభకు ఎన్నికలు జరిగాయి, అప్పుడు ఏప్రిల్ 7 నుంచి మే 12 వరకు 9 దశల్లో పోలింగ్ జరిగింది. మొత్తం 543 స్థానాలకు 8,251 మంది అభ్యర్థులు బరిలో నిలిచారు. 66.4 శాతం పోలింగ్ నమోదైంది, ఇది అప్పటి వరకు అత్యధికం. ఫలితాల్లో బీజేపీ 282 సీట్లు గెలుచుకుంది, ఇది 272 సీట్ల మెజారిటీ కంటే ఎక్కువ, అయితే కాంగ్రెస్ కేవలం 44 సీట్లు మాత్రమే గెలుచుకుంది. ఈ ఎన్నికల నుంచే కాంగ్రెస్ కేంద్రంలో అధికారం కోల్పోయింది.రెండో ఎన్నిక- 2019లో 17వ లోక్‌సభకు ఎన్నికలు జరిగాయి, అప్పుడు ఏప్రిల్ 11 నుంచి మే 19 వరకు 7 దశల్లో పోలింగ్ జరిగింది. ఇక్కడ కూడా 543 సీట్లు ఉన్నాయి. 67.4 శాతం పోలింగ్ జరిగింది. బీజేపీ 303 సీట్లు సాధించగా, కాంగ్రెస్ కేవలం 52 సీట్లు మాత్రమే గెలుచుకుంది.మూడో ఎన్నిక- 2024లో 18వ లోక్‌సభకు ఎన్నికలు జరిగాయి. ఏప్రిల్ 19 నుంచి జూన్ 1 వరకు 7 దశల్లో ఎన్నికలు జరిగాయి. 65.79% ఓటింగ్ జరిగింది. బీజేపీ 240 సీట్లు గెలుచుకోగా, ఎన్డీఏ మొత్తం 293 సీట్లు సాధించింది. నరేంద్ర మోదీ మూడోసారి ప్రధానమంత్రి అయ్యారు. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ 99 సీట్లు గెలుచుకుంది, ఇది 2014 తర్వాత అత్యుత్తమ ప్రదర్శన.ఈ ఎన్నికలు జాతీయ రాజకీయాలను బీజేపీ కేంద్రంగా మార్చాయి, ఇక్కడ నరేంద్ర మోదీ నేతృత్వంలోని ఎన్డీఏ బలమైన ప్రభుత్వాలను ఏర్పాటు చేసింది, దేశంలో కాంగ్రెస్ పార్టీ క్రమంగా కనుమరుగయ్యే పరిస్థితులు కనిపిస్తున్నాయి. ఢిల్లీ స్థాయిలోనూ, క్షేత్ర స్థాయిలోనూ ఆ పార్టీ క్రమంగా పట్టు కోల్పోతుంది. ప్రతి రాష్ట్రంలో ప్రాంతీయ పార్టీలపైన ఆధారపడి ఉండటంతో హస్తం పార్టీకి ఈ దుస్థితి పట్టింది. అదే కర్ణాటక, తెలంగాణలో జాతీయ పార్టీగానే కాంగ్రెస్ పోటీ చేసి అధికారంలోకి వచ్చింది. కానీ మిగిలిన చోట్ల ప్రాంతీయ పార్టీలు ఇచ్చే సీట్లపైనే ఆధారపడి ఉండాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. 2004కు ముందు పరిస్థితులు ఏంటి? 2014 తర్వాత ఏంటి? అన్నది కాంగ్రెస్ పార్టీ పరిస్థితిని చూస్తేనే అర్థమవుతుంది. పదేళ్లు దేశంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పటికీ దేశంలోని అన్ని రాష్ట్రాల్లో కాంగ్రెస్ పార్టీ క్షేత్ర స్థాయిలో బలాన్ని పెంచుకోలేకపోయింది.. నెహ్రూ కాలం నుంచి ఇందిరాగాంధీ, రాజీవ్ గాంధీ హయాంలోనూ ఉత్తర్ ప్రదేశ్ లో కాంగ్రెస్ కు మంచి పట్టు ఉండేది. పటిష్టమైన ఓటు బ్యాంకు ఉండేది. కానీ రాను రాను రాహుల్ గాంధీ జమానాకు వచ్చే సరికి ఉత్తర్ ప్రదేశ్, పశ్చిమ బెంగాల్, బీహార్, ఢిల్లీ, మహారాష్ట్ర, ఒడిశా వంటి రాష్ట్రాల్లో తమ పట్టును కోల్పోయింది. ఒకప్పుడు ఈ ఈ రాష్ట్రాల్లో కాంగ్రెస్ పిడికిలి బిగించి గెలిచేది. కానీ ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. బీజేపీని తట్టుకోవాలంటే ప్రాంతీయ పార్టీలతో కలసి వెళ్లాలని అనుకోవడమే ఆ పార్టీ తనకు తానే ఆత్మహత్య చేసుకునే పరిస్థితికి వచ్చింది. కేవలం రాజస్థాన్, మధ్య ప్రదేశ్, కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల్లో మాత్రమే ఒంటరిగా పోటీ చేస్తున్న కాంగ్రెస్ మిగిలిన రాష్ట్రాల్లో మాత్రం ప్రాంతీయ పార్టీల మద్దతు కోసం అర్రులు చాస్తుంది. బీహార్ లోనూ కాంగ్రెస్ పార్టీ ఆర్జేడీ బలపడటానికి పరోక్షంగా కారణమయింది. బలమైన కాంగ్రెస్ నేతలు విడిపోయి ప్రాంతీయ పార్టీలు పెట్టుకున్నారు. అది కూడా పార్టీకి ఇబ్బందిగా మారింది. మహారాష్ట్రలోనూ పొత్తులతోనే బరిలోకి దిగింది. ఒకప్పుడు బలమైన నాయకత్వం రాష్ట్రాల్లో ఉండేది. కానీ రానురాను రాష్ట్రాల్లో లీడర్ షిప్ బలహీనంగా మారింది. బీహార్ లోనూ అదే జరిగింది. మహా ఘట్ బంధన్ పేరుతో కూటమి ఏర్పాటు చేసుకున్నప్పటికీ, రాహుల్ కాశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకూ పాదయాత్ర చేపట్టినప్పటికీ రాష్ట్రాల్లో బలహీనమవుతుంది. కాంగ్రెస్ బీహార్ లో సింగిల్ డిజిట్ కు పడిపోయినా ఆశ్చర్యం లేదు. ఎంఐఎం కంటే తక్కువ స్థానాల్లో లీడ్ లో ఉంది. అదీ నాలుగు అసెంబ్లీ నియోజకవర్గాల్లోనే అది మెజారిటీలో కనిపిస్తుంది. నిజానికి బీహార్ లో మోదీ, నితీష్ కుమార్ అంటే నమో కాంబినేషన్ బాగా వర్క్ అవుట్ అయింది. ఎన్డీఏ కూటమి ఇచ్చిన హామీలు కూడా బాగా పనిచేశాయి. నితీష్ కుమార్ కు ముఖ్యంగా మహిళల ఓట్లు అనుకూలంగా ఏకపక్షంగా పడినట్లు కనిపిస్తుంది. నితీష్ కుమార్ ప్రభుత్వం మద్యపాన నిషేధం అమలు చేయడంతో అనేక కుటుంబాలు ఆనందంగా ఉన్నాయి. అలాగే ఎన్నికల నోటిఫికేషన్ కు ముందు నితీష్ కుమార్ పది వేల రూపాయలు మహిళల ఖాతాల్లో జమ చేయడం కూడా కూటమికి కలిసి వచ్చింది. సీమాంచల్ లో ఆర్జేడీకి పట్టుంది. అలాంటి ప్రాంతంలోనూ బీజేపీ, జేడీయూలు గెలవడమంటే ప్రజలు ఇక ఎన్డీఏ కూటమికి తిరుగులేని విజయాన్ని అందించడానికి సిద్ధమయినట్లు కనిపించింది.ఇక ఎన్డీఏ కూటమి తొలి నుంచి ఒక పద్ధతి ప్రకారం వెళుతుంది. సీట్ల సర్దుబాటులోనూ ఎలాంటి అలకలు, ఇబ్బందులు లేకుండా చూసుకోగలిగింది. ముఖ్యమంత్రి అభ్యర్థిగా నితీష్ కుమార్ ను ప్రకటించింది. అదే సమయంలో అన్ని సామాజికవర్గాల నేతలను దగ్గరకు తీసుకుని ఓటర్లకు దగ్గరయ్యే ప్రయత్నం ఎన్డీఏ కూటమి చేసింది. ఇక పోల్ మేనేజ్ మెంట్ విషయంలో కానీ, ప్రచారంలో కానీ బీజేపీ కూటమి మహా ఘట్ బంధన్ కంటే ముందంజలో ఉంది. ఆర్జేడీ వస్తే అవినీతి హెచ్చుమీరిపోతుందన్న బీజేపీ అందులోనూ మోదీ పదే పదే చేసిన ప్రచారం ప్రజల్లోకి చొచ్చుకు వెళ్లింది. అన్నీ కలిసి బీజేపీ కూటమిని కలసి వచ్చినట్లే కనిపిస్తుంది. ఇక మోదీకి తిరుగులేదు. వరసగా ఒక్కొక్క రాష్ట్రంలో కాంగ్రెస్ ను దానికి మద్దతిచ్చే పార్టీలను ఖతం చేస్తూ పోతుంది.దీన్ని బట్టి చూస్తే దేశ వ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ క్రమంగా పట్టు కోల్పోతుంది. అందుకే రాహుల్ గాంధీ డైలాగ్ లాగానే కాంగ్రెస్ ఖేల్...ఖతం... బైబై... టాటా... గుడ్ బై... గయా అన్న డైలాగు గుర్తుకొస్తుంది

## నూతన ఎంబిబిఎస్ విద్యార్థులకు ఓరియంటేషన్ కార్యక్రమం లో పట్నం మహేందర్ రెడ్డి



చేవెళ్ల డాక్టర్ పట్నం మహేందర్ రెడ్డి జనరల్ హాస్పిటల్, వైద్య కళాశాలలో నూతన ఎంబిబిఎస్ విద్యార్థులకు ఓరియంటేషన్ కార్యక్రమం.ముఖ్య అతిథిగా పాల్గొన్న వైద్య కళాశాల చైర్మన్, శాసనమండలిలో ప్రభుత్వ చీఫ్ విప్
డాక్టర్ పట్నం మహేందర్ రెడ్డి, విద్యావేత్త,
డైరెక్టర్ వరదా రెడ్డి,ప్రిన్సిపల్ జోయారాణీ,
మెడికల్ సూపరన్ టెండెంట్ రామకృష్ణారెడ్డి.
జ్యోతి వెలిగించి ప్రారంభించిన మహేందర్ రెడ్డి. ప్రతిభావంతులైన వైద్య విద్యార్థులకు నగదు బహుమతులు గా మెడికల్ కౌన్సిలింగ్ నుండి బంగారు పతకం అందుకున్న
శివాని గౌడ్ లక్ష రూపాయలు, రూ. 75,000 సునీల్ ఘాట్ కర్, ముహమ్మద్ అజ్మిన్ 50,000, ముసైబా కు రూ. 25000 చెక్కులను అందించిన చేసిన మహేందర్ రెడ్డి,వరదారెడ్డి తదితరులు. అకాడమిక్ డైరెక్టర్ డాక్టర్ గౌరీ,వైస్ ప్రిన్సిపల్ రాజేశ్వరరావు,జీఎం నగేష్,ఎంజీఎం రవివర్మ, సీఓఓ అజీమ్ తదితరులు ఆయనతో ఉన్నారు.

## ట్రాన్స్ఫార్మర్ లకు ఫెన్సెయింగ్ ఏర్పాటు కై పరిశీలిస్తున్న టీ ఎస్ పి డి సి ల్ అధికారులు.

## ప్రజాపాలన ఇంచార్జి చిన్నరెడ్డి మాజి మంత్రికి బి. సతీష్ గౌడ్ ధన్యవాదములు






**గోషామహల్ ప్రజాబలం ప్రతినిధి:** 15 శనివారం నవంబర్ 2025 గోషామహల్ నియోజకవర్గం లోని ట్రాన్స్ఫార్మర్ ఫెన్సింగ్ ఏర్పాటు, స్విచ్ బోర్డు ల మార్మతులు, ప్రమాదకరంగా వున్న ట్రాన్స్ఫార్మర్ లచ్చుట్టు వున్న దబ్బాలను తొలిగించాలని సి మ్ ప్రజావాణి లో చిన్నరెడ్డి మాజీ మంత్రి ఇంచార్జ్ ప్రజావాణి ని ప్రజాభవన్ లో కలిసి గోషామహల్ నియోజకవర్గం డెవలప్మెంట్ ఫోరమ్ తరఫున కన్వినర్ బి. సతీష్ గౌడ్, చేతన్, అశోక్, చెందు,నరేందర్, లోహిత్, ఇఫతేఖర్, శివ వినతిపత్రం సమర్పించిన వెంటనే చిన్నరెడ్డి సంబంధిత అధికారులతో మాట్లాడి తగు చర్యలు తీసుకువాలని కోరిన వెంటనే వారి ఆదేశాల మేరకు ఉదయం 7గంటలకు మెట్రో tspdcl చీఫ్ ఇంజనీర్ ప్రభాకర్ , మరియుప్రాజెక్ట్ డైరెక్టర్శివాజీ,ఎస్ ఇ శ్రీనివాస్ ఫరత్ అలీ డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ,సహాయ డివిజనల్ ఇంజనీర్ శిరీష సుల్తాంబజార్,ఏ ఇ ప్రణవిద్ పుతలిబౌలి, ట్రూప్ బజార్, సహాయ ఇంజనీర్ పలు ప్రాంతాలలో వున్న ట్రాబ్స్ఫార్మర్ లను పరిశీలించి తొందరగా ప్రజలకు, మూగజీవులకు హాని కలగకుండా చర్యలు తీసుకుంటాము అని తెలిపినందులకు విచ్చేసిన అధికారులకు కృతజ్ఞతలు, మరియు ప్రజాపాలన ఇంచార్జి చిన్నరెడ్డి మాజీ మంత్రికి కూడా ధన్యవాదములు తెలిపిన ఫోరమ్ కన్వినర్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బి. సతీష్ గౌడ్.

# కీలక మలుపులు తిరుగుతున్న పరకామణికేసు

తిరుమల, నవంబర్ 15,తిరుమల పరకామణి చోరీ కేసులో కీలక ఫిర్యాదుదారు సతీష్ కుమార్ అనుమానాస్పదంగా చనిపోయారు. ఆయన మాజీ అసిస్టెంట్ విజిలెన్స్ సెక్యూరిటీ ఆఫీసర్ (ఏవీఎస్ఓ). ఈ ఘటన నవంబర్ 13, 2025న జరిగింది. అనంతపురం జిల్లా తాడిపత్రి సమీపంలోని కోమలి గ్రామం వద్ద రైల్వే ట్రాక్ మీద ఆయన మృతదేహం దొరికింది. సతీష్ కుమార్ వయసు 45 సంవత్సరాలు. తిరుపతి సమీపంలో నివసించేవారు. భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఉదయం 7 గంటల సమయంలో స్థానికులు మృతదేహాన్ని చూశారు. రైలు ఢీకొని చనిపోయినట్లు కనిపించినా, శరీరంపై గాయాలు అసహజంగా ఉన్నాయని స్థానికులు చెబుతున్నారు. తాడిపత్రి పోలీసులు అనుమానాస్పద మరణం కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్ట్‌మార్టంకు తరలించారు. ఫోరెన్సిక్ బృందం పరిశీలిస్తోంది. కుటుంబ సభ్యులు ఆత్మహత్య కాదని, హత్యే అని చెబుతున్నారు. పరకామణి చోరీ కేసు 2023 ఏప్రిల్‌లో మొదలైంది. భక్తులు సమర్పించిన బంగారు, నగలు, విదేశీడాలర్లను రవికుమార్ అనే పెద్దజీయర్ మఠం ఉద్యోగి దొంగిలిస్తూండగా పట్టుకున్నారు. ఆయనపై సతీష్ కుమార్ మొదటి ఫిర్యాదు చేశారు. పెద్ద జీయర్ మఠం గుమస్తా రవి కుమార్ 920 అమెరికన్ డాలర్లు దొంగిలిస్తూ దొరికిపోయారని కేసు నమోదు చేశారు. అయితే ఆ తర్వాత ఆయన రవికుమార్ తో లోక్ అదాలత్ లో రాజీ చేసుకున్నారు. దొంగతో రాజీ చేసుకోవడం ఏమిటన్న విమర్శలు వచ్చాయి. కొత్త ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఈ విషయం వెలుగులోకి వచ్చింది. 2025 అక్టోబర్‌లో హైకోర్టు ఆదేశంతో సీఐడీ దర్యాప్తు మొదలైంది. సీఐడీ డీజీ రవిశంకర్ అయ్యన్నార్ నేతృత్వంలో బృందం విచారణ ప్రారంభించారు.

రవికుమార్ ఆస్తులను కొన్ని టీటీడీ పేరన రిజిస్టర్ చేసి..మిగతా పెద్ద మొత్తంలో ఆస్తులను ఇతర వైసీపీ నేతలు, అప్పటి టీటీడీ అధికారులు స్వాహా చేశారని ఆరోపణలు ఉన్నాయి. సతీష్ కుమార్‌ను నవంబర్ 6న తిరుపతి పద్మావతి అతిథి గృహంలో విచారించారు. మరోసారి హాజరు కావాలని నోటీసు ఇచ్చారు. ఆ తర్వాతే ఆయన చనిపోయారు. దీంతో హత్య అనుమానం పెరిగింది. సతీష్ మొబైల్, వాహనం ఇతర విషయాలను సీఐడీ అధికారులు పరిశీలిస్తున్నారు.సతీష్ కుమార్ ను ఎవరైనా హత్య చేశారా.. పరకామణి కేసులో ఆయన ఎవరి ఒత్తిడితో రాజీ చేసుకున్నారు.. రవికుమార్ ఆస్తులను ఎవరెవరు రాయించుకున్నారన్నది ఆయనకు తెలిసే అవకాశం ఉంది. ఒత్తిడి చేసిన పెద్దలే.. అసలు నిందితులు అవుతారు. ఆ విషయాలన్నీ? సతీష్ కుమార్ బయట పెడితే.. కేసు చిక్కుముడి వీడిపోతుంది. ఇలాంటి సమయంలో ఆయన అనుమానాస్పదంగా మృతి చెందడం సంచలనంగా మారింది

# డ్రోన్ ట్యాక్సీలు...

కర్నూలు, నవంబర్ 15, ఏపీవాసులకు సీఎం చంద్రబాబు శుభవార్త వినిపించారు. ఏపీలో త్వరలోనే డ్రోన్ ట్యాక్సీలను అభివృద్ధి చేస్తామని ప్రకటించారు. విశాఖ సీఐఐ సదస్సులో మాట్లాడిన చంద్రబాబు.. డ్రోన్ ట్యాక్సీలపై కీలక వ్యాఖ్యలు చేశారు. మరోవైపు ఏపీలో డ్రోన్ సిటీ, స్పేస్ సిటీలకు వర్చువల్‌గా శంకుస్థాపన జరిగింది. కర్నూలు జిల్లా ఓర్వకల్లులో డ్రోన్ సిటీ.. తిరుపతి, సత్యసాయి జిల్లాలలో స్పేస్ సిటీలను అభివృద్ధి చేయనున్నారు. సీఎం చంద్రబాబు, కేంద్ర మంత్రి పీయూష్ గోయెల్ చేతుల మీదుగా ఈ కార్యక్రమం జరిగింది.విశాఖపట్నం వేదికగా జరుగుతున్న సీఐఐ భాగస్వామ్య సదస్సులో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కీలక ప్రకటన చేశారు. ఆంధ్రప్రదేశ్ నుంచి త్వరలోనే డ్రోన్ ట్యాక్సీలను ప్రారంభిస్తామని చంద్రబాబు ప్రకటించారు. ఏపీని పెట్టుబడులకు గేట్ వేగా తీర్చిదిద్దుతున్నామని అన్నారు. మరోవైపు సీఐఐ సదస్సుకు 72 దేశాల నుంచి 522 మంది ప్రతినిధులు హాజరయ్యారు. అలాగే 2,500 మంది పారిశ్రామికవేత్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడిన చంద్రబాబు.. ఏపీ ప్రభుత్వం టెక్నాలజీ రంగం అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తోందన్నారు. ఈ క్రమంలోనే ఏరో స్పే?స్, డ్రోన్, డిఫెన్స్ కారిడార్లను ఏర్పాటు చేస్తున్న సంగతిని చంద్రబాబు వివరించారు. మరోవైపు చంద్రబాబు ప్రకటన తర్వాత డ్రోన్ ట్యాక్సీ అంటే ఏమిటనే దానిపై చర్చ మొదలైంది.డ్రోన్ ట్యాక్సీ అనేది ఓ ఎలక్ట్రిక్ ఎయిర్ క్రాఫ్ట్. ఇది రిమోటెడ్‌గా లేదంటే స్వయంగా పనిచేస్తుంది. డ్రోన్ ట్యాక్సీ సాయంతో ప్రయాణికులను, సరుకులను రవాణా చేస్తుంటారు.

డ్రోన్ ట్యాక్సీనే ఎలక్ట్రిక్ వర్టికల్ టేకాఫ్ అండ్ ల్యాండింగ్ వెహికల్ అని పిలుస్తుంటారు. రవాణాకు వేగవంతమైన, సమర్థవంతమైన ప్రత్యామ్నాయాన్ని అందించేందుకు ప్రపంచంలోని పలు దేశాలు ఈ డ్రోన్ ట్యాక్సీలను అభివృద్ధి చేస్తున్నాయి. చైనా వంటి కొన్ని దేశాలలో ఇప్పటికే అందుబాటులో ఉన్నాయి.మరోవైపు డ్రోన్ టాక్సీలు హెలికాప్టర్ల మాదిరిగానే పనిచేస్తాయి. అయితే పైలెట్ సాయం లేకుండానే తక్కువ దూరం ప్రయాణాలకు ఇవి ఉపయోగపడుతుంటాయి. ప్రయాణికులకు ఒకచోట నుంచి మరోచోటకు వేగంగా తీసుకెళ్లటంలో డ్రోన్ ట్యాక్సీలు ఉపయోగపడుతున్నాయి. ఇవి అందుబాటులోకి వస్తే ట్రాఫిక్ కష్టాలకు కూడా చెక్ పెట్టొచ్చని అధికారులు చెప్తున్నారు.మరోవైపు ఏపీలో డ్రోన్ సిటీ, స్పేస్ సిటీలకు శుక్రవారం శంకుస్థాపన జరిగింది. విశాఖపట్నం సీఐఐ సదస్సు వేదికగా సీఎం నారా చంద్రబాబు నాయుడు. కేంద్రమంత్రి పీయూష్ గోయెల్ చేతుల మీదుగా వర్చువల్‌గా ఈ కార్యక్రమం జరిగింది. కర్నూలు జిల్లా ఓర్వకల్లులో డ్రోన్ సిటీని నిర్మించనున్నారు. మొత్తంగా 300 ఎకరాల్లో డ్రోన్ సిటీ నిర్మాణం జరగనుంది.

ఓర్వకల్లు డ్రోన్ సిటీలో టెస్టింగ్- సర్టిఫికేషన్ సెంటర్లు ఏర్పాటుచేస్తారు.అలాగే 25 వేల మందికి ట్రైనింగ్ ఇచ్చేలా సౌకర్యాలు కల్పిస్తారు. ఇక తిరుపతి, శ్రీసత్యసాయి జిల్లాల్లో స్పేస్ సిటీ ఏర్పాటు చేయనున్నారు. స్పేస్ సిటీ వలన 10 సంవత్సరాలలో రూ.25వేల కోట్లు పెట్టుబడులు వస్తాయని అంచనా. అలాగే 35 వేల మందికి ఉపాధి లభిస్తుందని అధికారులు చెప్తున్నారు. ఈ డ్రోన్ సిటీ , స్పేస్ సిటీలకు కేంద్రం సహకరించాలని చంద్రబాబు కోరారు.

# ఎల్‌ఆర్‌ఎస్ కు జనవరి 23 వరకు గడువు

విజయవాడ, నవంబర్ 15, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం లేఔట్ క్రమబద్ధీకరణ పథకం (ఎల్‌ఆర్‌ఎస్) గడువును వచ్చే ఏడాది జనవరి 23 వరకు పొడిగించింది. అనధికారిక ప్లాట్లను క్రమబద్ధీకరించుకోవడానికి ఇది మంచి అవకాశం. 2025 జూన్ 30కి ముందు కొనుగోలు చేసిన ప్లాట్లకు ఈ పథకం వర్తిస్తుంది. ఇంటి స్థలాలకు ఓపెన్ స్పేస్ ఛార్జీలో 50% రాయితీ కూడా అందిస్తున్నారు. ఈలోపు అనధికారికంగా ఉన్న ప్లాట్లను క్రమబద్ధీకరించుకుంటే ఎలాంటి ఇబ్బందులు ఉండవు. ఎల్‌ఆర్‌ఎస్ ద్వారా అనధికార లేఔట్లలో స్థలాలు కొన్న వారికి మంచి అవకాశం వచ్చిందనే చెప్పాలి. కొంతమంది అమాయకంగా అనుమతులు లేని లేఔట్‌లలో స్థలాలు కొనుగోలు చేసి మోసపోతున్నారు. ఈఎంఐ ఆప్షన్, తక్కువ ధరకు వస్తుందని కొనుగోలు చేయడం వల్లే ఇలా జరుగుతోంది. వారికి కూడా ఎల్‌ఆర్‌ఎస్‌తో ఎంతో ఉపయోగం.ఇలా అనధికారిక లేఔట్‌లో స్థలాలు కొనుగోలుచేసేవారు ఎల్‌ఆర్‌ఎస్ వినియోగించుకోవచ్చు. ఏపీ ప్రభుత్వం 2025 జూన్ 30కి ముందు కొనుగోలు చేసిన ప్లాట్లను క్రమబద్ధీకరించుకోవడానికి అవకాశం కల్పించింది. వాస్తవానికి ఎల్‌ఆర్‌ఎస్ గడువు ఈ ఏడాది అక్టోబర్ 23 పూర్తైంది.. కానీ మరోసారి 2026 జనవరి 23 వరకు పొడిగించింది. దీని కోసంఎల్‌టీపీ (లైసెన్స్ టెక్నికల్ పర్సన్) ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తులు సమర్పించాల్సి ఉంటుంది. ప్రభుత్వం చెప్పిన పీనలైజేషన్, ఇతరత్రా ఛార్జీలు చెల్లించాల్సి ఉంటుంది.

స్థలం మీదే మీకు హక్కు ఉందని చూపించడానికి, 2025 జూన్ 30 లోపు రిజిస్ట్రేషన్ పత్రాలను తప్పనిసరిగా సమర్పించాలి. ఈ పత్రాలతో పాటు, మీ స్థలం ఎంత ఉందో, దాని చుట్టూ ఏమున్నాయో, పక్కనున్న రోడ్లు ఎంత వెడల్పు ఉన్నాయో తెలిపే సైట్ ప్లాన్‌ను కూడా జతచేయాలి. అంతేకాకుండా, సబ్‌రిజిస్ట్రార్ సంతకం చేసిన ఈసీ మరియు మార్కెట్ విలువ సర్టిఫికేట్ కూడా అవసరం. భూమిని ఒక అవసరం నుంచి మరో అవసరానికి మార్చినట్లు తెలిపే ల్యాండ్ యూజ్ కన్వెర్షన్ సర్టిఫికేట్ కూడా చూపించాలి. వీటితో పాటు, ఏదైనా నష్టం జరిగితే బాధ్యత వహిస్తామని తెలిపే ఇండెమ్నిటీ బాండ్, రోడ్డు విస్తరణ కోసం చేసుకున్న ఒప్పంద పత్రం కూడా ఇవ్వాల్సి ఉంటుంది. ఈ పత్రాలన్నీ సమర్పించడం ద్వారా స్థలంపై మీ యాజమాన్యాన్ని ధృవీకరించుకోవచ్చు.ఒకవేళ ఎల్‌ఆర్‌ఎస్ కింద ఇంటి స్థలాలు క్రమబద్ధీకరించుకుంటే.. వారికి ప్రభుత్వం బంపరాఫర్ ప్రకటించింది. ఓపెన్ స్పేస్ ఛార్జిలో 50% రాయితీ ఇస్తోంది. ఖాళీ స్థలాలపై నిబంధనల ప్రకారం 14% ఛార్జీలు ఉంటే.. ప్రస్తుతం 7% చెల్లిస్తే సరిపోతుంది. ఈ దరఖాస్తులు భారీగా వస్తాయని అంచనా వేస్తున్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు ఉపయోగించుకోవాలని.. ప్రభుత్వం మరోసారి గడువు పెంచే అవకాశం లేదంటున్నారు. ఒకవేళ క్రమబద్ధీకరించుకోకపోతే ఇబ్బందులు ఎదురవుతాయంటున్నారు. అనధికారిక లేఔట్లలో నిర్మాణాలు చేపట్టాలంటే ప్రభుత్వం అనుమతి ఇవ్వదు. ఒకవేళ ఎవరైనా అనుమతి లేకుండా నిర్మాణాలు చేపట్టినా చట్టవిరుద్ధం.. వాటిని కూల్చేస్తారు.

అమ్మకాలు, కొనుగోలుకు ఛాన్స్ లేకుండా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో నిషేధిత భూముల జాబితాలో చేర్చేస్తారు. అలాగే ఖాళీ స్థలాలకు వీఎల్‌టీ (వేకెంట్ ల్యాండ్ ట్యాక్స్) వేయరు. ఒకవేళ ఇల్లు నిర్మించుకోవాలనుకుంటే.. బ్యాంకుల నుంచి రుణాలు కూడా రావు. తాత్కాలిక నిర్మాణాలకు కూడా నంబర్లు ఇవ్వరు. మున్సిపాలిటీలు, కార్పొరేషన్లు ఆ లేఔట్లలో మౌలిక సదుపాయాలు కల్పించదు.

## కేంద్ర మాజీ మంత్రి ఆర్‌కే సింగ్‌పై బీజేపీ వేటు..

పాట్నా , నవంబర్ 15 క్రమశిక్షణా చర్యల్లో భాగంగా బీజేపీ అధిష్ఠానం కీలక నిర్ణయం తీసుకుంది. కేంద్ర మాజీ మంత్రి, బీహార్‌కు చెందిన సీనియర్ నేత ఆర్‌కే సింగ్‌ను పార్టీ నుంచి సస్పెండ్ చేసింది. బీహార్ రాష్ట్ర ఎన్నికల్లో బీజేపీ విజయం సాధించిన మరుసటి రోజే ఈ చర్య తీసుకోవడం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నారనే ఆరోపణలతో ఆయనపై ఈ వేటు వేసినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి.కొంతకాలంగా ఆర్‌కే సింగ్ ఎన్డీయే నాయకత్వంపైనా, బీహార్‌లోని నితీశ్ కుమార్ ప్రభుత్వంపైనా తీవ్ర ఆరోపణలు చేస్తూ వార్తల్లో నిలుస్తున్నారు. ఈ నేపథ్యంలో పార్టీ ఆయనకు షోకాజ్ నోటీసు జారీ చేసింది. “మీరు పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నారు. ఇది క్రమశిక్షణ ఉల్లంఘన కిందకు వస్తుంది. దీనివల్ల పార్టీకి నష్టం వాటిల్లింది. అందుకే మిమ్మల్ని పార్టీ నుంచి సస్పెండ్ చేస్తున్నాం. మిమ్మల్ని పార్టీ నుంచి ఎందుకు బహిష్కరించకూడదో వారం రోజుల్లోగా వివరణ ఇవ్వాలి” అని బీజేపీ జారీ చేసిన నోటీసులో స్పష్టం చేసింది.గతంలో దౌత్యవేత్తగా, మన్మోహన్ సింగ్ హయాంలో కేంద్ర హోం సెక్రటరీగా పనిచేసిన ఆర్‌కే సింగ్, 2013లో బీజేపీలో చేరారు. బీహార్‌లోని ఆరా లోక్‌సభ స్థానం నుంచి 2014, 2019లలో రెండుసార్లు ఎంపీగా గెలిచారు. 2017లో మోదీ కేబినెట్‌లో కేంద్ర విద్యుత్ శాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టారు. అయితే, 2024 లోక్‌సభ ఎన్నికల్లో ఆయన ఓటమి పాలయ్యారు.

# సత్తా చాటిన విశాఖ పోర్టు

విశాఖపట్టణం, నవంబర్ 15, విశాఖ పోర్టు సత్తా చాటింది. స్వచ్ఛత కార్యక్రమాల్లో దేశంలోనే మొదటి స్థానంలో నిలిచింది. 2024 ఏడాదికి గానూ.. ఓడరేవులు, షిప్పింగ్, జలమార్గాల మంత్రి సర్బానంద సోనోవాల్ చేతుల మీదుగా అవార్డు అందుకుంది. విశాఖ పోర్టు అథారిటీ.. పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యమిస్తూ, మొక్కలు నాటడం, సఫాయి మిత్రసురక్ష వంటి కార్యక్రమాలను విజయవంతంగా అమలు చేసిందని పోర్టు చైర్మన్ ఎం అంగముత్తు తెలిపారు. గతేడాది మూడో స్థానంలో నిలిచిన విశాఖ పోర్టు.. ఈసారి మొదటి స్థానాన్ని కైవసం చేసుకుంది.విశాఖపట్నం పోర్టు సత్తా చాటింది. స్వచ్ఛ కార్యక్రమాల్లో విశాఖ పోర్టు అథారిటీ .. దేశంలోని పరిశ్రమల విభాగంలో మొదటి స్థానంలో నిలిచింది. దేశవ్యాప్తంగా ఉన్న మేజర్ పోర్టులతో పోటీపడీ మరీ తొలి స్థానంలో నిలిచింది. ముంబయిలో జరిగిన కార్యక్రమంలో ఓడరేవులు, షిప్పింగ్, జలమార్గాల మంత్రి సర్బానంద సోనోవాల్.. విశాఖ పోర్టు ఛైర్మన్ డాక్టర్ ఎం అంగముత్తుకు స్వచ్ఛత అవార్డు ప్రదానం చేశారు. కేంద్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టిన స్వచ్ఛత పఖ్వాడ అవార్డ్స్ కార్యక్రమంలో.. 2024 ఏడాదికి గానూ విశాఖ పోర్టుకు ఈ అవార్డు లభించింది.అవార్డు తీసుకున్న సందర్భందా ఎం అంగముత్తు మాట్లాడారు. పోర్టులో పర్యావరణ పరిరక్షణకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్లు తెలిపారు. కేంద్రం సూచించిన విధంగా మొక్కలు నాటించి, సఫాయి మిత్రసురక్ష వంటి కార్యక్రమాలను విజయవంతంగా అమలు చేశామని తెలిపారు. కాగా స్వచ్ఛత పఖ్వాడ అవార్డ్స్ 2023 ఎడిషన్‌లో.. విశాఖ పోర్టు జాతీయ స్థాయిలో మూడవ స్థానాన్ని దక్కించుకుందని తెలిపారు. ఈసారి ప్రధాన ఓడరేవులతో పోటీ పడి మొదటి స్థానాన్ని కైవసం చేసుకుందన్నారు. స్వచ్ఛత మిషన్ పట్ల వీపీఏ నిబద్ధతకు ఈ అవార్డు నిదర్శనం అని చెప్పారు. దాని వల్లే వీపీఏ.. 2024లో అగ్రస్థానానికి చేరుకుందన్నారు.ఈ స్వచ్ఛత అవార్డు.. పర్యావరణ సంరక్షణ, స్థిరమైన ఓడరేవు కార్యకలాపాల్లో.. విశాఖ పోర్టు నాయకత్వాన్ని బలోపేతం చేసిందని అంగముత్తు పేర్కొన్నారు. ఉద్యోగులు, వ్యాపార భాగస్వాములు, పీపీపీ నిర్వాహకులు, కార్మిక సంఘాల నాయకుల సహాయ, సహకారాలతో ఇలాంటి లక్ష్యాలు సాధిస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో పోర్టు కార్యదర్శి టి వేణుగోపాల్, చీఫ్ ఇంజినీర్ ఎస్ఎస్ఆర్‌సీ మూర్తి, సీఎంఈ రాంప్రసాద్, సీఎంఓ డాక్టర్ ఎస్ ఉషాదేవి తదితరులు పాల్గొన్నారు.మరోవైపు, గతేడాది విశాఖపట్నం పోర్టు సరికొత్త రికార్డు సృష్టించింది. సరుకు రవాణాకు సంబంధించి 2024-25 ఆర్థిక సంవత్సరంలో.. 249 రోజులకు గానూ 55 మిలియన్ మెట్రిక్ టన్నుల సరుకు రవాణా చేసినట్లు ఎం అంగముత్తు తెలిపారు. 2023-24 ఆర్థిక సంవత్సరం మొత్తంలో 81.09 మిలియన్ మెట్రిక్ టన్నుల సరుకు విశాఖ పోర్టు ద్వారా రవాణా చేశామన్నారు. విశాఖపట్నం పోర్టు చరిత్రలో ఇదే ఇప్పటి వరకూ అత్యధికమని వెల్లడించరారు. అయితే ఈ క్రమంలోనే 2024-25 ఆర్థిక సంవత్సరంలో 90 మిలియన్ మెట్రిక్ టన్నుల సరుకు రవాణా చేయాలని విశాఖపట్నం పోర్టు లక్ష్యంగా పెట్టుకుంది. అయితే 2024-25 ఆర్థిక సంవత్సరం ముగిసే సరికి 82.62 టన్నుల సరుకు రవాణా చేసింది. గతేడాది కంటే ఇది 6 శాతం ఎక్కువ.

# సీఐఐ సదస్సులో కనిపించని మిత్రపక్షాలు

విశాఖపట్టణం, నవంబర్ 15, విశాఖలో పెట్టుబడుల సదస్సు ప్రారంభం అయింది. ఏపీ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఏర్పాట్లు చేసింది. ఆంధ్ర యూనివర్సిటీ ఇంజినీరింగ్ కాలేజీ వేదికగా ఈ సదస్సు రెండు రోజులపాటు కొనసాగుతోంది. ప్రపంచం నలుమూలల నుంచి దిగ్గజ పారిశ్రామికవేత్తలు పెద్ద ఎత్తున తరలిరానున్నారు. గత కొంతకాలంగా ఏపీ ప్రభుత్వం ఈ సదస్సుకు సన్నాహాలు ప్రారంభించింది.

సీఎంతో పాటు మంత్రులు స్వయంగా వెళ్లి ఆహ్వానాలు అందించారు. దాదాపు పది లక్షల కోట్ల పెట్టుబడులు వస్తాయని ప్రభుత్వం అంచనా వేస్తోంది. అయితే ఇంతటి ప్రతిష్టాత్మక కార్యక్రమానికి ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ రావడం లేదా? అనే వార్త హల్చల్ చేస్తోంది. పౌర సంబంధాల శాఖ విడుదల చేసిన అతిధుల జాబితాలో ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ పేరు లేకపోవడం ఇప్పుడు హాట్ టాపిక్ అవుతుంది. అసలు పవన్ వస్తారా? రారా? అనేది స్పష్టత లేకుండా పోయింది. గత కొద్ది రోజులుగా అటవీ శాఖ భూముల పరిశీలనతో పాటు ఎర్రచందనం నిల్వలను పరిశీలించారు పవన్ కళ్యాణ్. ఏకంగా వైసీపీ మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఆక్రమించిన భూముల వీడియోలను తీసి మంత్రివర్గ సహచరులకు చూపించారు. గత రెండు రోజులుగా రాజకీయంగా సైతం హాట్ టాపిక్ అవుతున్నారు.అయితే కూటమి ప్రభుత్వ విధానాలు చూస్తుంటే ఒక అంశం స్పష్టంగా కనిపిస్తుంది.

సీఎం చంద్రబాబు ప్రభుత్వాన్ని సాఫీగా నడుపుతున్నారు. పవన్ కళ్యాణ్ రాజకీయంగా డ్యామేజ్ జరిగినప్పుడు బయటకు వస్తున్నారు. అటు లోకేష్ తెలుగుదేశం పార్టీ బాధ్యతలను తన శాఖ ప్రగతి, ఏపీకి పెట్టుబడులు, విదేశీ వ్యవహారాలను చూస్తున్నారు. ఈ ముగ్గురు నేతలు ఇలా కీలక బాధ్యతల్లో సర్దుబాటు అయ్యారు. పవన్ కళ్యాణ్ కదలికలు చూస్తే ఆయన గ్రామీణ ప్రాంత అభివృద్ధి, పర్యటనలు చేస్తున్నారు. అయితే విదేశాల నుంచి పరిశ్రమలతో పాటు పెట్టుబడులు తెచ్చే బాధ్యతను లోకేష్ తీసుకున్నారు. అయితే ఈ విషయంలో చక్కటి సమన్వయం కనిపిస్తోంది. విభిన్న ప్రకటనలు, నిర్ణయాలు ప్రకటించక పోవడాన్ని మనం గుర్తించాలి. ముఖ్యంగా ఇది అనుకునే చేస్తున్నదే.విశాఖ పెట్టుబడుల సదస్సుకు సంబంధించి ప్రభుత్వం పౌర సంబంధాల శాఖ ద్వారా భారీగా ప్రకటనలు ఇచ్చింది.

అయితే ఈ యాడ్లలో ప్రధాని నరేంద్ర మోడీ, కేంద్ర పరిశ్రమల శాఖ మంత్రి పియాష్ గోయల్, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్ ఫోటోలు ఉన్నాయి. సీఎం చంద్రబాబు ఈ ప్రకటన ఇస్తున్నట్టు అందులో ఉంది. మరి ప్రకటనల్లోనే పవన్ కళ్యాణ్ కు అంత ప్రాధాన్యం ఉంటే.. కచ్చితంగా ఆయన సదస్సుకు హాజరవుతారని అంతా భావించారు. కానీ అతిధుల జాబితాలో ఉపరాష్ట్రపతి రాధాకృష్ణన్, గవర్నర్ అబ్దుల్ నజీర్, ఏపీ సీఎం చంద్రబాబు, మంత్రులు నారా లోకేష్, నాదేండ్ల మనోహర్, టీజీ భరత్ తో పాటు సిఐఐ కోఆర్డినేటర్ల పేర్లు మాత్రమే ఉన్నాయి.

దీంతో పవన్ కళ్యాణ్ ఈ సదస్సుకు హాజరయ్యే అవకాశం లేదా అనే చర్చ నడుస్తోంది. వైసీపీ అనుకూల మీడియా అయితే దీనిని హైలెట్ చేస్తోంది. క్రమేపి పవన్ కళ్యాణ్ ని సైడ్ చేస్తున్నట్లు చెప్పుకొస్తోంది.

# వలంటీర్లు కు దీటుగా మరో వ్యవస్థ..

విజయవాడ, నవంబర్ 15, తెలుగుదేశం పార్టీ పై ఫుల్ ఫోకస్ పెట్టారు నారా లోకేష్. ప్రస్తుతం ఆ పార్టీకి జాతీయ అధ్యక్షుడిగా చంద్రబాబు ఉన్నారు. రాష్ట్ర అధ్యక్షుడిగా పల్లా శ్రీనివాస్ ఉన్నారు. కానీ మంత్రి లోకేష్ మాత్రం అనధికారికంగా పార్టీని నడుపుతున్నారు. అయితే గతంలో ఎన్నడూ లేని విధంగా తెలుగుదేశం పార్టీలో సుదీర్ఘకాలం ఉండి.. పోరాటం చేసిన వారికి మాత్రమే నామినేటెడ్ పదవుల్లో పెద్దపీట వేశారు. పదవుల నియామకం సమయంలో వారు పార్టీకి చేసిన సేవల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అటువంటి వారికి మాత్రమే పదవులు కట్టబెట్టారు. అయితే ఇప్పుడు సంస్థాగత నిర్మాణంపై దృష్టి పెట్టారు నారా లోకేష్. మండల, పంచాయితీ, క్లస్టర్, బూత్ స్థాయిలో టిడిపి కమిటీలను నియమించారు. ఆ కార్యవర్గాల ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని సైతం.. పదవుల స్వీకరణ మాదిరిగా నిర్వహిస్తున్నారు. ఒక విధంగా చెప్పాలంటే పార్టీలు ప్రతి ఒక్కరిని భాగస్వామ్యం చేస్తున్నట్టే. ప్రాంతీయ పార్టీలకు అది అవసరం కూడా. ఇప్పటికే బీమా సదుపాయం కల్పించి రికార్డు సృష్టించారు. తెలుగుదేశం పార్టీ సభ్యత్వం తీసుకున్న ప్రతి ఒక్కరికి ఈ బీమా వర్తింపజేసేలా చేశారు.దేశంలో చాలా ప్రాంతీయ పార్టీలు ఉన్నాయి. కానీ అవి కొద్ది రోజులకే అనేక రకాల ఇబ్బందులను ఎదుర్కొన్నాయి. అటువంటి ఇబ్బందులే తెలుగుదేశం పార్టీకి ఎదురయ్యాయి. కానీ వాటన్నింటినీ అధిగమించి ముందుకు సాగింది తెలుగుదేశం పార్టీ. దేశంలో చాలా ప్రాంతీయ పార్టీలు బలహీనం అయ్యాయి. కానీ తెలుగుదేశం పార్టీకి మాత్రం ఆ పరిస్థితి లేదు. ఎన్టీఆర్ బలమైన పునాదులు వేస్తే.. దానికి మరింత బలం జోడించారు చంద్రబాబు. ఇప్పుడు లోకేష్ తరంలో సైతం పార్టీ నిర్మాణాన్ని మరింత బలంగా చేపట్టాలని ఈ క్లస్టర్ విధానాన్ని తెరపైకి తీసుకొచ్చారు. పార్టీ అంటే అభిమానం ఉండే ప్రతి ఒక్కరిని ఇందులో భాగస్వామ్యం చేశారు.2024 ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చింది. ఆ పార్టీ నేతృత్వంలోని కూటమి పాలన చేస్తోంది. గత అనుభవాల దృష్ట్యా తెలుగుదేశం పార్టీకి విలువైన సమయాన్ని కేటాయిస్తున్నారు చంద్రబాబు, లోకేష్. అధికార కార్యక్రమాల కోసం ఏ జిల్లాకు వెళ్తున్న.. తగిన సమయాన్ని పార్టీ కోసం కేటాయిస్తున్నారు. పార్టీ కార్యకర్తలతో మాట్లాడుతున్నారు. ఈ క్రమంలోనే క్లస్టర్ ఇన్చార్జిల ఆలోచన లోకేష్ కు వచ్చింది. పార్టీ విధానాలతో పాటు ప్రభుత్వ అంశాలను ప్రజల్లోకి, పార్టీ శ్రేణుల్లోకి తీసుకెళ్లేందుకు ఈ క్లస్టర్ ఎంతగానో దోహదపడుతోంది. అందుకే నామినేటెడ్ పదవుల మాదిరిగా ఈ క్లస్టర్ ఇన్చార్జిల నియామకాన్ని కూడా చేపడుతున్నారు. ఒక్క విధంగా చెప్పాలంటే వాలంటీర్ల వ్యవస్థకు ధీటుగా ఈ క్లస్టర్ వ్యవస్థ ఎంతో ప్రయోజనకారిగా మిగలనుంది.

# సతీష్ కుమార్ మృతి కేసులో కీలక మలుపు-

## పరకామణి చోరీతో లింక్ ఉందన్న కుటుంబ సభ్యులు

తిరుపతి , నవంబర్ 15 తిరుమల పరకామణిలో విదేశీ డాలర్లు చోరీకి గురయ్యాయని గతంలో ఫిర్యాదు చేసి సతీష్ మృతి కేసు సంచలనంగా మారుతోంది. విచారణకు బయల్దేరిన ఆయన రైలు పట్టాలై విగతజీవుడిగా పడి ఉండట అనేక అనుమానాలకు తావిస్తోంది. మొదట్లో ఇది ఆత్మహత్య అంటూ ప్రచారం జరిగింది. తర్వాత కుటుంబ సభ్యుల దీనిపై అనుమానం వ్యక్తం చేశారు. పోలీసులకు ఫిర్యాదు చేయడంతో హత్య కేసులో నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు.టీటీడీలో ఏవీఎస్‌వోగా పని చేసిన సతీష్ కుమార్ పరకామణిలో అక్రమాలు జరిగాయని ఫిర్యాదు చేశారు. తర్వాత ఈ కేసులో ఆయన్ని కీలక వ్యక్తిగా దర్యాప్తు అధికారులు భావించి విచారణ చేస్తున్నారు. ఈ దర్యాప్తులో భాగంగా ఇప్పటికే సిట్ ముందు ఒకసారి హాజరయ్యారు. శుక్రవారం విచారణకు వస్తున్న క్రమంలో హఠాత్తుగా రైలు పట్టాలపై చనిపోయి పడి ఉన్నారు. ఇది రాష్ట్రంలో సంచలనంగా మారింది. ప్రభుత్వం కూడా దాన్ని చాలా సీరియస్‌గా తీసుకొని కేసును దర్యాప్తు చేస్తోంది.ప్రస్తుతం గుంతకల్లు డివిజన్‌లో పని చేస్తున్నారు. పరకామణి చోరీ కేసులో ఇప్పటికే ఈనెల ఆరో తేదీన విచారణ ఎదుర్కొన్నారు. శుక్రవారం విచారణ కోసం ఆయన గుంతకల్లు నుంచి ట్రైన్‌లో బయల్దేరారు. ఉదయానికి విజయవాడ చేసుకొని ఉంటారని ఫ్యామిలీ భావించింది. కానీ ఆయన తాడిపత్రి మండలం కోమలి రైల్వేస్టేషన్ సమీపంలో పట్టాల పక్కన శవమై కనిపించాడు. ఇది అందర్నీ షాక్‌కి గురి చేసింది మొదట్లో ఇది ఆత్మహత్య అంటూ ప్రచారం జరిగింది. కానీ కుటుంబ సభ్యులు మాత్రం సతీష్ మరణంపై అనుమానం వ్యక్తం చేశారు. గుత్తి జీఆర్పీపీఎస్‌లో బంధువులు ఫిర్యాదు చేశారు. ఎఫ్ఎఆర్ నం.75/2025గా కేసు నమోదు చేసిన పోలీసులు హత్యగా నిర్ధారిస్తూ దర్యాప్తు ప్రారంభించారు.

# పెరిగిన లోకేష్ ఇమేజ్

విజయవాడ, నవంబర్ 15, బీహార్ లో ఎన్డీఏ దూసుకెళ్లింది. జేడీయుతో పాటు బిజెపి భారీ విజయం దిశగా దూసుకు వెళ్తోంది. దీంతో దేశవ్యాప్తంగా ఎన్డీఏ భాగస్వామ్య పక్షాలు సంబరాల్లో మునిగిపోయాయి. ఏపీలో సైతం సందడి నెలకొంది. సరిగ్గా విశాఖలో పెట్టుబడుల సదస్సు ప్రారంభమైన వేళ.. బీహార్లో ఎన్డీఏ విజయం చంద్రబాబుతో పాటు లోకేష్ లో ఎనలేని ఆనందం నింపింది. కేంద్ర ప్రభుత్వ సహకారంతో ఈ పెట్టుబడుల సదస్సు జరుగుతున్న సంగతి తెలిసిందే. పైగా ఈ గెలుపులో మంత్రి నారా లోకేష్ సైతం కీలక భాగస్వామి కావడం విశేషం. ఎన్నికల ప్రచారంలో భాగంగా చివరి రెండు రోజులు మంత్రి నారా లోకేష్ బీహార్లో పర్యటించారు. ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. దీంతో ఎన్డీఏ ముఖ్యమంత్రి ప్రమాణ స్వీకారానికి లోకేష్ ప్రత్యేక ఆహ్వానం అందే అవకాశముంది. ఎన్డీఏ భాగస్వామ్య పక్షాలుగా టిడిపి, జనసేన ఉండడంతో సీఎం చంద్రబాబుతో పాటు డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ కు సైతం బిజెపి పెద్దలు ఆహ్వానించే అవకాశం ఉంది. కానీ మంత్రి నారా లోకేష్ ను ప్రత్యేక అతిథిగా భావించే ఛాన్స్ కూడా కనిపిస్తోంది. వాస్తవానికి సీఎం చంద్రబాబు బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో ప్రచారం చేస్తానని ప్రకటించారు.



కానీ ఇంతలో విశాఖ పెట్టుబడుల సదస్సు, ఆపై విదేశీ పర్యటనలతో ఆయన బిజీగా మారారు. బీహార్లో తెలుగు ఓటర్లు తక్కువే అయినా.. ఏపీలో నిర్మాణరంగంలో బీహార్ వాసులు ఎక్కువ. ముఖ్యంగా అమరావతి తో పాటు పోలవరం ప్రాజెక్టు నిర్మాణ పనుల్లో బీహార్ కార్మికులు ఎక్కువగా ఉంటారు. ఆపై రాష్ట్రంలో చాలా రంగాల్లో బీహార్ కార్మికులు పనిచేస్తుంటారు. ప్రస్తుతం ఏపీలో యూత్ ఐకాన్ గా ఉన్నారు లోకేష్. అనేక రకాలుగా తనను తాను ప్రూవ్ చేసుకొని నిలబడగలిగారు. అందుకే కేంద్ర పెద్దలు నారా లోకేష్ ను ఎన్నికల ప్రచారానికి పంపాలని చంద్రబాబును కోరినట్లు తెలుస్తోంది. వారి కోరిక మేరకు మాత్రమే బీహార్లో లోకేష్ పర్యటించారు. ఎన్డీఏ విధానాలు చెప్పడంతో పాటు ఏపీలో వన్ ఛాన్స్ అనే నినాదంతో అధికారంలోకి వచ్చిన జగన్మోహన్ రెడ్డి చేసిన విధ్వంసాన్ని వారికి వివరించారు. బీహార్ కు అటువంటి పరిస్థితి రాకుండా చూసుకోవాలని సూచించారు. ఇవి అక్కడి ప్రజల్లోకి బలంగా వెళ్లినట్లు తెలుస్తోంది. ఇటీవల ఏపీకి భారీగా పెట్టుబడులు వస్తున్న సంగతి తెలిసిందే.

ఆసియాలోనే అతిపెద్ద గూగుల్ డేటా సెంటర్ విశాఖ ఏర్పాటు కానుంది. ప్రపంచ ఐటి దిగ్గజ సంస్థలు సైతం వస్తున్నాయి. దేశంలో ఇతర రాష్ట్రాలతో పోటీపడి మరి పరిశ్రమలను తెస్తున్నారు. అయితే గూగుల్ డేటా సెంటర్ ఏర్పాటుకు ఒప్పందం జరిగిన తర్వాత జాతీయస్థాయిలో సైతం లోకేష్ పేరు మార్మోగిపోయింది. లోకేష్ ఇమేజ్ జాతీయస్థాయిలో పెరిగింది. అటు బీహార్ లో సైతం ఎన్డీఏ భాగస్వామ్య పక్షం నడుస్తోంది. ఈ తరుణంలో లోకేష్ ను ప్రచారంలో దింపడం ద్వారా ఎన్డీఏకు మద్దతు పెంచవచ్చు అన్న ఆలోచనలో పడ్డారు కేంద్ర పెద్దలు. లోకేష్ కు ప్రచారానికి పిలవగా ఆయన నాలుగు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఆ నాలుగు ప్రాంతాల్లో ఎన్డీఏ ఘనవిజయం సాధించింది. దీంతో లోకేష్ కు మరింత పేరు వచ్చింది. జాతీయస్థాయిలో బిజెపి పెద్దలు సైతం లోకేష్ కు అత్యంత ప్రాధాన్యం ఇచ్చే అవకాశం ఉంది.

ప్రపంచాన్ని చుట్టేసిన లోకేష్

రాష్ట్ర విద్యా శాఖ మంత్రిగా ఉన్నారు నారా లోకేష్. ఐటీ శాఖ మంత్రిగా కూడా కొనసాగుతున్నారు. పరిశ్రమల శాఖ మంత్రిగా టీజీ భరత్ వ్యవహరిస్తున్నారు. కానీ నారా లోకేష్ గత ఏడాదిన్నర కాలంగా కలవని పారిశ్రామికవేత్త లేరు. ఐటీ దిగ్గజ సంస్థల అధినేతలు లేరు. వాటి ఫలితాలు ఈ పెట్టుబడుల సదస్సులో కనిపించనున్నాయి. మంత్రి నారా లోకేష్ ఒకవైపు ప్రభుత్వ పాలన, తన శాఖ పనితీరు, టిడిపి రాజకీయ వ్యవహారాలు చూస్తూనే..

ప్రపంచవ్యాప్తంగా ఎక్కడ పారిశ్రామికవేత్తలతో భేటీకి అవకాశం ఉంటే.. అక్కడకు వెళ్లి ఏపీని ప్రమోట్ చేశారు. అమెరికాలో ఏకంగా గూగుల్ క్లౌడ్ హెడ్ తో సమావేశం కూడా అయ్యారు. ఆ సమావేశమే విశాఖ ఏఐ హబ్ గా మారేందుకు బీజం పడింది. ఒకసారి మంత్రి నారా లోకేష్ ను చూస్తే ఆయన తనను తాను మార్చుకునే తీరు ఇట్టే ఆకట్టుకుంటుంది. ఇప్పుడు ఏపీ కోసం ఆయన అదే తరహా ప్రయత్నం చేస్తున్నారు. పెట్టుబడులతో పాటు పారిశ్రామికవేత్తలను ఆకర్షించడంలో సీఎం చంద్రబాబు కంటే మెరుగైన పనితీరు కనబరుస్తున్నారు. ఒకప్పుడు మైక్రోసాఫ్ట్ హైదరాబాద్కు తీసుకురావడంలో చంద్రబాబు కృషి ఉంది. ఇప్పుడు లోకేష్ సైతం తనకంటూ అటువంటి ముద్ర కోసం ప్రయత్నాలు చేశారు. పారిశ్రామిక వర్గాలతో టచ్ లోకి వెళ్లిపోతున్నారు. అయితే ఆయన చేసిన ప్రయత్నాలు కొంతవరకు వర్కౌట్ అవుతూ వచ్చాయి. ఈరోజు పెట్టుబడులు, విశాఖకు వచ్చే దిగ్గజ పరిశ్రమలు, వారితో జరిపే చర్చల్లో లోకేష్ పనితీరు బయటపడనుంది. లోకేష్ తనను తాను మార్చుకున్న తీరు.. పాలనలో తాను వ్యవహరిస్తున్న తీరు మాత్రం ఆయన రాజకీయంగా బలపడేందుకు ఎంతగానో దోహదం చేయనుంది. ప్రతి మనిషి నిశితంగా ఆయనను గమనిస్తున్నారు. ఒకప్పుడు విమర్శించే వారు సైతం సానుకూలంగా చూస్తున్నారు. రాజకీయ ప్రత్యర్థులు సైతం అంతర్గత చర్చల్లో లోకేష్ పని తీరును మెచ్చుకుంటున్నారు. ఎందుకంటే ఆయనకు కావాల్సింది ఏముందిమంత్రి నారా లోకేష్ ఇప్పుడు బహుళ పాత్ర పోషిస్తున్నారు. రాజకీయాల్లో తనకంటూ ఒక మార్కు చాటుకున్నారు. పాలనలోనూ తనదైన పాత్రను పోషిస్తున్నారు. ఏపీ భవిష్యత్తు కోసం చాలా రకాలుగా ఆలోచనలు చేస్తున్నారు. ఒక బాధ్యతాయుతమైన పాత్రతో ముందుకు సాగుతున్నారు.

అసలు రాజకీయాలకి పనికిరాడు అని ముద్రవేశారు. చంద్రబాబుకు తగిన తనయుడు కాదని నిర్ధారించేశారు. కానీ ఆ చిక్కుముళ్లను, అవమానాలను తట్టుకుని నిలబడ్డారు నారా లోకేష్. ఒక్క మాటలో చెప్పాలంటే విశాఖ పెట్టుబడుల సదస్సు ఒంటి చేత్తో నడిపించే శక్తిగా మారారు లోకేష్. తప్పకుండా విశాఖ సదస్సు గేమ్ చేంజర్ గా నిలిచే అవకాశం ఉంది

# 66 ఎన్నికల్లో కాంగ్రెస్ పోటీ నామమాత్రమే

## కాంగ్రెస్...ఇక కధనే

ఎన్నికల సంఘం ప్రకారం, 2014 నుంచి 2025 వరకు భారతదేశంలో 66 పూర్తి రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలు జరిగాయి.'అసెంబ్లీ ఎన్నికలు' అనే పదం ప్రధానంగా పూర్తి రాష్ట్ర ఎన్నికలకు ఉపయోగిస్తారు. బిహార్- 243 స్థానాల్లో ఎన్డీఏ 202 స్థానాల్లో ఆధిక్యంలో ఉండగా, కాంగ్రెస్ 5 స్థానాల్లో ఉంది. ఢిల్లీ- 70 స్థానాల్లో బీజేపీ 48 సీట్లు గెలుచుకోగా, కాంగ్రెస్ ఒక్క సీటు కూడా గెలుచుకోలేదు. ఆంధ్రప్రదేశ్- 175 స్థానాల్లో టీడీపీ కూటమి 164 సీట్లు గెలుచుకోగా, కాంగ్రెస్ ఒక్క సీటు కూడా గెలుచుకోలేదు. అరుణాచల్ ప్రదేశ్- 60 స్థానాల్లో బీజేపీ 46 సీట్లు గెలుచుకోగా, కాంగ్రెస్ 1 సీటు గెలుచుకుంది. ఒడిశా- 147 స్థానాల్లో బీజేపీ 78 సీట్లు గెలుచుకోగా, కాంగ్రెస్ 14 సీట్లు గెలుచుకుంది. సిక్కిం- 32 స్థానాల్లో ఎస్కేఎం 19 సీట్లు, కాంగ్రెస్ ఒక్క సీటు మాత్రమే గెలుచుకుంది. హర్యానా- 90 స్థానాల్లో బీజేపీ 48 సీట్లు గెలుచుకోగా, కాంగ్రెస్ 20 సీట్లు మాత్రమే గెలుచుకుంది. మహారాష్ట్ర- 288 స్థానాల్లో బీజేపీ నేతృత్వంలోని కూటమి 230 సీట్లు గెలుచుకోగా, కాంగ్రెస్ 16 సీట్లు గెలుచుకుంది. జార్ఖండ్- 81 స్థానాల్లో జేఎంఎం కూటమి 47 సీట్లు గెలుచుకోగా, కాంగ్రెస్ 15 సీట్లు గెలుచుకుంది.

జమ్మూ కాశ్మీర్- 90 స్థానాల్లో ఎన్సీ 42 సీట్లు గెలుచుకోగా, కాంగ్రెస్ కేవలం 6 సీట్లు మాత్రమే గెలుచుకుంది. మేఘాలయ- 60 స్థానాల్లో ఎన్డీఏ 31 సీట్లు గెలుచుకోగా, కాంగ్రెస్ 4 సీట్లు మాత్రమే గెలుచుకుంది. నాగాలాండ్- 60 స్థానాల్లో ఎన్డీఏ 37 సీట్లు గెలుచుకోగా, కాంగ్రెస్ ఒక్క సీటు కూడా గెలుచుకోలేదు. కర్ణాటక- 224 స్థానాల్లో కాంగ్రెస్ 135 సీట్లు గెలుచుకుని ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. మధ్యప్రదేశ్- 230 స్థానాల్లో బీజేపీ 163 సీట్లు గెలుచుకోగా, కాంగ్రెస్ 66 సీట్లు గెలుచుకుంది. రాజస్థాన్- 200 స్థానాల్లో బీజేపీ 115 గెలుచుకోగా, కాంగ్రెస్ 69 సీట్లు గెలుచుకుంది. ఛత్తీస్గఢ్- 90 స్థానాల్లో బీజేపీ 54 గెలుచుకోగా, కాంగ్రెస్ 35 సీట్లు గెలుచుకుంది. తెలంగాణ- 119 స్థానాల్లో కాంగ్రెస్ 64 సీట్లు గెలుచుకుని ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది.

మిజోరం- 40 స్థానాల్లో జోరాం పీపుల్స్ మూవ్మెంట్ 27 సీట్లు గెలుచుకోగా, కాంగ్రెస్ కేవలం 1 సీటు మాత్రమే గెలుచుకుంది. గోవా- 40 స్థానాల్లో బీజేపీ 20 సీట్లు గెలుచుకోగా, కాంగ్రెస్ కేవలం 3 సీట్లు మాత్రమే గెలుచుకుంది. మణిపూర్- 60 స్థానాల్లో బీజేపీ 32 సీట్లు, కాంగ్రెస్ కేవలం 5 సీట్లు మాత్రమే గెలుచుకుంది. ఉత్తరాఖండ్- 70 స్థానాల్లో బీజేపీ 47 సీట్లు, కాంగ్రెస్ 19 సీట్లు గెలుచుకుంది. పంజాబ్- 117 స్థానాల్లో ఆప్ 92 సీట్లు గెలుచుకోగా, కాంగ్రెస్ 18 సీట్లు గెలుచుకుంది. ఉత్తరప్రదేశ్- 403 స్థానాల్లో బీజేపీ 255 సీట్లు గెలుచుకోగా, కాంగ్రెస్ 62 సీట్లు గెలుచుకుంది. గుజరాత్- 182 స్థానాల్లో బీజేపీ 156 సీట్లు, కాంగ్రెస్ కేవలం 4 సీట్లు మాత్రమే గెలుచుకుంది. హిమాచల్ ప్రదేశ్- 68 స్థానాల్లో కాంగ్రెస్ 40 సీట్లు గెలుచుకుని ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. పశ్చిమ బెంగాల్- 294 స్థానాల్లో టీఎంసీ 213 సీట్లు గెలుచుకోగా, కాంగ్రెస్ ఒక్క సీటు కూడా గెలుచుకోలేదు. అస్సాం- 126 స్థానాల్లో బీజేపీ 60 సీట్లు గెలుచుకోగా, కాంగ్రెస్ 29 సీట్లు గెలుచుకుంది. కేరళ- 140 స్థానాల్లో ఎల్డీఎఫ్ 99 సీట్లు గెలుచుకోగా, కాంగ్రెస్ 21 సీట్లు గెలుచుకుంది. తమిళనాడు- 234 స్థానాల్లో డీఎంకే 133 సీట్లు గెలుచుకోగా, కాంగ్రెస్ కేవలం 3 సీట్లు మాత్రమే గెలుచుకుంది. పుదుచ్చేరి- 30 స్థానాల్లో ఎన్డీఏ 16 సీట్లు గెలుచుకోగా, కాంగ్రెస్ కేవలం 2 సీట్లు మాత్రమే గెలుచుకుంది. ఢిల్లీ- 70 స్థానాల్లో ఆప్ 62 సీట్లు గెలుచుకోగా, కాంగ్రెస్ ఒక్క సీటు కూడా గెలుచుకోలేదు. బిహార్- 243 స్థానాల్లో ఎన్డీఏ 125 సీట్లు గెలుచుకోగా, కాంగ్రెస్ 19 సీట్లు మాత్రమే గెలుచుకోగలిగింది. ఆంధ్రప్రదేశ్- 175 స్థానాల్లో వైఎస్ఆర్-కాంగ్రెస్ 151 సీట్లు గెలుచుకోగా, కాంగ్రెస్ ఖాతా తెరవలేదు. అరుణాచల్ ప్రదేశ్- 60 స్థానాల్లో బీజేపీ 41 సీట్లు గెలుచుకోగా, కాంగ్రెస్ కేవలం 1 సీటు మాత్రమే గెలుచుకుంది. ఒడిశా- 147 స్థానాల్లో బీజూ జనతాదళ్ 112 సీట్లు గెలుచుకోగా, కాంగ్రెస్ కేవలం 14 సీట్లు మాత్రమే గెలుచుకుంది. సిక్కిం- 32 స్థానాల్లో ఎస్కేఎం 17 సీట్లు గెలుచుకోగా, కాంగ్రెస్ ఒక్క సీటు కూడా గెలుచుకోలేదు. మహారాష్ట్ర- 288 స్థానాల్లో బీజేపీ 132 సీట్లు, కాంగ్రెస్ కేవలం 16 సీట్లు మాత్రమే గెలుచుకున్నాయి. జార్ఖండ్- 81 స్థానాల్లో జేఎంఎం 30 సీట్లు, కాంగ్రెస్ 16 సీట్లు గెలుచుకున్నాయి. కర్ణాటక- 224 స్థానాల్లో బీజేపీ 104 సీట్లు గెలుచుకుంది. కాంగ్రెస్ 78 సీట్లు గెలుచుకుని కూటమిగా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. త్రిపుర- 60 స్థానాల్లో బీజేపీ 36 సీట్లు గెలుచుకోగా, కాంగ్రెస్ కేవలం 1 సీటు మాత్రమే గెలుచుకుంది.

మధ్యప్రదేశ్- 230 స్థానాల్లో కాంగ్రెస్ 114 సీట్లు గెలుచుకుని ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. ఛత్తీస్గఢ్- 90 స్థానాల్లో కాంగ్రెస్ 60 సీట్లు గెలుచుకుని ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. రాజస్థాన్- 200 స్థానాల్లో కాంగ్రెస్ 99 సీట్లు గెలుచుకుని ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. గోవా- 40 అసెంబ్లీ స్థానాల్లో బీజేపీ 13 సీట్లు గెలుచుకుని కూటమి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయగా, కాంగ్రెస్ 17 సీట్లు గెలుచుకుంది. మణిపూర్- 60 స్థానాల్లో బీజేపీ 21 సీట్లు గెలుచుకుని కూటమి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయగా, కాంగ్రెస్ 28 సీట్లు గెలుచుకున్నా అధికారంలోకి రాలేదు. ఉత్తరప్రదేశ్- 403 స్థానాల్లో బీజేపీ 312 సీట్లు గెలుచుకోగా, కాంగ్రెస్ కేవలం 7 సీట్లు మాత్రమే గెలుచుకుంది. ఉత్తరాఖండ్- 70 స్థానాల్లో బీజేపీ 57 సీట్లు గెలుచుకోగా, కాంగ్రెస్ 11 సీట్లు గెలుచుకుంది. పంజాబ్- 117 స్థానాల్లో కాంగ్రెస్ 77 సీట్లు గెలుచుకుని ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. హిమాచల్ ప్రదేశ్- 68 అసెంబ్లీ స్థానాల్లో బీజేపీ 44 సీట్లు గెలుచుకోగా, కాంగ్రెస్ 21 సీట్లు మాత్రమే గెలుచుకోగలిగింది. గుజరాత్- 182 అసెంబ్లీ స్థానాల్లో బీజేపీ 99 సీట్లు, కాంగ్రెస్ కేవలం 80 సీట్లు మాత్రమే గెలుచుకున్నాయి. 2016లో అస్సాం- 126 స్థానాల్లో బీజేపీ 86 సీట్లు గెలుచుకోగా, కాంగ్రెస్ కేవలం 25 సీట్లు మాత్రమే గెలుచుకుంది. కేరళ- 140 స్థానాల్లో ఎల్డీఎఫ్ 91 సీట్లు గెలుచుకోగా, కాంగ్రెస్ ఒక్క సీటు కూడా గెలుచుకోలేదు. తమిళనాడు- 232 స్థానాల్లో ఏఐఏడీఎంకే 136 సీట్లు గెలుచుకోగా, కాంగ్రెస్ కేవలం 8 సీట్లు మాత్రమే గెలుచుకుంది. పశ్చిమ బెంగాల్- 294 స్థానాల్లో టీఎంసీ 211 సీట్లు గెలుచుకోగా, కాంగ్రెస్ ఖాతా తెరవలేదు. పుదుచ్చేరి- 30 స్థానాల్లో ఎన్డీఏ 17 సీట్లు, కాంగ్రెస్ 15 సీట్లు గెలుచుకున్నాయి. 2015లో 2 అసెంబ్లీ ఎన్నికలుఢిల్లీ- 70 స్థానాల్లో ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) 67 సీట్లు గెలుచుకోగా, కాంగ్రెస్ ఒక్క సీటు కూడా గెలుచుకోలేదు. బిహార్- 243 స్థానాల్లో మహాకూటమి 178 సీట్లు గెలుచుకోగా, అప్పుడు కూడా కాంగ్రెస్ ఖాతా తెరవలేదు. 2014లో 8 అసెంబ్లీ ఎన్నికలుఆంధ్రప్రదేశ్- 175 స్థానాల్లో వైఎస్ఆర్-కాంగ్రెస్ 67 సీట్లు గెలుచుకుంది. కాంగ్రెస్ ఒక్క సీటు కూడా గెలుచుకోలేదు. అరుణాచల్ ప్రదేశ్- 60 స్థానాల్లో కాంగ్రెస్ 42 సీట్లు గెలుచుకుంది. ఒడిశా- 147 స్థానాల్లో బీజూ జనతాదళ్ 117 సీట్లు గెలుచుకోగా, కాంగ్రెస్ కేవలం 16 సీట్లు మాత్రమే గెలుచుకుంది. సిక్కిం- 32 స్థానాల్లో సిక్కిం డెమొక్రటిక్ ఫ్రంట్ 22 సీట్లు గెలుచుకోగా, కాంగ్రెస్ ఖాతా తెరవలేదు. హర్యానా- 90 స్థానాల్లో బీజేపీ 47 సీట్లు గెలుచుకుని ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయగా, కాంగ్రెస్ 15 సీట్లు గెలుచుకుంది. మహారాష్ట్ర- 288 స్థానాల్లో బీజేపీ 122 గెలుచుకోగా, కాంగ్రెస్ 42 సీట్లు గెలుచుకుంది. జార్ఖండ్- 81 స్థానాల్లో బీజేపీ 37 సీట్లు గెలుచుకోగా, కాంగ్రెస్ కేవలం 6 సీట్లు మాత్రమే గెలుచుకుంది. జమ్మూ కాశ్మీర్- 87 స్థానాల్లో పీడీపీ 28 సీట్లు గెలుచుకోగా, కాంగ్రెస్ కేవలం 7 సీట్లు మాత్రమే గెలుచుకోగలిగింది. ఎన్నికల సంఘం వెబ్సైట్ ప్రకారం, గత 11 ఏళ్లలో 66 పూర్తి అసెంబ్లీ ఎన్నికలు జరిగాయి. వీటిలో కాంగ్రెస్ మొత్తం 8 ఎన్నికల్లో గెలిచింది. 58 ఎన్నికల్లో ఓడిపోయింది. ఇక్కడ ఓటమి అంటే మెజారిటీ రాకపోవడం లేదా కూటమికి నాయకత్వం వహించకపోవడం. ఓటు వాటా సగటున 19% ఉంది, కానీ సీట్ల మార్పిడి తగ్గింది. బీజేపీ ప్రభ, ప్రాంతీయ పార్టీల బలం, సంస్థాగత బలహీనత కాంగ్రెస్ను ఓడిపోయిన పార్టీగా మార్చాయి.

# పీకే ..పీకేందేమి లేదు

పాట్నా, నవంబర్ 15, ఎన్నికల వ్యూహకర్త ప్రశాంత్ కిషోర్ తన సొంత జన్ సూరజ్ పార్టీతో బీహార్ ఎన్నికల్లో పోటీ చేసి ఘోరంగా విఫలమయ్యారు. గతంలో అనేక పార్టీలకు విజయం అందించిన పీకే, ఈ ఎన్నికల్లో ఒక్క సీటు గెలవకపోగా, కనీసం ఆధిక్యం కూడా కనబరచలేకపోయారు. అనేక పార్టీలకు విజయం అందించిన ప్రశాంత్ కిషోర్ సొంత రాజకీయ ప్రస్థానం నిరాశపరిచింది. జన సూరజ్ పార్టీకి కనీసం ఒక్క ఆధిక్యం కూడా లేకపోవడం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. అందరికీ శకునం చెప్పే బల్లి కుడితిలో పడి చచ్చింది అనే సామెత మాదిరి తయారైంది జన సూరజ్ పార్టీ అధినేత ప్రశాంత్ కిషోర్ పరిస్థితి. గత రెండు దశాబ్దాలుగా అనేక పార్టీలకు ఎలక్షన్ స్ట్రాటజిస్టుగా పని చేసి, పార్టీల భారీ మెజారిటీతో అధికారంలోకి వచ్చేలా ప్రణాళికలు రచించారు ప్రశాంత్ కిషోర్. ఇక తాను స్వయంగా రాజకీయాల్లోకి దిగి జన సూరజ్ పార్టీ స్థాపించి, సొంత రాష్ట్రం బీహార్ ఎన్నికల్లో అన్ని స్థానాల్లో పోటీకి దిగారు. అయితే అనూహ్యంగా ఈ ఎన్నికల్లో ఒక్క స్థానంలో కూడా గెలవకపోగా కనీసం ఆధిక్యాన్ని కూడా కనబరచలేకపోతోంది. మొత్తం 243 స్థానాల్లో ప్రశాంత్ కిషోర్ సహా.. ఏ ఒక్క చోట కూడా జన సూరజ్ పార్టీ ఓట్లు సాధించలేకపోయింది. అందరికీ స్ట్రాటజీలు ప్లే చేసే పీకే తన విషయం వచ్చేసరికి చతికిలా పడిపోయాడు పాపం అంటున్నారు రాజకీయ విమర్శకులు. బీహార్ అసెంబ్లీ ఎన్నికలు ప్రశాంత్ కిషోర్ కు రాజకీయ విపత్తుగా మారాయి. ఆయన పార్టీ జన్ సూరజ్ పార్టీ ఒకప్పుడు గేమ్-ఛేంజర్ గా, త్రిముఖ పోటీలో పోటీదారుగా ప్రశంసలు అందుకుంది. కానీ ఈ ఎన్నికల్లో ఆ పార్టీ ఘోర పరాజయాన్ని చవిచూసింది. బీహార్ లోని 243 స్థానాల్లో పికె పార్టీ ఏ ఒక్కదానిలోనూ ఆధిక్యంలో లేదు. ఆయన అభ్యర్థులందరూ పేలవమైన స్థితిలో ఉన్నారు. బీహార్ రాజధాని పాట్నాలోని కుమ్రార్ నియోజకవర్గం విజయం కోసం అత్యంత గట్టిగా ఎదురుచూస్తున్న అభ్యర్థి, కానీ అక్కడ కూడా పీకే పార్టీ మూడవ స్థానంలో వెనుకబడి ఉంది.

టీవీ ఛానెళ్లకు ఇచ్చిన ఇంటర్వ్యూలలో, అనేక బహిరంగ సభలలో, ప్రశాంత్ కిషోర్.. "ఎట్టి పరిస్థితుల్లోనూ ఎన్డీఏ ప్రభుత్వం ఏర్పడదని రాతపూర్వకంగా రాసుకోండి. నవంబర్ తర్వాత నితీష్ కుమార్ బీహార్ ముఖ్యమంత్రిగా పదవి నుంచి తప్పుకుంటారు. కొత్త ముఖ్యమంత్రి నియమితులవుతారు" అని ఆయన అన్నారు. తన అంచనాలు విఫలమైతే తాను రాజకీయాల నుండి తప్పుకుంటానని ఖఖ రెండుసార్లు అన్నారు. జన్ సూరజ్ గెలిచినా, జేడీయూ గురించి తన అంచనాలు నిజం కాకపోయినా, తాను రాజకీయాల నుండి తప్పుకుంటానని కూడా ఆయన స్పష్టం చేశారు. అయితే ప్రస్తుతం తిరిగి అధికారంలోకి రావడమే కాకుండా, గతసారి కంటే మెరుగ్గా తీరు కనబరుస్తున్నట్లు కనిపిస్తోంది. ఇప్పటికే 200 సీట్ల మార్క్ దాటేసింది. ఒక్క జెడియు 80 సీట్లు గెలుచుకుంటుందని ట్రెండ్స్ సూచిస్తున్నాయి. ప్రశాంత్ కిషోర్ తన ఖాతాను కూడా తెరవలేదు. జన్ సూరజ్ పార్టీ ఏర్పాటు చేయడానికి ముందు ప్రశాంత్ కిషోర్ మే 5, 2022 నుండి అక్టోబర్ 2, 2024 వరకు 6,000 కిలోమీటర్లు పాదయాత్ర చేశారు. ఆయన 5,000 గ్రామాలకు చేరుకుని 5,000 సమావేశాలు నిర్వహించారు. బీహార్ అంతటా తిరుగుతూ గ్రామగ్రామాన విస్తృతంగా ప్రచారం చేశారు. ఆయన మే 2022 నుండి 1,280 రోజుల పాటు బీహార్ మొత్తాన్ని గాలించినా ఫలితాలు అంతంత మాత్రంగానే ఉన్నాయి. ప్రశాంత్ కిషోర్ తన ఎన్నికల ప్రచారాన్ని రోడ్డు మార్గంలోనే నిర్వహించారు. అక్టోబర్ 21 నుండి ప్రతిరోజూ సగటున 200 కి.మీ. ప్రయాణించానని పీకే చెప్పారు. ఆయన రోజూ 8 నుండి 10 అసెంబ్లీ నియోజకవర్గాలను చుట్టేశారు. ప్రశాంత్ కిషోర్ అక్టోబర్ 2022 నుండి క్రమం తప్పకుండా బీహార్లో పర్యటించారు. ఆయనతో పాటు తన బృందం క్షేత్రస్థాయిలో ప్రచారం నిర్వహించింది. వారు ప్రజలతో వారి సమస్యలు, ఆదాయం, ఉపాధి, విద్య గురించి చర్చించారు. ఈ బృందంలో ఐటీ నిపుణులు, మాజీ జర్నలిస్టులు, సామాజిక కార్యకర్తలు ఉన్నారు. కన్సల్టెన్సీ కంపెనీ ప్రొఫెషనల్ బృందాన్ని నిర్వహించింది. పాట్నా సహా మొత్తం 38 జిల్లాల్లో సుమారు 1,300 మంది నిపుణులతో కూడిన ఇరవై ఐదు ప్రత్యేక బృందాలు పనిచేశాయి. ప్రతి జిల్లాలో మూడు ప్రధాన బృందాలను ఏర్పాటు చేసుకున్నారు ప్రశాంత్ కిశోర్. ఆరు సంవత్సరాలలో ఆరుగురు ముఖ్యమంత్రులను నియమించిన ఈ వ్యక్తి బీహార్ను గెలవాలని బయలుదేరారు. అయితే ఒక్క సీటు కూడా గెలవలేకపోయాడు. కోటి మందికి పైగా సభ్యులున్న జన్ సురాజ్ పార్టీ, పది లక్షల ఓట్లను కూడా సంపాదించలేకపోయింది. పార్టీ నిలబెట్టిన 238 సీట్లలో 233 సీట్లలో డిపాజిట్లు గల్లంతయ్యాయి. అంటే వాటిలో 98% శాతం స్థానాల్లో కనీస ఓట్లు కూడా కరువయ్యాయి. జన్ సూరజ్ పార్టీకి దాదాపు 2% ఓట్లు వస్తాయని అంచనా వేశారు. కానీ అసదుద్దీన్ ఒవైసీ కి చెందిన ఎఐఎంఐఎం, మాయావతి ఖాఖ దీని కంటే మెరుగ్గా పనిచేశాయి. ఎన్నికలకు ముందు ప్రశాంత్ కిషోర్ గొప్ప వాదనలు చేశారు, కానీ ఎన్నికల ఫలితాలతో అవి బద్దలయ్యాయి.

# డైలమాలో కమలం

హైదరాబాద్, నవంబర్ 15, జూబ్లీహిల్స్ నియోజవర్గంలో జరిగిన ఉప ఎన్నికల్లో ఎదురైన ఓటమి భారత రాష్ట్ర సమితి కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ కు వాస్తవ పరిస్థితిని తెలిసేలా చేసినట్టుంది. జూబ్లీహిల్స్ ఫలితం వెలువడిన తర్వాత కేటీఆర్ విలేకరుల సమావేశం నిర్వహించారు. సాధారణంగా కేటీఆర్ రేవంత్ రెడ్డి ప్రస్తావన వస్తే చాలా పరుషమైన పదజాలం వాడుతుంటారు. అంతకుముందు అధికారంలో ఉన్నప్పుడు కూడా భారతీయ జనతా పార్టీ నాయకుల మీద ఇదే స్థాయిలో ఆయన ఆగ్రహం వ్యక్తం చేసేవారు. పరుషమైన పదజాలం వాడేవారు. 2023 అసెంబ్లీ, 2024 పార్లమెంటు, కంటోన్మెంట్ ఎన్నికల్లో ఓడిపోయినప్పటికీ కేటీఆర్ తన ధోరణి మార్చుకోలేదు. ఇటీవల జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల ప్రచారంలోనూ కేటీఆర్ అదే స్థాయిలో దూకుడు కొనసాగించారు. తన అభ్యర్థిగా విస్తృతంగా ప్రచారం చేశారు.. ప్రధాన మీడియాకు విస్తృతంగా ఇంటర్వ్యూలు ఇచ్చారు. ఇతర మాధ్యమాల గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. ఈ స్థాయిలో కేటీఆర్ మీడియాను వాడుకున్నప్పటికీ.. ఉపయోగం లేకుండా పోయింది. పైగా జూబ్లీహిల్స్ నియోజకవర్గం లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్ సరికొత్త బెంచ్ మార్క్ సృష్టించారు. మెజారిటీలో సరికొత్త రికార్డులను నెలకొల్పారు. గులాబీ పార్టీ ఓడిపోయిన తర్వాత కేటీఆర్ విలేకరులతో మాట్లాడారు. అయితే ఈసారి వాస్తవంలోకి వచ్చి కేటీఆర్ అసలైన విషయాలను చెప్పారు. 2024 లో జరిగిన పార్లమెంటు ఎన్నికల్లో గులాబీ పార్టీకి 0 సీట్లు వచ్చాయి. కాంగ్రెస్ పార్టీ, భారతీయ జనతా పార్టీ చేరి సమానంగా పార్లమెంటు స్థానాలను దక్కించుకున్నాయి. ఈ క్రమంలో కాంగ్రెస్ పార్టీకి ప్రత్యామ్నాయం తామేనని కమలం పార్టీ నాయకులు ప్రచారం చేసుకున్నారు. కానీ జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలకు వచ్చేసరికి కమలం పార్టీ నాయకులు చెప్పింది మొత్తం అబద్ధమని తేలిపోయింది . అంతేకాదు కమలం స్థానం కూడా మూడో స్థానానికి దిగజారిపోయింది. సరిగా ఏడాదికి మించి సమయం గడిచిన తర్వాత తెలంగాణలో పరిస్థితులు మారిపోయాయి. బిజెపి స్థానంలోకి గులాబీ పార్టీ వచ్చింది. కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నది కాబట్టి.. ఆస్థానాన్ని మరింత సుస్థిరం చేసుకుంది. కానీ బిజెపి మాత్రం తన రెండవ స్థానాన్ని గులాబీ పార్టీకి త్యాగం చేసింది. ఇదే అర్థం వచ్చేలా కేటీఆర్ మాట్లాడారు. అంతేకాదు కాంగ్రెస్ పార్టీకి ప్రత్యామ్నాయం తామేనని కేటీఆర్ పేర్కొన్నారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక ద్వారా.. వచ్చిన ఓట్ల ద్వారా తాము సంతృప్తితో ఉన్నామని.. కాంగ్రెస్ పార్టీకి తామే ఆల్టర్నేటివ్ అని తెలంగాణ ప్రజలు గుర్తించారని కేటీఆర్ పేర్కొన్నారు.. కేటీఆర్ ఫుల్ క్లారిటీతో ఉన్నారు. ఇక ఇప్పుడు ఆలోచించుకోవాల్సింది కమలం పార్టీ నాయకులే.

# కారు గ్యారేజీకేనా...

హైదరాబాద్, నవంబర్ 15, జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల ఫలితాలు బీఆర్ఎస్ శ్రేణులను మరింత కుంగ దీశాయి. సిట్టింగ్ స్థానాలను రెండింటిని గత రెండేళ్లలో కోల్పోవడం కూడా క్యాడర్ ఆత్మస్థయిర్యాన్ని దెబ్బతీసింది. ఈ ఓటములకు కారణం అభ్యర్థులు కాదు.. కేవలం పార్టీ నాయకత్వమేనని స్పష్టంగా చెప్పాలి. కంటోన్మెంట్ ఎమ్మెల్యేగా గెలిచిన మాజీ ఎమ్మెల్యే సాయన్న కుమార్తె లాస్య నందిత దురదృష్టవశాత్తూ రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. ఎమ్మెల్యేగా గెలిచిన నెలలు తిరగక ముందే ఆమె మరణించడంతో సాయన్న మరో కుమార్తె నివేదితను పోటీకి దింపారు. కానీ నాడు ఆ ఎన్నికల్లో బీజేపీ రెండో స్థానంలో గెలవగా, మూడో స్థానానికి బీఆర్ఎస్ పరిమితమయింది. ఇప్పుడు కూడా అన్ని పార్టీల కంటే జూబ్లీహిల్స్ నియోజకవర్గం అభ్యర్థిని బీఆర్ఎస్ ప్రకటించింది. తమ పార్టీకి చెందిన మాగంటి గోపీనాథ్ సతీమణి మాగంటి సునీతను అభ్యర్థిగా ప్రకటించారు. అయినా రెండుసార్లు బీఆర్ఎస్ గెలుపు సాధించలేదు. అంటే ఇక్కడ అభ్యర్థుల కంటే నాయకత్వాన్ని మాత్రమే ప్రజలు చూశారని చెప్పాల్సి ఉంటుంది. గత రెండేళ్లుగా పార్టీ అధినేత కేసీఆర్ ప్రజా సమస్యలపై పెద్దగా బయటకు రావడం లేదు. అప్పుడప్పుడు బయటకు వచ్చి వెళ్లడం తప్ప ఆయన ఎక్కువగా ఫామ్ హౌస్ కే పరిమితమయ్యారు. ఆరోగ్యం పరిస్థితులు కూడా ఆయనను బయటకు రానివ్వడం లేదు. దీంతో జూబ్లీహిల్స్ నియోజకవర్గం ఉప ఎన్నికల ప్రచారాన్ని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నీ తన భుజాల మీద వేసుకుని చేశారు. మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు ప్రచారంలో ముమ్మరంగా పాల్గొన్నారు. అయితే ప్రచారంలో కూడా కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు చేయడం తప్ప మరొకటి లేకుండాఉంది... పోల్ మేనేజ్ మెంట్ లో బీఆర్ఎస్ పార్టీ ఘోరంగా విఫలమయింది. కారుకు, బుల్ డోజర్ కు మధ్య పోటీ అంటూ పదే పదే ప్రచారం చేసినా ఆక్రమణల విషయంలో ప్రజలు బుల్ డోజర్ వైపు మొగ్గు చూపారనుకోవాలి. డబ్బులు తక్కువ ఖర్చు పెట్టలేదనుకోవడం పొరపాటే. కాంగ్రెస్ తో పోటీ పడిందనే చెప్పాలి. అదే సమయంలో కాంగ్రెస్ అభ్యర్థి రౌడీషీటర్ అని ప్రచారం ఒక పక్క చేస్తూ మరికొందరి రౌడీషీటర్లకు పార్టీ కండువాలు కప్పడం కూడా బీఆర్ఎస్ చేసిన తప్పిదాల్లో ఒకటి. ఇక సీమాంధ్ర ఓటర్లను ఆకట్టుకోవడంలో కూడా కేటీఆర్ విఫలమయ్యారు. టీడీపీ తటస్థంగా ఉండటం కూడా కాంగ్రెస్ కు లాభించింది. బీఆర్ఎస్ కు నష్టం చేకూర్చింది. ముఖ్యమంత్రిగా ఉన్న పదేళ్ల కాలంలో కేసీఆర్ వ్యవహరించిన తీరును, ఇప్పటి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యవహార శైలిని ప్రజలు బేరీజు వేసుకున్నట్లే ఉంది. నాడు కేసీఆర్ జనాలకు దగ్గరగా వచ్చే వారు కాదు. ఏ కార్యక్రమానికి హాజరయ్యే వారు కాదు. కానీ మొన్న తెలంగాణ కవి అందెశ్రీ మరణించినసమయంలో రేవంత్ రెడ్డి వ్యవహరించిన తీరు కూడా అందరినీ కట్టిపడేసింది. ఇలా అనేక కారణాలు కారు కు హ్యాండ్ బ్రేక్ వేసినట్లయింది. మొత్తం మీద కేటీఆర్ చెప్పినట్లుగా తమను ప్రత్యామ్నాయంగా ప్రజలు చూస్తున్నారని చెప్పేకంటే ఎలా బలోపేతం కావాలో అవసరమైన చర్యలతో జనం ముందుకు వెళ్లాలి. కాంగ్రెస్ ప్రభుత్వ నిర్ణయాలే తమను గెలిపిస్తాయని భావిస్తే మాత్రం జరిగే ఏ ఎన్నికల్లోనైనా కారు పార్టీకి భంగపాటు తప్పదన్నవిషయాన్ని గుర్తుంచుకోవాలి. వచ్చేస్థానిక సంస్థలఎన్నికల్లోనైనా,జీహెచ్ఎంసీ ఎన్నికల్లోనైనా బీఆర్ఎస్ నాయకత్వం తమ పంథాను మార్చుకోకుండా వ్యవహరిస్తే మరోసారి ఓటమిని రుచిచూడక తప్పదని గుర్తుంచుకుంటే మంచిది.

పోరాటం కొనసాగుతుంది

జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పందించారు. ఈ ఎన్నికలు తమకు కొత్త ఉత్సాహాన్నితెచ్చాయన్నారు. ఈ ఎన్నికలు రాష్ట్రంలో అధికారంలో ఉన్న పార్టీకి తామే ప్రధాన ప్రత్యర్థి అని తేల్చిచెప్పినట్లయిందని కేటీఆర్ అన్నారు. తాము గత శాసనసభ ఎన్నికల్లో ఓటమి పాలయినప్పటికీ ప్రజా సమస్యలపై స్పందించామని కేటీఆర్ తెలిపారు. తెలంగాణలో కాంగ్రెస్ కు ప్రత్యామ్నాయం బీఆర్ఎస్ మాత్రమేనని జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలు చెప్పినట్లయిందని కేటీఆర్ అన్నారు. గెలుపు, ఓటములు పక్కన పెడితే ప్రజాస్వామ్యంపై చర్చ జరగాలని అన్నారు. ఈ ఎన్నిక ఎలా జరిగిందన్నది ప్రజల్లో కూడా చర్చ జరగాలన్నారు. ఎన్నికలకు ముందే తాము అనేక విషయాలు బయటకు తెచ్చినా ఎన్నికలకమిషన్ పట్టించుకోలేదన్నారు. ఎన్నికల్లో అక్రమాలు జరిగాయని,దొంగ ఓట్లు పోలయ్యాయని చెబుతున్నాఎవరూ తమ మొరను వినలేదన్నారు. ఈ ఓటమితో తాము నిరాశ చెందడం లేదని, ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగడుతూ వెళతామని కేటీఆర్ చెప్పారు.

# రేవంత్ సైలెంట్ వార్నింగ్

హైదరాబాద్, నవంబర్ 15, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వానికి జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక మరింత ఊపు తెచ్చింది. రెండేళ్లలో రెండు ఉప ఎన్నికలలో కాంగ్రెస్ ను రేవంత్ ఒంటి చేత్తో గెలిపించారు. గత రెండేళ్లలో రేవంత్ రెడ్డి నాయకత్వంపై అనేక ప్రచారాలు జరుగుతున్నాయి. బీహార్ ఎన్నికల తర్వాత తెలంగాణలో ముఖ్యమంత్రిని మారుస్తారన్న ప్రచారం జరిగింది. అలాగే కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారంటీల ప్రభావం కూడా ఈ ఉప ఎన్నికల్లో పనిచేయలేదు. ప్రత్యర్థులు చేసే విమర్శలను ప్రజలు పెద్దగా పట్టించుకోలేదన్నది ఈ ఎన్నిక ఫలితం ద్వారా చూడాలి. ముఖ్యమంత్రిగా రేవంత్ రెడ్డి అంత సులువుగా ఎంపిక కాలేదు. తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చినా నాటి రాష్ట్ర కాంగ్రెస్ నాయకత్వం రెండుసార్లు జరిగిన ఎన్నికల్లో పార్టీని అధికారంలోకి తేవడంలో విఫలమయింది... అందుకే టీడీపీ నుంచి వచ్చినా రేవంత్ రెడ్డిలో ఉన్న ఫైర్ ను చూసి కాంగ్రెస్ నాయకత్వం పీసీసీ చీఫ్ బాధ్యతలను అప్పగించింది. అప్పటి నుంచి నాడు పదేళ్ల నుంచి అధికారంలో ఉన్నకేసీఆర్ పై రేవంత్ రెడ్డి మాటల దాడి కూడా ప్రజలను ఆకట్టుకుంది. ఫలితంగా 2023 ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించింది. అందువల్లనే ఢిల్లీ నాయకత్వం రేవంత్ రెడ్డికి ముఖ్యమంత్రి పదవి అప్పగించింది. సీనియర్లున్నా, పార్టీని తొలి నుంచి అంటిపెట్టుకున్న వారు పార్టీలో ఉన్నా వారందరినీ పక్కన పెట్టి రేవంత్ రెడ్డికి ముఖ్యమంత్రి పదవి ఇచ్చిన కాంగ్రెస్ నాయకత్వం ఆయన పనితీరును పరిశీలించిన తర్వాతనే నిర్ణయం తీసుకుంది. అయితే రేవంత్ రెడ్డి రాహుల్ దూరం పెడుతున్నారని కూడా ప్రత్యర్థులు చేస్తున్న ప్రచారానికి ఈ ఎన్నిక ఫలితంతో చెక్ పెట్టినట్లయింది. కాంగ్రెస్ పార్టీలో అంతర్గత ప్రజాస్వామ్యం ఎక్కువ. ముఖ్యమంత్రిని కూడా కేర్ చేయని ఎమ్మెల్యేలుంటారు. అలాంటి వారందరి నోళ్లు ఈ ఎన్నిక ఫలితం మూత పడేలా చేస్తుందనడలో ఎలాంటి సందేహం లేదు. ముఖ్యమంత్రి పదవి కొట్లాడి తెచ్చుకున్నది కాదని, కష్టపడి తెచ్చుకున్నదని రేవంత్ రెడ్డి ఈ ఎన్నికల్లో నిరూపించుకున్నారు. అందుకే జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో ఏ ముఖ్యమంత్రి ప్రచారం చేయని విధంగా కార్నర్ మీటింగ్ లు, రోడ్ షోలు చేసి ప్రజలను మెప్పించి, ఒప్పించి సీటును దక్కించుకోగలిగారు. దీంతో రేవంత్ రెడ్డి నాయకత్వానికి కాంగ్రెస్ పార్టీలో ఇక చెక్కు చెదరని విధంగా ఉందన్నది మరోసారి అర్థమయింది. ఆయన ప్రత్యర్థులకు రేవంత్ ఈ రకంగా జవాబు చెప్పినట్లయింది.

బాధ్యత పెరిగిందన్న రేవంత్

జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో గెలుపుపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పందించారు. ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్ అభివృద్ధిని అడ్డుకునే ప్రయత్నం చేస్తుందని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో గెలుపుపై ఆయన మాట్లాడారు. గెలిస్తే గెంతులేయడం, ఓడిపోతే కుంగిపోవడం కాంగ్రెస్ పార్టీ నైజం కాదని అన్నారు. ఈ గెలుపు ప్రభుత్వ బాధ్యతను మరింత పెంచిందని అన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో జీహెచ్ఎంసీ పరిధిలో సీట్లు రాలేదని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెప్పారు. అదే సమయంలో రెండు ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ హైదరాబాద్ నగరంలో గెలిచిందని అన్నారు. కేంద్రం ప్రభుత్వం నిధులు రాబట్టుకునేందుకు కిషన్ రెడ్డి అడ్డుకుంటున్నారని అన్నారు. జంటనగరాల్లో మెట్రో విస్తరణ, మూసీ ప్రక్షాళన కోరుకున్నారని అన్నారు. కేటీఆర్ అహంకారం తగ్గించాలని కోరారు. హరీశ్ రావు అసూయను, కేటీఆర్ అహంకారాన్ని ప్రజలు తీసుకోలేకపోతున్నారని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెప్పారు. ప్రజా సమస్యలపై తగిన సూచనలు ఇవ్వాలని, సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం చేస్తే ప్రయోజనం లేదని అన్నారు. కిషన్ రెడ్డి అభ్యర్థిగా మారి ప్రచారం చేసినా పదిహేడు వేల ఓట్లు మాత్రమే వచ్చాయని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. బీజేపీకి డిపాజిట్లు గల్లంతయ్యాయని అన్నారు. తమ పరిపాలనలో తీసుకున్న నిర్ణయాలకు ప్రజల ఆమోదం లభించిందని చెప్పారు. . అధికారం శాశ్వతం కాదని, రాజకీయం వారసత్వం కాదని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. ఫేక్ సర్వేల ద్వారా లబ్ధిపొందాలనుకుంటే ప్రయోజనం ఉండదని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. కాంగ్రెస్ ఓట్ల శాతం పెరిగిందని, గత శాసనసభ ఎన్నికల్లో వచ్చిన దానికంటేపార్లమెంటు ఎన్నికల్లోనూ, ఉప ఎన్నికల్లోనూ ఓట్ల శాతం పెరిగిందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. కాంగ్రెస్ కార్యకర్తలు, నేతలు కలసి కట్టుగా పనిచేస్తేనే ఇంతటి ఘన విజయం సాధించిందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. ప్రజలు అభివృద్ధి సంక్షేమాన్ని కోరుకుంటున్నారని తెలిపారు. ప్రజలకు ఇచ్చిన ప్రతి ఒక్క హామీని కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెప్పారు.

# కాసులు కురిపిస్తున్న ఫ్యాన్సీ లాటరీ నెంబర్లు

## ఒక్క రోజే 65 లక్షల ఆదాయం

హైదరాబాద్, నవంబర్ 15, ఫ్యాన్సీ నంబర్ల వేలం ద్వారా ఖైరతాబాద్ రవాణాశాఖ కార్యాలయానికి ఒక్క రోజులోనే రూ. 65,38,889 ఆదాయం వచ్చింది. అత్యధికంగా టీజీ 09 ఊ 9999 నంబరు రూ. 22,72,222 పలికి రికార్డు సృష్టించింది. ఈ నంబరును హనర్ ప్రైమ్ హౌసింగ్ ఎల్ఎల్పీ దక్కించుకుంది. అలాగే... టీజీ 09 ఏ 0009 నంబరు రూ. 6,80,000 లకు, టీజీ 09 ఏ 0006 నంబరు రూ. 5,70,666 లకు అమ్ముడయ్యాయి. ఈ వేలం ద్వారా వచ్చిన ఆదాయం, వాహనదారులు తమ వాహనాలకు అదృష్ట సంఖ్యలు దక్కించుకోవడానికి ఎంత ఆసక్తి చూపిస్తున్నారో తెలియజేస్తుంది.తెలంగాణ రవాణా శాఖకు ఫ్యాన్సీ నంబర్లు భారీ మొత్తంలో ఆదాయాన్ని తెచ్చిపెడుతున్నాయి. ప్రతిసారీ కొత్త సిరీస్ మొదలైనప్పుడు.. వాహనదారులు తమ వాహనాలకు అదృష్ట సంఖ్యలు, పునరావృత సంఖ్యలు లేదా తమకు ఇష్టమైన సంఖ్యలు దక్కించుకోవడానికి పెద్ద మొత్తంలో వేలంపాటలో పాల్గొంటారు. తాజాగా జరిగిన వేలంపాటలో.. కేవలం ఒక్క రోజులోనే ఖైరతాబాద్ రవాణాశాఖ కార్యాలయానికి అసాధారణ రీతిలో రూ. 65,38,889 ల ఆదాయం వచ్చినట్లు హైదరాబాద్ జాయింట్ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ రమేష్ తెలిపారు.ఈ వేలంపాటలో అత్యధికంగా పలికిన నంబర్ టీజీ09 ఊ 9999. ఈ నంబర్ కోసం పోటీపడిన హనర్ ప్రైమ్ హౌసింగ్ ఎల్ఎల్పీ సంస్థ ఏకంగా రూ. 22,72,222 చెల్లించి కైవసం చేసుకుంది. ఇది ఆ ఒక్క రోజులో అత్యంత ఖరీదైన సంఖ్యగా నిలిచింది. దీనికి వ్యతిరేకంగా.. అతి తక్కువగా ౹ఊ 09 ఏ 0003 నంబరుకు కూడా రూ. 1,15,121 ఆదాయం వచ్చిందంటే.. వాహనదారులకు ఫ్యాన్సీ నంబర్లపై ఉన్న మక్కువ ఎంత ఉందో అర్థం చేసుకోవచ్చు.ఫ్యాన్సీ నంబర్ల కోసం ప్రముఖ సంస్థలు, వ్యక్తులు పోటీపడ్డారు. ముఖ్యంగా డెవలపర్లు, ఎనర్జీ సంస్థలు, ఎంటర్‌టైన్‌మెంట్ కంపెనీలు తమ వ్యాపార వాహనాలకు, వ్యక్తిగత వాహనాలకు ఈ ప్రత్యేక సంఖ్యలను దక్కించుకోవడానికి వెనుకాడలేదు.

టీజీ 09 ఏ 0009: ఈ సంఖ్యను రూ. 6,80,000 లకు మెస్సర్స్ దండు ఎనర్జీ ప్రైవేట్ లిమిటెడ్ దక్కించుకుంది. టీజీ 09 ఏ 0006.. దీని కోసం సాయి సిల్క్స్ కళామందిర్ లిమిటెడ్ యాజమాన్యం రూ. 5,70,666 చెల్లించింది. టీజీ 09 ఏ 0099.. ఈ నంబరును రూ. 3,40,000 లకు మెస్సర్స్ గోదావరి ఫార్చ్యూన్ సంస్థ దక్కించుకుంది. టీజీ 09 ఏ 0001.. సింగిల్ డిజిట్ నంబరు కోసం శ్రీనిధి ఐటీ స్పేస్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ రూ. 2,60,000 చెల్లించింది. టీజీ 09 ఏ 0005.. దీనిని రూ. 2,40,100 లకు నిహారిక ఎంటర్ టైన్ మెంట్ సంస్థ దక్కించుకుంది.రవాణా శాఖకు ఈ ఫ్యాన్సీ నంబర్లు ఒక అదనపు ఆదాయ వనరుగా మారాయి. వాహనదారులు ఇంత భారీ మొత్తంలో డబ్బు ఖర్చు చేయడానికి ప్రధానంగా కొన్ని కారణాలు ఉన్నాయి. చాలా మంది సంఖ్యాశాస్త్రం (న్యూమరాలజీ) ప్రకారం తమకు అదృష్టం తెచ్చే సంఖ్యలను, లేదా శుభప్రదమైన '9' వంటి సంఖ్యలను కోరుకుంటారు. నిర్మాణ, రియల్ ఎస్టేట్ సంస్థలు తమ బ్రాండ్ లేదా హోదాను ప్రతిబింబించే సంఖ్యలను లేదా సులభంగా గుర్తుంచుకోగలిగే సంఖ్యలను (ఉదా: 0001, 0009) కొనుగోలు చేస్తాయిఇది వారి మార్కెట్ విలువను, హోదాను సూచిస్తుంది.

కొంతమందికి తమ పుట్టిన తేదీ, లేదా ఇష్టమైన సంఖ్యలు ఉండేలా చూసుకుంటారు. ఈ వేలం ప్రక్రియ పూర్తిగా పారదర్శకంగా ఆన్‌లైన్ ద్వారా జరుగుతుంది.

వాహనదారుల నుంచి వచ్చే ఈ ఆదాయం ప్రభుత్వ ఖజానాకు చేరి, ప్రజా సంక్షేమ కార్యక్రమాలకు ఉపయోగపడుతుంది. ఈ ఒక్క రోజు ఆదాయమే రవాణా శాఖకు ఫ్యాన్సీ నంబర్లు ఎంత కీలకమో స్పష్టం చేస్తోంది.

# అంతా తానై చేసిన రేవంత్



హైదరాబాద్, నవంబర్ 15, జూబ్లీహిల్స్ ఉప ఎన్నికకు నోటిఫికేషన్ వచ్చినప్పుడు కాంగ్రెస్ పార్టీ గెలుస్తుందని ఎవరికి ఎటువంటి అంచనాలు లేవు. చివరికి ఆ పార్టీలో ఉన్న ముఖ్య నాయకులకు కూడా ఏమాత్రం ఆశ లేదు. ఎందుకంటే జూబ్లీహిల్స్ గడిచిన రెండు పర్యాయాలుగా గులాబీ పార్టీకి జై కొట్టింది. పైగా మాగంటి గోపీనాథ్ కు అక్కడ విపరీతమైన ఫ్యాన్ ఫాలోయింగ్ ఉంది. దీనికి తోడు సునీతకు సింపతి ఓట్లు పడతాయని నమ్మకం ఉంది. పైగా గులాబీ పార్టీ సోషల్ మీడియా వింగ్, మీడియా వింగ్ విపరీతంగా ప్రచారం చేశాయి. కేటీఆర్ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. తనే పోటీ చేస్తున్నట్టుగా రంగంలోకి దిగాడు. రేవంత్ రెడ్డిని తిట్టిన తిట్టు తిట్టకుండా తిట్టాడు. దీంతో గులాబీ పార్టీ గెలుస్తుందని అందరూ అనుకున్నారు. కానీ ఇక్కడే రేవంత్ రెడ్డి ఎంట్రీ ఇచ్చాడు. ఎప్పుడైతే జూబ్లీహిల్స్ స్థానంలో జరిగే ఉప ఎన్నిక తెలంగాణలో రేవంత్ రెడ్డి పరిపాలనకు రెఫరెండం అని చెప్పాడో .. అప్పుడే రేవంత్ దీనిని అత్యంత సీరియస్ గా తీసుకున్నాడు. ఆ తర్వాత కథ మొత్తం తను నడిపించాడు.జూబ్లీహిల్స్ నియోజకవర్గం లో కాంగ్రెస్ అభ్యర్థిగా నవీన్ యాదవ్ అనే బిసి వ్యక్తిని ప్రకటించడం ద్వారా రేవంత్ గేమ్ తనవైపు తిప్పుకున్నాడు. పైగా నవీన్ ఉన్నత విద్యావంతుడు. ఓడిపోయినప్పటికీ.. గెలిచినప్పటికీ తను అక్కడే ఉంటాడు. పైగా ప్రస్తుతం తెలంగాణ రాష్ట్రంలో బీసీ మూమెంట్ విపరీతంగా ఉంది. పైగా జూబ్లీహిల్స్ నియోజకవర్గం లో బీసీ ఓట్లు చాలా ఎక్కువగా ఉంటాయి.జూబ్లీహిల్స్ నియోజకవర్గం లో ఎన్టీఆర్ విగ్రహం ఏర్పాటు చేస్తానని రేవంత్ మాట ఇవ్వడం.. కమ్మ ఓటర్లతో మీటింగ్లు పెట్టాడు. పైగా చంద్రబాబు నిశ్శబ్దంగా ఉన్నాడు. దీంతో కమ్మ ఓటర్లు కాంగ్రెస్ కు జై కొట్టారు. జనసేన కూడా తెర వెనుక మద్దతు ఇవ్వడంతో కాపు ఓట్లు కూడా కాంగ్రెస్ పార్టీకి పడ్డాయి. మజ్లిస్ మద్దతు ఇచ్చినప్పటికీ.. రేవంత్ ఏమాత్రం నమ్మలేదు. అత్యంత వ్యూహాత్మకంగా అజరుద్దీన్ ను మంత్రివర్గంలోకి తీసుకున్నాడు. అంతేకాదు ముస్లింలకు స్మశాన వాటిక ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించాడు. ఇక్కడ గులాబీ పార్టీకి సంబంధించిన మైనారిటీ ఓటు బ్యాంకు మొత్తాన్ని చీల్చి పడేశాడు రేవంత్.సీనియర్లతోపాటు జూనియర్ మంత్రులకు అనేక ప్రాంతాల బాధ్యతలు అప్పగించాడు. అన్నిటికంటే ముఖ్యంగా టార్గెట్ ఫిక్స్ చేశాడు. దీనికి తోడు పోల్ మేనేజ్మెంట్ విషయంలో రేవంత్ ఏ మాత్రం రాజీ పడలేదు. ఇక సానుభూతిని బ్రేక్ చేయడానికి గతంలో ఏకగ్రీవం విధానం ఉంటే.. దానిని కేసీఆర్ ఎలా బద్దలు కొట్టాడో రేవంత్ వివరించాడు. పి జనార్ధన్ రెడ్డి కుటుంబానికి ఎలాంటి ద్రోహం చేశాడో ఉదాహరణలతో చెప్పాడు. పిజెఆర్ పేరు వాడుకున్నాడు. మాగంటి కుటుంబానికి సానుభూతి దక్కకుండా గండి కొట్టాడు. ముఖ్యంగా కెసిఆర్ అవకాశవాదాన్ని ఎక్కడికక్కడ ఎండగట్టాడు.సినీ కార్మికుల ఓట్లు జూబ్లీహిల్స్ నియోజకవర్గం లో అధికంగా ఉంటాయి. దీంతో వారితో సమావేశం ఏర్పాటు చేశాడు రేవంత్. అప్పటికప్పుడు వారికి 10 కోట్లు ఇస్తానని ప్రకటించాడు. 20% వాటా సినీ కార్మికులకు ఇస్తేనే టికెట్ రేట్లు పెంచుతానని ప్రకటించాడు రేవంత్. తద్వారా సినీ కార్మికులకు కూడా అత్యంత దగ్గరగా కనెక్ట్ అయిపోయాడు.. గులాబీ పార్టీకి ఓటు వేస్తే ప్రస్తుతం అమలు చేస్తున్న పథకాలు మొత్తం ఆగిపోతాయని రేవంత్ ప్రచారం చేసాడు. అంతేకాదు గులాబీ పార్టీ అధికారంలోకి వస్తే ఏం జరుగుతుందో వివరించాడు. సునీత పట్ల ప్రజలకు పెద్దగా ఆదరణ లభించకుండా ఉండడానికి కవిత అంశాన్ని తెరపైకి తీసుకొచ్చాడు. ఇంటి ఆడబిడ్డ నే కేటీఆర్ పట్టించుకోవడంలేదని.. మాగంటి సునీతను మాత్రం ఏం పట్టించుకుంటారని రేవంత్ ప్రశ్నించాడు. పైగా కవిత చేస్తున్న ఆరోపణలను పదే పదే ప్రస్తావించాడు.మాగంటి మరణం పై ఆయన మాతృమూర్తి, మొదటి భార్య సునీత మీద కేసు పెట్టిన విధానాన్ని పదే పదే ప్రస్తావించారు రేవంత్ రెడ్డి. అదే కాదు కేటీఆర్ అవకాశవాదాన్ని వివరించారు. ఒక రకంగా సునీత మాగంటి గోపీనాథ్ ను లీగల్ గా పెళ్లి చేసుకోలేదు అనే విషయాన్ని జనాల్లోకి బలంగా తీసుకెళ్లగలిగాడు.వాస్తవానికి కాంగ్రెస్ పార్టీలో రేవంత్ పని అయిపోయిందని గులాబీ పార్టీ మీడియా, దాని అనుబంధ సోషల్ మీడియా గ్రూపులు విపరీతంగా ప్రచారం చేస్తున్నాయి . ప్రచారానికి తోడు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కూడా రకరకాలుగా లీకులు ఇస్తున్నారు. రేవంత్ రెడ్డి మీద విమర్శలు చేస్తున్నారు. వారందరికీ ఈ గెలుపు ద్వారా బలమైన సమాధానం చెప్పగలిగాడు రేవంత్.ఇదే సమయంలో అధిష్టానానికి బలమైన సమాధానం కూడా ఇచ్చాడు. కాంగ్రెస్ కాదు.. కాంగ్రెస్ పార్టీకే రేవంత్ రెడ్డి చాలా అవసరం అనే విధంగా సంకేతాలు ఇవ్వగలిగాడు. అందువల్లే రేవంత్ రెడ్డి జూబ్లీహిల్స్ నియోజకవర్గం లో జరిగిన ఉప ఎన్నికను అత్యంత కఠినమైన సవాల్ లాగా తీసుకున్నాడు. విపరీతంగా కష్టపడ్డాడు. ఒక ప్లానింగ్ ప్రకారం ముందుకు పోయాడు. అన్నట్టు ఈ ఎన్నికను తెలంగాణ ప్రభుత్వానికి రెఫరెండం అని కేటీఆర్ అన్నాడు. ఈ ప్రకారం చూసుకుంటే తెలంగాణ ప్రభుత్వం పాసైనట్టే కదా.. ముఖ్యమంత్రిగా రేవంత్ విజయవంతమైనట్టే కదా..

# దుమ్మురేపిన నవీన్...

హైదరాబాద్, నవంబర్ 15, జూబ్లీహిల్స్ నియోజకవర్గం లో గతంలో నవీన్ యాదవ్ పోటీ చేశాడు.. అయినప్పటికీ అతడికి విజయం దక్కలేదు.. అయితే ఈసారి మాత్రం నవీన్ యాదవ్ విపరీతంగా కష్టపడ్డాడు. ఒకరకంగా తన శక్తిని మొత్తం కూడ తీసుకొని ప్రయత్నించాడు. రకరకాల ఇబ్బందులు ఎదురవుతున్నప్పటికీ.. తనమీద వ్యతిరేకంగా ప్రచారం జరుగుతున్నప్పటికీ ఏమాత్రం భయపడకుండా.. రేవంత్ రెడ్డి అండతో ముందుకు వెళ్లాడు. గతంలో ఎదురైన ఓటములకు సరైన సమాధానం చెబుతూ.. సాలిడ్ విక్టరీ సాధించాడు. వాస్తవానికి జూబ్లీహిల్స్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలవడం మామూలు విషయం కాదు. ఇది కేవలం ఒక ఉపఎన్నిక మాత్రమే కాదు.. గులాబీ పార్టీకి కాంగ్రెస్ పార్టీ తిరుగులేని సమాధానం చెప్పింది. రేవంత్ రెడ్డి స్టామినా ఏమిటో నిరూపించింది. ఇకపై మంత్రులు రేవంత్ రెడ్డి ముందు కాలర్ ఎగిరేసే అవకాశం ఉండదు. ముఖ్యంగా కొంతమంది మంత్రులు తల బిరుసుతనాన్ని ప్రదర్శించడానికి అవకాశం ఉండదు.నవీన్ యాదవ్ కు జూబ్లీహిల్స్ గెలుపు తిరుగులేని బూస్ట్ ఇచ్చింది. ఆయన రాజకీయ జీవితానికి ఒకరకంగా మైలు రాయి లాగా నిలిచింది. తన తండ్రి చిన్న శ్రీశైలం యాదవ్ అందుకోలేని రాజకీయ ఘనతను అందించింది.. మాగంటి సునీత ఏదో ఆరోపిస్తోంది గాని.. నవీన్ యాదవ్ సాధించిన గెలుపు మామూలుది కాదు. ఆయన ఏ స్థాయిలో విజయం సాధించాడో.. ఏ స్థాయిలో జూబ్లీ హిల్స్ ఓటర్ల ప్రేమను పొందాడో సాధించిన ఓట్ల శాతం చెబుతోంది.జూబ్లీహిల్స్ నియోజకవర్గ చరిత్రలో హైయెస్ట్ ఓట్ల తేడాతో నవీన్ యాదవ్ గెలవడం ఒక రకంగా సంచలనం. ఈ నియోజకవర్గంలో ఇప్పటివరకు హైయెస్ట్ మెజారిటీ విష్ణువర్ధన్ రెడ్డి పేరు మీద ఉండేది. 2009లో జరిగిన ఎన్నికల్లో విష్ణువర్ధన్ రెడ్డి 21,741 ఓట్ల మెజారిటీతో విజయం సాధించారు.. ఆయన రికార్డును చివరికి మాగంటి గోపీనాథ్ కూడా బద్దలు కొట్టలేకపోయారు. ఈ నియోజవర్గంలో హ్యాట్రిక్ ఎమ్మెల్యేగా గోపీనాథ్ రికార్డు సృష్టించారు.. 2014లో మాగంటి గోపీనాథ్ టిడిపి తరఫున పోటీ చేసి విజయం సాధించారు. నాటి ఎన్నికల్లో ఆయన 9,242 ఓట్ల మెజారిటీతో విజయం సాధించారు. 2018 ఎన్నికల్లో 16,004 ఓట్ల తేడాతో విజయం సాధించారు..గత ఎన్నికల్లో 16,338 ఓట్ల తేడాతో గెలుపును దక్కించుకున్నారు. ఇలా మూడుసార్లు తన మెజారిటీని పెంచుకుంటూ పోయారు.ఈ నియోజకవర్గంలో పోటీ చేసిన నవీన్ యాదవ్ ఓటములు ఎదుర్కొన్న నేపథ్యంలో.. ఆ బాధను మరిపించే విధంగా 2025 లో జరిగిన ఉప ఎన్నికల్లో జూబ్లీహిల్స్ ఓటర్లు నవీన్ యాదవ్ కు బంపర్ మెజారిటీ అందించారు. నవీన్ యాదవ్ తన సమీప ప్రత్యర్థి, భారత రాష్ట్ర సమితి అభ్యర్థి సునీత మీద ఏకంగా 24,729 ఓట్ల మెజారిటీ సాధించారు. నవీన్ యాదవ్ 98,988 ఓట్లు సాధించారు. 50.83 ఓట్ల శాతాన్ని సాధించారు. సునీత 74,259 ఓట్లు సాధించారు. 38.13 ఓట్ల శాతాన్ని సాధించారు. బిజెపి అభ్యర్థి లంకల దీపక్ రెడ్డి 17,061 ఓట్లు సాధించారు. 8.76 ఓట్ల శాతాన్ని సాధించారు.

## బోడుప్పల్ సుద్దకుంట చెరువును పరిశీలించిన హైడ్రా కమిషనర్

మేడ్చల్ జిల్లా బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ లోని సుద్దకుంట చెరువును హైడ్రా కమిషనర్ రంగనాథ్ పరిశీలించారు. సుద్ద కుంట పరివాహక ప్రాంతంలో నివాసితుల ఇండ్లకు ఇరిగేషన్ అధికారులు ఎఫ్.టి.ఎల్ మార్క్ పెట్టారు. బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ సుద్ధకుంట చెరువును హెచ్ఎండిఏ ద్వారా సుందరికరణ చేయుటకు ఎఫ్.టి.ఎల్ పరిధి గురించి ఇరిగేషన్ అధికారులను అడగటంతో ఇరిగేషన్ అధికారులు ఎఫ్.టి.ఎల్ హద్దులు పెట్టారు. గత ముప్పై సంవత్సరాలకు పైగా ఉన్న ఇండ్లకు ఎఫ్.టి.ఎల్ అనడంతో హైడ్రా కమిషనర్ రంగనాథ్ ను సుద్దకుంట పరిసర ప్రాంత నివాసితులు ఆశ్రయించారు. హైడ్రా పేరుతో భయబ్రాంతులకు గురిచేస్తున్నారని రంగనాథ్ కి స్థానిక బాధిత ప్రజలు విన్నవించుకున్నారు. స్థానికుల పిర్యాదుతో సుద్దకుంటను హైడ్రా కమిషనర్ రంగనాథ్ పరిశీలించి, స్థానికులకు భరోసా ఇచ్చారు. ఏండ్ల తరబడి ఉన్న ఇండ్లకు ఎఫ్.టిఎల్ నిర్ణయించి స్థానికులకు భయాందోళనకు గురిచేయడం సరికాదు అని రంగనాథ్ అన్నారు. బోడుప్పల్ మున్సిపల్ కమిషనర్, ఇరిగేషన్ అధికారులను సంపూర్ణ విషయం అడిగితెలుసున్నారు..

# ఉపఎన్నికల లెక్కల్లో పార్టీలు

హైదరాబాద్, నవంబర్ 15, తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి రెండేళ్లు అవుతోంది. రాష్ట్రవ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ఉన్నారు. కానీ హైదరాబాద్ పరిధి మాత్రం చేతికి చిక్కలేదు. ఇక్కడ గత ఎన్నికల్లో ఒక్కరంటే ఒక్క అభ్యర్థి కూడా విజయం సాధించలేకపోయారు. ఉప ఎన్నిక రూపంలో వచ్చిన అవకాశాన్ని కాంగ్రెస్ ఉపయోగించుకుంది. కంటోన్మెంట్‌లో మొదట విజయం సాధించింది. ఇప్పుడు జూబ్లీహిల్స్‌లో కూడా విజయం సాధించింది. ఇదే క్రమంలో మిగతా ప్రాంతాల్లో పట్టుకోసం ప్రయత్నిస్తోంది. దీని కోసం ఇప్పటికే స్కెచ్ వేసింది.కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత చాలా మంది నాయకులు హస్తం గూటికి చేరుకున్నారు. వారిలో ఎమ్మెల్యేలు ఉన్నారు. వారంతా బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్ పార్టీలోకి వచ్చారు. ఒక పార్టీలో గెలిచి అధికార పార్టీలోకి వెళ్లిన వారిపై అనర్హత వేటు వేయాలని బీఆర్ఎస్ పోరాటం చేస్తోంది. ఈ విషయంలో సుప్రీంకోర్టు విచారిస్తోంది. ఇప్పుడు ఈ కేసును తమకు అనుకూలంగా మార్చుకోవాలని ప్రభుత్వం భావించే అవకాశం ఉంది. జూబ్లీహిల్స్ జోష్‌ను కంటిన్యూ చేస్తూ మరిన్ని ఉపఎన్నికలు ఎదుర్కొనేందుకు సిద్ధమయ్యే వ్యూహం రచించే ఛాన్స్ ఉందంటున్నారు విశ్లేషకులు.పార్టీ ఫిరాయించిన పది మంది ఎమ్మెల్యేల్లో టెక్నికల్‌గా కొందరు పార్టీలో చేరినట్టు లేదు. కానీ వీరిలో ఒకరిద్దరు అధికార కార్యక్రమాల్లో కాంగ్రెస్ కండువా వేసుకొని కనిపించారు. కచ్చితంగా వారిపై వేటు పడుతుందని బీఆర్ఎస్ మొదటి నుంచి గట్టిగానే చెబుతూ వస్తోంది. ఇప్పుడు వారిపై వేటు వేయడం కానీ, రాజీనామా చేయించడం ద్వారా ఉపఎన్నికలు వచ్చేలా కాంగ్రెస్ వ్యూహం మార్చే అవకాశం ఉంది. అలాంటి వారిలో మొదటి స్థానంలో ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ ఉన్నారు. ఆయన గెలిచింది కారు గుర్తుపై కానీ ప్రస్తుతం కాంగ్రెస్ సభ్యుడిగా కొనసాగుతున్నారు. ఆయనతో కాంగ్రెస్ త్వరలోనే రాజీనామా చేయిస్తుందని మాట గట్టిగా వినిపిస్తోంది. త్వరలోనే ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ రాజీనామా చేస్తారని ఆయనతోపాటు మరికొందరు అదే బాటలో మరికొందరు ఉంటారని చెబుతున్నారు. ఇలా చేయడం వల్ల కాంగ్రెస్ తన బలాన్ని పెంచుకోవాలని చూస్తోంది. అయితే ముందుగా జీహెచ్ఎంసీలో బలోపేతం దృష్టి పెట్టినందున లిస్ట్‌లో మొదట ఖైరతాబాద్ ఉన్నట్టు విశ్లేషణలు వినిపిస్తున్నాయి. స్పీకర్, సుప్రీంకోర్టు నిర్ణయం వచ్చేలోపు ఒకరిద్దరితో రాజీనామా చేయిస్తే కాంగ్రెస్ పార్టీకి కూడా క్రెడిట్ వస్తుందని ప్లాన్ చేస్తున్నారు. గతంలో రాజీనామా చేయించకుండా పార్టీ ఎల్పీలను విలీనం చేసుకున్నారు. తాము మాత్రం ఎమ్మెల్యేలతో రాజీనామాచేయించామని చెప్పుకోవచ్చు. గతానికి ఇప్పటికి ఉన్నతేడా గమనించడని ఆ నియోజక ప్రజల ముందు పెట్టవచ్చని కాంగ్రెస్ నేతలు ఆలోచిస్తున్నట్టు వార్తలు వస్తున్నాయి.

# జైలు నుంచి గెలిచిన జేడీయూ నేత..

## బీహార్ ఎన్నికల ఫలితాల్లో సంచలనం

## హత్య కేసులో జైలుకు వెళ్లిన అనంత్ సింగ్

## జన్ సురాజ్ పార్టీ నేత హత్య కేసులో ఆరోపణలు

## పోలింగ్ కు కొన్ని రోజుల ముందే పోలీసుల కస్టడీ




బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో అధికార పార్టీ జనతాదళ్ యునైటెడ్ (జేడీయూ) నేత అనంత్ సింగ్ జైలు నుంచే విజయం సాధించారు. మొకామా నియోజకవర్గంలో ఆయన సంచలన విజయం నమోదు చేశారు. హత్య కేసులో ఆయన జైలు పాలైనప్పటికీ మొకామా ఓటర్లు ఆయనకే ఓటేసి గెలిపించారు. అసెంబ్లీ ఎన్నికల ప్రచార సమయంలో జన్ సురాజ్ పార్టీ (జేఎస్పీ) అభ్యర్థి దులార్ చంద్ యాదవ్ హత్యకు గురయ్యాడు. ఈ హత్యలో అనంత్ సింగ్ పాత్ర ఉందని, ఆయన అనుచరులే దులార్ చంద్ ను చంపేశారని ఆరోపణలు వెల్లువెత్తాయి.ఈ ఆరోపణల నేపథ్యంలో ప్రాథమిక ఆధారలు సేకరించిన పోలీసులు అనంత్ సింగ్ ను పోలింగ్ కు కొన్ని రోజుల ముందే అదుపులోకి తీసుకున్నారు. అప్పటికే అనంత్ సింగ్ కూడా అసెంబ్లీ ఎన్నికల్లో మొకామా నుంచి నామినేషన్ దాఖలు చేసి ప్రచారం కూడా చేపట్టారు. ఈ హత్య కేసులో అనంత్ సింగ్ ను అదుపులోకి తీసుకోవడంతో ఆయన గెలుపుపై నీలినీడలు కమ్ముకున్నాయి. అయితే, ఈ అనుమానాలను పటాపంచలు చేస్తూ అనంత్ సింగ్ కటకటాల వెనక ఉన్నప్పటికీ మొకామా నుంచి అసెంబ్లీకి ఎన్నికయ్యారు.

# కాకి చేసిన పనికి కాలిబూడిదైన నాలుగు ఇళ్లు..

## విజయనగరం జిల్లాలో అగ్ని ప్రమాదం

## కార్తిక దీపాన్ని ఎత్తుకొచ్చి ఓ ఇంటిపై పడేసిన కాకి

## తాటాకు ఇల్లు కావడంతో ఎగసిపడ్డ మంటలు

## పక్కనే ఉన్న మరో మూడు ఇళ్లు కూడా దగ్ధం



విజయనగరం జిల్లాలో శుక్రవారం ఘోర అగ్ని ప్రమాదం జరిగింది. నాలుగు తాటాకు ఇళ్లు కాలిబూడిదయ్యాయి. ఈ ప్రమాదానికి కారణం ఓ కాకి చేసిన పనేనని స్థానికులు చెబుతున్నారు. కార్తిక మాసం నేపథ్యంలో గరివిడి మండలం కోనూరులో ఓ కుటుంబం తమ ఇంటి డాబాపై దీపాలను వెలిగించింది. అయితే ఓ కాకి ఇందులో ఓ దీపాన్ని ఎత్తుకెళ్లి సమీపంలోని ఓ ఇంటిపై పడేసింది. ఆ ఇంటి పైకప్పు తాటాకులతో ఉండడం వల్ల నిప్పంటుకుని మంటలు ఎగసిపడ్డాయి. స్థానికులు అప్రమత్తమై మంటలు ఆర్పేందుకు ప్రయత్నించేలోపే చుట్టుపక్కల ఉన్న ఇళ్లకు మంటలు విస్తరించాయి.స్థానికుల సమాచారంతో అక్కడికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది ఫైరింజన్లతో మంటలను అదుపుచేశారు. ఆలోపే నాలుగు తాటాకు ఇళ్లు కాలిబూడిదయ్యాయి. ఇందులో ఓ ఇల్లు కౌలు రైతు నంబూరి గోపిది. ఇటీవలే ఆయన పెట్టుబడి కోసం రూ.లక్ష అప్పు చేసి తెచ్చాడు. ఇంట్లో దాచిన ఆ సొమ్ముతో పాటు ఇంట్లోని అర తులం బంగారం కూడా ఈ మంటలకు బూడిదైందని వాపోయాడు. కాగా, తహసీల్దారు సీహెచ్ బంగార్రాజు ఘటనాస్థలాన్ని పరిశీలించి, సుమారు రూ.4 లక్షల వరకు ఆస్తి నష్టం జరిగినట్లు అంచనా వేశారు. ప్రభుత్వం నుంచి ఆర్థికసాయం అందేలా చూస్తామని బాధితులకు హామీ ఇచ్చారు.

# ఇంటికో పారిశ్రామికవేత్తను తయారుచేయడమే మా లక్ష్యం

## మా దార్శనికతకు కార్యరూపం ఇచ్చే సంస్థగా ఆర్ టిఐ హెచ్ఏపీని

## భారత్ టెక్ రాజధానిగా మార్చడమే మా ధ్యేయం

## ఆర్ టిఐహెచ్ పై సమ్మిట్ లో మంత్రి నారా లోకేష్

## నారా లోకేష్ సమక్షంలో 6 సంస్థలతో ఎంవోయూ



విశాఖపట్నం: ఆంధ్రప్రదేశ్ ఇప్పుడు ఒక కీలక మలుపులో ఉంది. అభివృద్ధి, పరిపాలన, భాగస్వామ్యాన్ని నేడు ఇన్నోవేషన్ నిర్ణయిస్తోందని రాష్ట్ర విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. ఆర్ టిఐహెచ్ ? వన్ ఫ్యామిలీ వన్ ఎంటర్ ప్రెన్యూర్ ? ఇన్నోవేషన్, ఇంక్లూజన్ అండ్ ఇంపాక్ట్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ (ఖీఎఉ జీనిట ౌనివ ఈజీఎతిశ్రీఎ ౌనివ ఇనిబితీవజూతీవనివబీతీ ? ఎనినిసీలజీబితినీని, ఎనిఇశ్రీబీబతినీని, జీనిట ఎఎజూజీఇబి టనీతీ ంఖ) అనే అంశంపై సిఐఐ పార్టనర్ షిప్ సమ్మిట్ లో జరిగిన సదస్సులో మంత్రి లోకేష్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా లోకేష్ మాట్లాడుతూ... కుటుంబానికి ఒక పారిశ్రామికవేత్త తయారు కావాలన్నది మా విజన్. దీనిని కొంతమందికి మాత్రమే దక్కే హక్కుగా కాకుండా ఆచరణీయ మార్గంగా చూడాల్సి ఉంది. 2029నాటికి ఆంధ్రప్రదేశ్ ను ఇన్నొవేషన్ ఆధారిత రాష్ట్రంగా మార్చాలని మేము కోరుకుంటున్నాం. ఈ రంగంలో 20వేలకు పైగా స్టార్టప్ లు, లక్ష ఉద్యోగాలు, 10 ప్రధాన రంగాల్లో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ లను ఏర్పాటు చేయడం మా లక్ష్యం. ఇది కేవలం స్టార్టప్ ల సంఖ్య గురించి మాత్రమే కాదు. విద్యార్థులు, ఎంఎస్ఎంఇలు, భారీ పరిశ్రమలు, ప్రభుత్వంతో సహా అందరిలోనూ ఇన్నోవేషన్ మైండ్ సెట్ కల్పించే మా ప్రధాన ధ్యేయం. మీ కలలు నిజం కావాలంటే ముందు కలలు కనాలిమీ కలలు నిజం కావాలంటే ముందు కలలు కనాలని ఏపీజే అబ్దుల్ కలాం గారు చెప్పారు. 90వ దశకంలో చంద్రబాబునాయుడు గారు కూడా ఇంటికో ప్రొఫెషనల్ గురించి మాట్లాడారు. ఈ రోజు కుటుంబానికో పారిశ్రామికవేత్త గురించి మాట్లాడుతున్నారు. ప్రతిభను గ్రామస్థాయిలోనే గుర్తించి వారి ఆలోచనను పెంచడంతో పాటు వాటిని అమలుపరిచే విధంగా కృషిచేయడం జరుగుతుంది. పెద్ద కంపెనీలు ఎప్పుడూ పెద్ద పెద్ద కార్యాలయాల్లో ఉద్భవించలేదు. సమాజంలోని సమస్యల నుంచి ఉద్భవించాయి. ఇక్కడ కూడా అలాంటి ఎంతోమంది ఉన్నారు. మాకు కావాల్సింది కూడా అదే. ఈ ప్రయాణంలో భాగస్వామ్యం కావాడం, యువ వ్యాపారవేత్తలను నడిపించడం, వారికి శిక్షణ ఇవ్వడం, తగిన వేదిక కల్పించడమే ప్రభుత్వ లక్ష్యం. మా దార్శనికతకు కార్యరూపం ఇచ్చే సంస్థగా రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ (ఖీఎఉ) పనిచేస్తుంది. ప్రభుత్వం, పరిశ్రమ, విద్యాసంస్థలు, పెట్టుబడిదారులు ఆవిష్కర్తలను కలిపే ఒక వేదిక ఇది. వీటిద్వారా డీసెంట్రలైజ్డ్ ఇన్నోవేషన్ ను ప్రోత్సహిస్తాం. ప్రతి హబ్ అండ్ స్పోక్ కేంద్రాలు కార్పోరేట్, అకడమిక్ పార్టనర్ల ఆధ్వర్యంలో ఉంటాయి. దీనివల్ల ప్రజా?ప్రైవేట్ భాగస్వామ్యంతో బలమైన ఇన్నోవేషన్ నెట్‌వర్క్ రూపుదిద్దుకుంటుంది. ఆర్ టిఐహెచ్ ద్వారా మన దగ్గర ప్రస్తుతం పూర్తిస్థాయిలో స్టార్టప్ లైఫ్‌సైకిల్ ఉంది. ఐడియా డిస్కవరీ, ఫ్యూచర్ ఫౌండర్స్, కేటలిస్టు, వెలాసిటీ ల్యాబ్స్ ద్వారా వేగంగా అభివృద్ధి సాధించడమే మా లక్ష్యం. ంఖఎఅ, ఓఎౌఇ ద్వారా ప్రోటోటైపింగ్, గ్రామీణ ప్రాంతాల్లో మొబైల్ యూనిట్ల ద్వారా ఇంక్యుబేషన్ చేపడతాం.

# విశాఖ పార్టీ కార్యాలయంలో మంత్రి లోకేష్ 73వ రోజు ప్రజాదర్బార్

## వివిధ సమస్యలతో బాధపడుతున్న వారి నుంచి అర్జీలు స్వీకరణ

## అండగా ఉంటామని బాధితులకు భరోసా

విశాఖపట్నం: విశాఖ తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ 73వ రోజు ప్రజాదర్బార్ నిర్వహించారు. తనను కలిసేందుకు వచ్చిన వారిని ఆప్యాయంగా పలకరించి వినతులు స్వీకరించారు. నకిలీ పత్రాలతో కొంతమంది వ్యక్తులు తమ 5.64 ఎకరాల వ్యవసాయ భూమిని కబ్జా చేసేందుకు యత్నిస్తున్నారని విజయనగరం జిల్లా పూసపాటిరేగ మండలం చిననడిపిల్లి గ్రామానికి చెందిన బంగారి శ్రీనివాసరావు మంత్రి లోకేష్ ను కలిసి ఫిర్యాదు చేశారు. విచారించి తగిన న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. జీవీఎంసీలో ఉద్యోగ అవకాశం కల్పించి తమకు అండగా నిలవాలని 'నీ తోడు సొసైటీ ఫర్ ట్రాన్స్ జండర్ పర్సన్స్' ప్రతినిధులు మంత్రి నారా లోకేష్ ను కలిసి విన్నవించారు. తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న తన కుమార్తెకు వైద్యసాయం అందించి ఆదుకోవాలని నెల్లూరు జిల్లా కోవూరుకు చెందిన కొప్పాల సుధాకర్ మంత్రి నారా లోకేష్ ను కలిసి విజ్ఞప్తి చేశారు. అనకాపల్లి జిల్లా రాంబిల్లి మండలం మర్రిపాలెంలోని తమ 3.10 ఎకరాల వ్యవసాయ భూమిని తప్పుడు పత్రాలతో మంచాల నాగేశ్వరరావు ఆక్రమించారని, విచారించి తగిన న్యాయం చేయాలని విశాఖకు చెందిన ఎన్.నరసింహస్వామి మంత్రి నారా లోకేష్ ను కలిసి ఫిర్యాదు చేశారు. ఆయా విజ్ఞప్తులను పరిశీలించి సమస్యలను పరిష్కారానికి కృషిచేస్తామని మంత్రి లోకేష్ హామీ ఇచ్చారు.

# జూబ్లీహిల్స్ ఉపఎన్నిక: బ్రాహ్మణ సంఘాల మద్దతుతో కాంగ్రెస్ విజయం

## తులసి శ్రీనివాసరావు

హైదరాబాద్ జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో జరిగిన ఉపఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ గెలుపులో బ్రాహ్మణ సంఘాల కీలక పాత్ర ఉందని ఆల్ ఇండియా బ్రాహ్మణ ఫెడరేషన్ నాయకులు తెలిపారు.ఫెడరేషన్ ప్రతినిధులు ఐటీ మంత్రి శ్రీధర్ బాబును కలిసి ఉపఎన్నికల్లో కాంగ్రెస్కు బ్రాహ్మణ సంఘాల సంపూర్ణ మద్దతు అందించిన విషయాన్ని తెలియజేశారు. మంత్రి ఇచ్చిన సూచనలు, దిశానిర్దేశాల మేరకు నవీన్ యాదవ్కు సంఘాలు మద్దతు తెలుపాయని నాయకులు సమావేశంలో పేర్కొన్నారు.ఈ సందర్భంగా ఫెడరేషన్ నేత తులసి శ్రీనివాసరావు మాట్లాడుతూ,"ముఖ్యమంత్రి మరియు శ్రీధర్ బాబు గారి ఆదేశాల ప్రకారం కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపించడంలో మా సంఘాలు సమష్టిగా పనిచేశాయి. లక్ష్యంగా పెట్టుకున్నట్లుగానే 25 వేల మెజార్టీతో నవీన్ యాదవ్ను గెలిపించగలమని విశ్వాసం ఉంది," అని అన్నారు.టీఆర్ఎస్ ప్రభుత్వం ప్రజలను భ్రమలో ఉంచి, చట్టపరమైన వ్యవస్థలను బలహీనపరిచిందని ఆయన విమర్శించారు. తెలంగాణ రాష్ట్రాన్ని అందించినది కాంగ్రెస్ పార్టీనే అని, అన్ని వర్గాలకు సమాన న్యాయం జరిగేలా కాంగ్రెస్ అమలు చేస్తున్న పథకాలు ప్రజల హృదయాలను గెలుచుకుంటున్నాయని తెలిపారు.రాబోయే రోజుల్లో వివిధ పార్టీల పరిస్థితి మరింత క్షీణిస్తుందని, ప్రజలు ఇప్పుడు చెయ్యి గుర్తునే విశ్వసిస్తున్నారని బ్రాహ్మణ సంఘాల నేతలు వెల్లడించారు.

# పరిసరాల పరిశుభ్రత తో పాటు వ్యక్తిగత శుభ్రత ఎంతో అవసరం.

## ఇంచార్జి జాయింట్ కలెక్టర్, కమిషనర్ ఎన్. మౌర్య.




తిరుపతి పరిసరాల పరిశుభ్రత తో పాటు ప్రతి రోజూ స్నానం చేయడం, చేతులు శుభ్రంగా కడుక్కోవడం వంటి వ్యక్తిగత శుభ్రత తో ఆరోగ్యంగా జీవించగలమని ఇంచార్జి జాయింట్ కలెక్టర్, నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్. మౌర్య తెలిపారు. స్వర్ణ ఆంధ్ర = స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం లో భాగంగా మూడవ శనివారం నగరంలోని స్కావెంజర్స్ కాలనిలో పరిసరాల పరిశుభ్రత = వ్యక్తిగత పరిశుభ్రతపై ప్రజలకు అవగాహనా కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు. ఏపి గ్రీనరీ అండ్ బ్యూటిఫికేషన్ ఛైర్పర్సన్ సుగుణమ్మ, రాష్ట్ర యాడవ కార్పొరేషన్ ఛైర్మన్ నరసింహ యాదవ్, డిప్యూటీ మేయర్ ఆర్.సి.మునికృష్ణ, కార్పొరేటర్ దూది కుమారి, రాష్ట్ర నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ రుద్రకోటి సదాశివం, ఎస్సీ కార్పొరేషన్ మెంబెర్ కుమారమ్మ, రజక కార్పొరేషన్ డైరెక్టర్ చంద్ర, అధికారులు ర్యాలీలో పాల్గొన్నారు. ఈ సందర్బంగా కమిషనర్ మాట్లాడుతూ స్వర్ణ ఆంధ్ర – స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం లో భాగంగా ప్రతి మూడవ శనివారం రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని అన్నారు. అందులో భాగంగా ఈ వారం స్కావెంజర్స్ కాలనిలో వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పిస్తున్నామని అన్నారు. స్కావేంజర్స్ కాలానితో పాటు అన్ని ప్రాంతాల్లో చెత్త కుప్పలు లేకుండా చూడడం, మరుగుదొడ్లు శుభ్రంగా ఉంచడం వంటివి నిర్వహిస్తామని తెలిపారు. అలాగే మన ఇందులో ఎటువంటి ఫంగస్ ఉండకుండా చూసుకోవడం, డ్రైనేజి కాలువలు ఉంచుకోవడం వంటి వాటిపై అవగాహన కల్పిస్తామని తెలిపారు. ఆరు బయట మాలమూత్ర విసర్జన నిరోధించడం, స్కూళ్లలో మరుగుదొడ్లు శుభ్రంగా ఉంచుకోవడం, ప్రతి రోజూ స్నానం చేయడం, రోగాల నియంత్రణకై చేతులు శుభ్రం చేసుకోవడం వంటి వాటిపై నగరపాలక సంస్థ సిబ్బంది అవగాహన కల్పిస్తారని తెలిపారు. ప్రతి ఒక్కరూ వీటిని పాటించి ఆరోగ్యాకరమైన జీవనం గడపాలని సూచించారు. ఈ కార్యక్రమం లో డిప్యూటీ కమిషనర్ అమరయ్య, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, డిసిపీ ఖాన్, నగరపాలక సంస్థ సిబ్బంది, ప్రజా ప్రతినిధులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

# ఎంపి చిన్ని కార్యాలయంలో బిర్సా ముండా జయంతి

విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) కార్యాలయంలో బిర్సా ముండా జయంతి కార్యక్రమం జరిగింది. బిర్సా ముండా చిత్ర పటానికి డి.టి.డబ్ల్యు.వో ఎమ్.పణి ధూర్జటి, టిడిపి నాయకులు, నేషనల్ కమిషన్ మెంబర్ మాదిగాని గురునాథం, డాక్టర్ జ్యోతిరావ్ నాయక్, పూలమాల వేసి నివాళులర్పించారు. మాదిగాని గురునాథం మాట్లాడుతూ జనజాతీయ గౌరవ దివస్ వల్ల ప్రాచుర్యంలో లేని గిరిజన చరిత్రికు ప్రాధాన్యత లభించింది. బిర్సా ముండా స్ఫూర్తితో గిరిజన సంక్షేమ, అభివృద్ధికి కృషి చేయాలి. బిర్సా ముండా ఆదివాసి వర్గానికి మాత్రమే కాదు దేశ సంపదని అన్నారు.డి.టి.డబ్ల్యు.వో ఎమ్.ఫణి ధూర్జటి మాట్లాడుతూ బిర్సా ముండా జయంతి కార్యాక్రమం ఎంపీ కేశినేని శివనాథ్ కార్యాలయం లో నిర్వహించటం సంతోషంగా వుంది. భారత స్వాతంత్ర్య సంగ్రామంలో గిరిజనులు కూడా పోరాడారు. ఎ.కొండూరులో ఎంపీ కేశినేని శివనాథ్ సహకారంతో గిరిజనుల కోసం సిల్క్ డెవలప్ సెంటర్ ఏర్పాటు కానుందని అ?నారు.డాక్టర్ జ్యోతిరావ్ నాయక్ మాట్లాడుతూ విద్య నేర్చుకోవటం కోసం బిర్సా ముండా చాలా కష్టపడ్డారు. గిరిజనుల్లో హైయర్ ఎడ్యుకేషన్ శాతం చాలా తక్కువగా వుంది. బిర్సా ముండా స్ఫూర్తితో గిరిజనులను విద్య వైపు ప్రోత్సహించాలని అన్నారు

## కోల్కత్తా నగరంలో అగ్నిప్రమాదం



కోల్కతాలో భారీ అగ్ని ప్రమాదం సంభవించింది. నగరంలోని ఎజ్రా స్ట్రీట్లో శనివారం తెల్లవారుజామున భారీ ఎత్తున మంటలు ఎగిసిపడ్డాయి. సమీప భవనాలు, ఆఫీసులకూ మంటలు వ్యాపిస్తున్నాయి. మంటలను గమనించిన స్థానికులు భయంతో ఇళ్ల నుంచి బయటకు పరుగులు తీశారు. విషయం తెలుసుకున్న పోలీసులు హుటాహుటిన స్పాట్కు వచ్చారు. 17 ఫైరింజన్లతో మంటలను అదుపుచేసారు.

## ముహూర్తం ఖరారు సర్పంచ్ ఎన్నికల నోటిఫికేషన్‌కు లైన్ క్లియర్.

హైదరాబాద్ జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక విజయం అధికార కాంగ్రెస్ ప్రభుత్వానికి ఊహించని ఉత్సాహాన్ని, రాజకీయంగా కొత్త బలాన్ని ఇచ్చింది. ఈ గెలుపును పునాదిగా చేసుకుని..ప్రభుత్వం ఇక స్థానిక సంస్థల ఎన్నికలకు పూర్తి స్థాయిలో సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. ముఖ్యంగా...గ్రామీణ ప్రాంతాల్లో తమ పట్టును మరింత బలోపేతం చేసుకోవడానికి ఈ ఎన్నికలను ఒక సువర్ణావకాశంగా కాంగ్రెస్ భావిస్తోంది. ఈ మేరకు ఈ నెల 17వ తేదీన తెలంగాణ కేబినెట్ సమావేశం నిర్వహించనున్నారు. దీనిలో స్థానిక సంస్థల ఎన్నికలపై నిర్ణయం తీసుకునే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి.స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి బీసీ వెనుకబడిన తరగతుల, రిజర్వేషన్ల అంశం ప్రభుత్వం ముందు ఉన్న అతిపెద్ద సవాలుగా మారింది. గతంలో ప్రవేశపెట్టిన 42 శాతం బీసీ రిజర్వేషన్లకు చట్టపరమైన లీగల్, సమస్యలు, అడ్డంకులు ఎదురవుతున్న నేపథ్యంలో, అధికారులు మరో నివేదికను సిద్ధం చేశారు.సుప్రీంకోర్టు ఆదేశాల ప్రకారం: షెడ్యూల్డ్ కులాలు ఎస్సీ, షెడ్యూల్డ్ తెగలు ఎస్టీ బీసీలకు కలిపి మొత్తం రిజర్వేషన్లు ఎట్టి పరిస్థితుల్లోనూ 50 శాతం మించకూడదు. ఈ న్యాయపరమైన పరిమితిని దృష్టిలో ఉంచుకుని..మొత్తం 50 శాతం పరిమితిలోనే బీసీలకు రిజర్వేషన్లు కేటాయించేలా అధికారులు మార్గాలను అన్వేషించారు. దీనికి సంబంధించి ఒక సమగ్ర నివేదికను ప్రభుత్వానికి సమర్పించారు.బీసీ రిజర్వేషన్లను 50 శాతం పరిమితికి లోబడి కేటాయించడం వల్ల, కొన్ని వర్గాల నుంచి వ్యతిరేకత వచ్చే అవకాశం ఉందని ముఖ్యమంత్రి భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో, ముఖ్యమంత్రి మంత్రులకు కీలక సూచనలు ఇచ్చినట్లు సమాచారం. బీసీల నాయకులతో, ప్రజాప్రతినిధులతో మాట్లాడి న్యాయపరమైన చిక్కుల కారణంగానే ఈ నిర్ణయం తీసుకోవాల్సి వచ్చిందని, ఇది కేవలం తాత్కాలికమేనని వివరించాలని ఆయన సూచించినట్లు తెలుస్తోంది. బీసీ సంక్షేమం పట్ల ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధిని, భవిష్యత్తులో వారికి మరింత న్యాయం చేసే ప్రణాళికలను వివరించడం ద్వారా ఎన్నికలకు వెళ్లాలని కాంగ్రెస్ వ్యూహం రచిస్తోంది.ప్రస్తుత పరిణామాలు గమనిస్తే..స్థానిక సంస్థల ఎన్నికల నోటిఫికేషన్ ఈ నెలాఖరులోగా లేదా తదుపరి నెల మొదటి వారంలోగా వచ్చే అవకాశాలు మెండుగా ఉన్నాయి. ఈ ఎన్నికలు గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో కాంగ్రెస్ పార్టీకి కొత్త స్థానిక నాయకత్వాన్ని అందించి, పార్టీ బేస్ ను మరింత బలోపేతం చేస్తాయని ప్రభుత్వం ఆశిస్తోంది. అలాగే..ఎన్నికల తర్వాత కూడా తమ ఆరు గ్యారంటీల అమలుకు స్థానిక సంస్థల ద్వారా మరింత వేగం పుంజుకోవచ్చని అధికార వర్గాలు అంచనా వేస్తున్నాయి. ఈ స్థానిక ఎన్నికలు తెలంగాణ రాజకీయాలపై, ముఖ్యంగా గ్రామీణ ఓటర్లపై కాంగ్రెస్ పట్టును స్పష్టంగా తెలియజేస్తాయి. జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక విజయం తర్వాత కాంగ్రెస్ కు ఆత్మవిశ్వాసం పెరిగిపోయింది. ఈ ఊపులోనే స్థానిక సంస్థలకు వెళ్తే బాగుంటుంది అనేది ప్రభుత్వం భావిస్తోంది.

## ఇందిరమ్మ ఇండ్లతో నెరవేరుతున్న సొంత ఇంటి కల

### మానకొండూరు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ హాజరైన ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్




ఇల్లంతకుంట, రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇండ్ల పథకంతో సొంత ఇంటి కల నెరవేరుతున్నదని మానకొండూరు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ తెలిపారు. ఇల్లంతకుంట మండల కేంద్రంలోని రైతు వేదికలో శనివారం ఇందిరమ్మ ఇండ్ల ప్రొసీడింగ్స్ పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించగా, ముఖ్య అతిథిగా మానకొండూరు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ హాజరయ్యారు. ఫిల్లర్ రూఫింగ్ తో ఖర్చు ఆదాఈ సందర్భంగా ఇల్లంతకుంటలో ఉన్న 40, ఓబులాపూర్ లో 24 ఇందిరమ్మ ఇండ్లకు సంబంధించి లబ్ధిదారులకు ఇండ్లు మంజూరు చేసి, ప్రొసీడింగ్స్ ఎమ్మెల్యే, ఇంచార్జి కలెక్టర్ పంపిణీ చేశారు. హౌసింగ్ శాఖ ఆధ్వర్యంలో నిర్మించిన ఇందిరమ్మ మోడల్ హౌస్ ను ఎమ్మెల్యే, ఇంచార్జి కలెక్టర్ కలిసి ప్రారంభించారు. ఇంటిలో వాతావరణం చల్ల బరిచేందుకు, నిర్మాణ ఖర్చు తగ్గించేందుకు ఫిల్లర్ రూఫింగ్, విధానంలో పూర్తి చేయడాన్ని చూసి అభినందించారు.అనంతారం గ్రామంలో గన్నెపల్లి అనూష అనే లబ్ధిదారు ఇందిరమ్మ ఇల్లు పూర్తి చేసుకోగా, నూతన గృహ ప్రవేశానికి ఎమ్మెల్యే, ఇంచార్జి కలెక్టర్ హాజరయ్యారు. గృహ ప్రవేశం చేసి, లబ్ధిదారుకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ. ప్రజా ప్రభుత్వంలో పేద ప్రజల స్వంత ఇంటి కల నెరవేరుతున్నదని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేశారని వెల్లడించారు. నాలుగు విడతల్లో రూ. ఐదు లక్షల ఆర్థిక సహాయం ప్రభుత్వం మంజూరు చేస్తుందని వెల్లడించారు. వివిధ దశల్లో ఉన్న ఇందిరమ్మ ఇండ్లను త్వరితగతిన పూర్తి చేసుకోవాలని పిలుపు ఇచ్చారు.అనంతరం ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలు పూర్తి చేసేందుకు బాధ్యతలు నిర్వర్తిస్తున్న అధికారులు, సిబ్బందిని అభినందించారు. తుది దశలో ఉన్న ఇందిరమ్మ ఇండ్లను త్వరగా పూర్తి చేసి, గృహ ప్రవేశానికి ఆహ్వానించాలని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో తహసిల్దార్ ఫారూఖ్, ఎంపీడీఓ శశికళ, హౌసింగ్ డీఈ ఖాజా ముజఫర్ తదితరులు పాల్గొన్నారు.

## గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా ఈరోజు పుస్తక ప్రదర్శన కార్యక్రమం



పాములపాడు శాఖా గ్రంథాలయం నందు 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను పురస్కరించుకొని గ్రంథాలయ అధికారి- సి.వి.కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో విద్యార్థిని,విద్యార్థులచే గ్రంథాలయంలో పుస్తక ప్రదర్శన కార్యక్రమం నిర్వహించడమైనది. ఈ సందర్భంగా లైబ్రేరియన్ సి.వి.కృష్ణారెడ్డి మాట్లాడుతూ గ్రంథాలయంలో రకరకాల కథల పుస్తకాలు, విజ్ఞానానికి, వినోదానికి, భారత దేశ చరిత్ర గురించి, స్వాతంత్ర సమరయోధుల గురించి, రాజ్యాంగం గురించి, ఉద్యోగాల గురించి, స్వయం ఉపాధి గురించి రకరకాల పుస్తకాలు ఉంటాయన్నారు. అదేవిధంగా ప్రతిరోజు దినపత్రికలు కూడా అందరికీ అందుబాటులో కనుక ప్రతి ఒక్కరూ ఉదయం సాయంత్రం గ్రంథాలయానికి వచ్చి చదువుకొని అభివృద్ధి చెందాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాఠకులు వెంకటేశ్వర్లు ,రవి, పరమేష్, వివిధ పాఠశాలల విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

## వాస్తవాలు చెప్పేస్తానని చెప్పడంతోనే చంపేశారు

### కిరణ్ రాయల్, తిరుపతి జనసేన ఇంచార్జ్

తిరుపతి అప్పుడు బాబాయ్ వివేక, ఇప్పుడు సతీష్ కుమార్ కు వైసీపీ గొడ్డలి పోటు.బాబాయ్ వివేకకు, సతీశ్ కుమార్ కు ఒకే చోట గాయాలు ఉన్నట్లు తెలుస్తోందని తిరుపతి జనసేన బాధ్యుడు కిరణ్ రాయల్ అన్నారు.

ప్లేసులు మాత్రమే మారాయి. హత్య ప్యాట్రన్ ఒక్కటే . పరకామణి ఇష్యూ చివరి దశకు చేరుకుంది . హుండీ డబ్బులు వాటా వేసుకున్నారు అప్పటి పాలకులు. సతీశ్ కుమార్ ను సీఐడీ అధికారులు ఎం విచారించారో కరుణాకర్ రెడ్డికే తెలుసు. న్యాయవాది లక్ష్మణ రావు బెదిరించాడని కరుణాకర్ రెడ్డికి ఎవరు చెప్పారు. భూమన, ధర్మారెడ్డికి సతీష్ కుమార్ టచ్ లో ఉన్నారు. భారీ సుపారీ ఇచ్చి చంపేశారని ఆరోపించారు.

సుబ్బారెడ్డి, కరుణాకర్ రెడ్డి కన్నా పెద్ద వ్యక్తి ఈ హత్యకు కుట్ర చేశారు. అధికారం లేకున్నా హత్యలు ఎలా చేస్తున్నారో అర్థం కాలేదు. సతీశ్ కుమార్ కేసు పెట్టి, రాజీ చేసి, చివరకు సీఐడీ విచారణ జరుగుతున్న తరుణంలో చనిపోయాడు. వైసీపీ ప్రతిపక్షంగా ఉన్న సమయంలో గొడ్డలి బ్యాచ్ బయటకు వస్తుంది. వాస్తవాలు చెప్పేస్తానని చెప్పడంతోనే చంపేశారు. ఈ కేసులో ఇద్దరే ముఖ్యం. ఒకటి సతీశ్ కుమార్, మరొకటి రవికుమార్ . కంప్లైంటీ చనిపోయారు. ఈ కేసు ఎంతవరకు ముందుకు సాగుతుందో లేదో తెలియదు. రవికుమార్ కు భద్రత కల్పించండి. ఈ కేసులో బల్బ్ రవికుమార్ అయితే, సతీష్ స్విచ్. కరుణాకర్ రెడ్డి ఎప్పుడు డాక్టర్ అయ్యాడో తెలియడం లేదు. పోస్టుమార్టం రిపోర్ట్ లు సైతం ఆయనే ఇచ్చేస్తున్నారని అన్నారు.

## ఈనెల 19న పీఎం కిసాన్ నిధులు!

న్యూఢిల్లీ, ప్రధాన మంత్రి కిసాన్ సమ్మాన్ నిధి పీఎం కిసాన్, యోజన పథకం 21వ వాయిదా సొమ్ము ఈ నెల 19న రైతన్నల బ్యాంకు ఖాతాలకు జమ అవుతుంది. ఈ సొమ్మును ప్రధాని మోదీ విడుదల చేస్తారని కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ తెలిపారు.ఈ పథకం క్రింద అర్హులైన అన్నదాతలకు సంవత్సరానికి రూ.6,000 మూడు విడతల్లో అందజేస్తున్న సంగతి తెలిసిందే.

## ముంపు ప్రాంతాలను పరిశీలించిన మంత్రి పొన్నం



హుస్నాబాద్ భారీ వర్షాలకు ముంపుకు గురైన హుస్నాబాద్ బస్ స్టేషన్ ప్రాంతాలను మంత్రి పొన్నం ప్రభాకర్ పరిశీలించారు. హుస్నాబాద్ బస్ స్టేషన్ లో భారీ వర్షాలకు నీట్ మునగడంతో శాశ్వత పరిష్కారం చేసేలా అధికారులకు పలు సూచనలు చేసారు. బస్ స్టేషన్ వెనుక వైపు ఉన్న డ్రైనేజీ లోకి బస్ స్టాండ్ వరద నీరు పోయేలా లింక్ కాలువ ఏర్పాటు చేయాలని సూచించారు. బస్ స్టేషన్ లో భవిష్యత్ ప్రయాణికులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని అన్నారు. తరువాత మంత్రి హుస్నాబాద్ మార్కెట్ కమిటీ సందర్శించారు. ధాన్యం కొనుగోలు వేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు. ధాన్యం లోడ్ అయిన 48 గంటల్లో రైతుల ఖాతాలో డబ్బులు జమ అయ్యేలా చూడాలని అధికారులను ఆదేశించారు. ఇటీవల వర్షాలకు తడిసిన ధాన్యాన్ని పూర్తిగా కొనుగోలు చేశామని వారి ఖాతాలో డబ్బులు కూడా జమ అయ్యాయని వెల్లడించారు.కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ చైర్మన్ లింగమూర్తి, హుస్నాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ తిరుపతి రెడ్డి,ఇతర ముఖ్య నేతలు, అధికారులు పాల్గొన్నారు.

## రాష్ట్ర వ్యాప్తంగా చెరువుల్లో నాణ్యమైన చేప పిల్లల పంపిణీ

### హుస్నాబాద్ ఎల్లమ్మ చెరువులో 5.17 లక్షల రూపాయలతో 3 లక్షల చేప పిల్లల విడుదల



హుస్నాబాద్ చేప పిల్లల పంపిణీ పారదర్శకంగా ఉండేలా చెరువుల వద్ద సైన్ బోర్డుల ఏర్పాటు.హుస్నాబాద్ పశువైద్య శాల ఆధునీకరణ చేపల మార్కెట్, స్టోరేజ్ సెంటర్,పాల శీతలీకరణ కేంద్రం ఏర్పాటు చేస్తాం.హుస్నాబాద్ టూరిజం గా అభివృద్ధి చేసి మత్స్య సంపద ద్వారా ఆర్థిక వృద్ధి సాధించేలా చర్యలు చేపల పంపిణీ కార్యక్రమంలో మంత్రులు పొన్నం ప్రభాకర్, వాకిటి శ్రీహరిహుస్నాబాద్ లో మత్స్య సంపద మరింత అభివృద్ధి చెందేలా చర్యలు తీసుకుంటామని సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ నియోజకవర్గ కేంద్రంలోని ఎల్లమ్మ చెరువులో చేప పిల్లల విడుదల కార్యక్రమంలో మంత్రులు పొన్నం ప్రభాకర్, వాకిటి శ్రీహరి,ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయి కుమార్ లు వెల్లడించారు. హుస్నాబాద్ ఎల్లమ్మ చెరువు లో 5.17 లక్షల రూపాయలతో 3 లక్షల చేప పిల్లలు విడుదల చేశారు.ఎల్లమ్మ చెరువులో ఉచిత చేప పిల్లల పంపిణీ ద్వారా 253 మంది మత్స్య కారుల కుటుంబాలకు లబ్ధి చేకూరనుంది.నియోజకవర్గం మొత్తం 165 చెరువులకు గాను 38 లక్షల 92 వేల ఉచిత చేప పిల్లలు విడుదల చేయనున్నారు.ఈ పథకం వల్ల నియోజకవర్గంలో 4,144 మంది మత్స్య కారుల కుటుంబాలకు లబ్ధి చేకూరుతుంది. ఉచిత చేప పిల్లల పంపిణీ ద్వారా మత్స్య కారులను ఆర్థికంగా బలోపేతం చేసి,రాష్ట్ర ఆర్థిక వ్యవస్థలో మత్స్య శాఖ కీలకంగా మారేలా ప్రభుత్వం ప్రోత్సహిస్తుంది. ఇప్పటికే నియోజకవర్గంలో ఇందిరా మహిళా శక్తి పథకం ద్వారా మహిళా సంఘాలకు 3 మొబైల్ ఫిష్ రిటైల్ అవుట్లెట్ అందించడం జరిగింది. అంతేకాకుండా ప్రమాదవశాత్తు మత్స్యకారులు మరణిస్తే వారికి గ్రూప్ యాక్సిడెంట్ ఇన్సూరెన్స్ పాలసీ తీసుకొని వచ్చి 5లక్షల రూపాయలు బీమా కల్పిస్తూ వారికి కుటుంబానికి భరోసా కల్పిస్తుంది.మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ. హుస్నాబాద్ లో వెటర్నరీ హాస్పిటల్ నూతన భవనాన్ని నిర్మించి అధునాతన వెటర్నరీ హాస్పిటల్ నిర్మించాలని, అదేవిధంగా అసంపూర్తిగా ఉన్న మోడర్న్ చేపల మార్కెట్ ను పూర్తి చేయాలని ,వెటర్నరీ డాక్టర్ పోస్టు మంజూరు చేయాలని,గోపాల మిత్ర సమస్యలు పరిష్కరించాలని మత్స్య పశు సంవర్ధక శాఖ మంత్రి వాకిటి శ్రీహరి కి మంత్రి పొన్నం ప్రభాకర్ విజ్ఞప్తి చేశారు. మంత్రి పొన్నం ప్రభాకర్ విజ్ఞప్తికి స్పందించి హుస్నాబాద్ పశువైద్య శాల ఆధునీకరణ , చేపల మార్కెట్, స్టోరేజ్ సెంటర్, పాల శీతలీకరణ కేంద్రం ఏర్పాటు చేస్తామని మంత్రి వాకిటి శ్రీహరి హామీ ఇచ్చారు. గురుకులాల్లో మటన్, చికెన్ లాగా చేపలు కూడా మెనూ ఉండాలని ఇటీవల మంత్రి వాకిటి శ్రీహరి లేవనెత్తిన అంశాలు గురుకులాల్లో మెనూ లో చేపలు కూడా ఉండేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. హుస్నాబాద్ ఎల్లమ్మ చెరువు లో 3 లక్షల చేప పిల్లలు వేయగా ఇంకో 60 వేల చేప పిల్లలు,రొయ్యలు వేయాలని కోరారు. హుస్నాబాద్ టూరిజం అభివృద్ధి చేస్తున్నామని ఇక్కడికి వచ్చే వారు చేపలు కొనేలా అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు.మంత్రి వాకిటి శ్రీహరి మాట్లాడుతూ.ఎప్పుడూ నియోజకవర్గం గురించి ఆలోచించే వ్యక్తి పొన్నం ప్రభాకర్ అని కొనియాడారు.మత్స్య శాఖకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి 123 కోట్లు కేటాయించారనీ దానికి మంత్రి పొన్నం ప్రభాకర్ కీలక పాత్ర పోషించారని తెలిపారు. ఈ బడ్జెట్ లో 84 కోట్ల చేపపిల్లలు 10 కోట్ల రొయ్య పిల్లలు రాష్ట్రంలో ఉన్న 26వేల నీటి వనరుల్లో ఉచిత చేప పిల్లల పంపిణీ చేయడం జరుగుతుందనీ వెల్లడించారు.గతంలో చేపపిల్లల పంపిణీలో విషయంలో అవకతవకలు జరిగాయని ఈసారి ఏ చేప దాని సైజు, అవి ఎన్ని చేప పిల్లలు అని తెలిపేలా పారదర్శత కోసం చెరువుల వద్ద సైన్ ఏర్పాటు చేస్తున్నామని పేర్కొన్నారు. మత్స్య సంపద పై రాష్ట్రంలో 5 లక్షల మంది మత్స్య కారుల కుటుంబాలు ఆధారపడి ఉన్నాయని వారి అభివృద్ధికి కృషి చేస్తున్నామన్నారు.చేపల ఉత్పత్తి కేంద్రాలు పెంచి గణనీయంగా పెంచి ఇతర ప్రాంతాలకు సరఫరా చేసేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని ,అత్యాధునిక సదుపాయాలతో ఫిష్ మార్కెట్లు కూడ ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు.గుర్తించిన మత్స్యకారులకు కోటి40 లక్షలతో ఇన్సూరెన్స్ పాలసీ తీసుకొని వచ్చామనీ మంత్రి వాకిటి శ్రీహరి పేర్కొన్నారు.హుస్నాబాద్ ప్రాంత అభివృద్ధికి తన వంతుగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు.చేపల పంపిణీ లో అవినీతికి తావులేకుండా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో మంత్రులు పొన్నం ప్రభాకర్, వాకిటి శ్రీహరి మార్గదర్శకత్వంలో పారదర్శకంగా చేప పిల్లల పంపిణీ చేస్తున్నామని ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయి కుమార్ వెల్లడించారు.కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ హైమవతి, గ్రంథాలయ సంస్థ చైర్మన్ లింగమూర్తి, హుస్నాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ తిరుపతి రెడ్డి, కోహెడ మార్కెట్ కమిటీ చైర్మన్ నిర్మలా జయరాజ్ ,సింగిల్ విండో చైర్మన్ శివయ్య, మత్స్య సహకార సంఘం నాయకులు, ఇతర ముఖ్య నేతలు, అధికారులు పాల్గొన్నారు.

# విశాఖలో బిర్సా ముండా కు నివాళులు

విశాఖ జన జాతీయ గౌరవ దివస్ కార్యక్రమంలో బిజెపి ఎపి అధ్యక్షులు పివి.యన్. మాధవ్ పాల్గోన్నారు. బిర్సా ముండా 150వ జయంతి సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూల వేసి బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు పివిఎన్ మాధవ్ , మాజీ ఎంపీ జివియల్ నరసింహ రావు నివాళి అర్పించారు.

బిజెపి ఎపి అధ్యక్షులు పివిఎన్ మాధవ్ మాట్లాడుతూ బిర్సా ముండా చదువుతో పాటు సమాజ హితం పై ఆలోచనలు చేసేవారు. గిరిజన సంప్రదాయాలు గిరిజన పండుగలను ఎందుకు తక్కువ చేస్తున్నారని ఆవేదన చెందేవారు. మన సంస్కృతి నుంచి దూరం చేసి మనల్ని బానిసలు చేసే విధంగా బ్రిటిష్ ప్రభుత్వం కుట్ర చేస్తుందని గ్రహించారు. మన సాంప్రదాయాలను మనకు దూరం చేసిన వైనంపై గట్టిగా ప్రశ్నించారు. గిరిజనుల వస్త్రధారణ, ఆచార వ్యవహారాలపై పెద్ద ఎత్తున ప్రచారం చేశారు. మన నాగరికత అందరికీ చేరాలని పెద్ద ఎత్తున పోరాటం చేశారని అన్నారు.

ఆయన పోరాటం వల్ల గిరిజనులలో చైతన్యం వచ్చింది . మారుమూల ప్రాంతంలో ఉండి బ్రిటిష్ వారిని తరిమికొట్టడంలో గిరిజనులు కీలకంగా వ్యవహరించారు. బిర్సా ముండా 150 వ జయంతి సందర్భంగా ఆయన పేరుతో కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం, గిరిజనుల భాష వారి సంప్రదాయాలను ప్రతి ఒక్కరు గౌరవించాలని అన్నారు.

జన జాతి గౌరవ దినోత్సవం పేరుతో పండుగను పెద్ద ఎత్తున చేస్తున్నాం . ఒకటో నుంచి 15వ తేదీ వరకు అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో కార్యక్రమాలు ఉంటాయి. ప్రభుత్వ విద్యాసంస్థల్లో ఆయన పేరుతో పాఠ్యాంశాన్ని చేర్చే కార్యక్రమం జరుగుతుంది. ఈ 15 రోజులు గిరిజనుల సంప్రదాయాలు ప్రతిబింబించేలా పెద్ద ఎత్తున ఉత్సవాలు నిర్వహిస్తున్నాం. ఆంధ్రప్రదేశ్లో కూడా ఈ కార్యక్రమాలు నిర్వహించేలా రేపు పాడేరులో భారీ బహిరంగ సభ ఏర్పాటు చేస్తున్నాం . గిరిజనుల సంస్కృతి సంప్రదాయాలు వారి జీవన విధానంపై ప్రతి ఒక్కరికి వివరిస్తాం. గిరిజనులకు సంబంధించిన విద్యా వైద్యం ఉపాధి గృహ నిర్మాణంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టే కార్యక్రమానికి శ్రీకారం చుడతాం. ఇప్పటికే రౌండ్ టేబుల్ సమావేశాలు పెట్టి ఆయన పోరాటం, త్యాగాల గురించి ప్రత్యేకంగా వివరించాం. రేపు పాడేరు లో జరిగే సభకు ఒడిస్సా ముఖ్యమంత్రి తోపాటు, ఎపి మంత్రులు సత్య కుమార్ , గుమ్మడి సంధ్యారాణి, కందుల దుర్గేష్, ఇతర గిరిజన ఎమ్మెల్యే లు పాల్గొంటారు. బిర్సా ముండా విగ్రహావిష్కరణ కూడా ఆదివారం ఉంటుంది. 20 వేల మందితో రేపు జరిగే బహిరంగ సభలో అందరూ పాల్గొనాలి. బిఆర్ అంబేద్కర్ తిరిగిన ప్రాంతాలను పర్యాటక ప్రాంతాలుగా అభివృద్ధి చేస్తాం. గిరిజనులకు చేయూతనిచ్చేలా ఎస్టీ కమిషన్ను మరింత బలోపేతం చేస్తాం. యన్డిఎ ప్రభుత్వం లో భారత రాష్ట్రపతి తో పాటు, తొమ్మిది మంది కేంద్రం మంత్రులు ఎస్టిలు ఉన్నారు.

వారి అభ్యున్నతి కోసం ఆర్థికంగా ఎదిగేందుకు మోడీ అనే కార్యక్రమాలు చేస్తున్నారు. గిరిజనులు సొంతంగా ఎదిగేలా వారి కాళ్ల పై వారు నిలబడేలా కేంద్ర ప్రభుత్వం చేయూతను ఇస్తుందని అన్నారు.

## మహాకూటమి ఓటమిలో జనసురాజ్ - కీలక పాత్ర

పాట్నా , నవంబర్ 15 బీహార్ అసెంబ్లీ ఎన్నికల 2025లో ఎన్‌డీఏ భారీ విజయం సాధించడంతో ముఖ్యమంత్రి నితీష్ కుమార్ అధికారంలోకి రావడం ఖాయమైంది. 243 సీట్ల అసెంబ్లీలో ఎన్‌డీఏ 200కి పైగా సీట్లు గెలుచుకుని 'డబుల్ సెంచరీ' సాధించగా, ఆర్జేడీ నేతృత్వంలోని మహాఘట్‌బంధన్ కూటమి కేవలం 40 సీట్లకు పరిమితమయింది. ఇంత ఘోరంగా ఓడిపోవడంలో ప్రశాంత్ కిషోర్ జనసురాజ్ పార్టీ ప్రభావం కీలకంగా కనిపిస్తోంది. మొదటి ఎన్నికల్లోనే 238 సీట్లకు పోటీపడిన జనసురాజ్ ఒక్క సీటూ గెలవకపోయినా, దాని 3-4% ఓటు షేర్ ఆర్జేడీ కూటమి అవకాశాలను గణనీయంగా దెబ్బతీసింది. ఇది ప్రధానంగా యువత, ఓబీసీలు, కుల ఓట్లను విభజించి, ఎన్‌డీఏకు పరోక్షంగా లాభం చేకూర్చింది.జనసురాజ్ ప్రదర్శన 238 సీట్లలో పోటీ చేసింది. మొత్తం 243లో 5 సీట్లలో మాత్రమే పోటీ చేలేదు. మొత్తం ఓటు షేర్ 3-4% మధ్య ఉంటుంది. 40కి పైగా నియోజకవర్గాల్లో పది వేలకుపైగా ఓట్లను ఆ పార్టీ అభ్యర్థులు సాధించారు. ఇవి ప్రధానంగా ఆర్జేడీ బలమైన ఉత్తర్ బీహార్, మగధ్ ప్రాంతాల్లో ఉననాయి. కానీఒక్క సీటు కూడా గెల్చుకోలేకపోయారు. 68 నియోజకవర్గాల్లో నోటా కంటే తక్కువ ఓట్లు వచ్చాయి. కానీ కొన్ని స్వల్ప ఓట్లు కూడా కూటమి అవకాశాలను దెబ్బతీశాయి. జనసురాజ్ ప్రధానంగా "మార్పు" స్లోగన్‌తో యువత, ఓబీసీలు, ఈబీసీల ఓట్లను లక్ష్యంగా చేసుకుంది. ఇది ఆర్జేడీ యాదవ్-ముస్లిం కోర్ ఓటు బ్యాంకును 5-10 శాతం వరకు కోతపెట్టింది. ఫలితంగా, మహాఘట్ బంధన్ ఓటు షేర్ 2020లో 37 శాతం నుంచి 30 శాతానికి పడిపోయింది. ప్రశాంత్ కిషోర్ జేడీయూ-నితీష్‌ను ఓడించాలని లక్ష్యంగా పెట్టుకున్నా, జనసురాజ్ ఓట్లు ప్రధానంగా ఆర్జేడీ నుంచే వచ్చాయి, ఎన్‌డీఏకు పరోక్ష సహాయం చేశాయి. చేరియా బరియార్‌పూర్ నియోజకవర్గంలో ఆర్జేడీ అభ్యర్థి సుశీల్ కుమార్ ఓడిపోయారు. జనసురాజ్ 12-15% ఓట్లు తీసుకుని, ఆర్జేడీ ఓటమికి కారణం అయింది. షెర్‌ఘాటీలో ఆర్జేడీ అభ్యర్థి ప్రమోద్ వర్మా ఓటమి పాలయ్యారు. జనసురాజ్ యువ ఓట్లు చీల్చడంతో ఆయన పరాజం పాలయ్యారు. జోకిహట్ లో మజ్లిస్ గెలిచింది. ఇక్కడ జనసురాజ్ చీల్చిన ఓట్లు కీలకం. ఇవి మాత్రమే కాదు, మగధ్, షేకహ్వాలీ ప్రాంతాల్లో 10-15 నియోజకవర్గాల్లో జనసురాజ్ మూడో,నాల్గో స్థానంలో నిలిచి, ఆర్జేడీ మార్జిన్‌లను 5-7 శాతం తగ్గించింది. సీమాంచల్‌లో మజ్లిస్ తో పాటు జనసురాజ్.. మహాకూటమి ఫలితాలను మార్చేసింది. జనసురాజ్ 'ఎంప్లాయ్‌మెంట్, కరప్షన్ ఫ్రీ బీహార్' స్లోగన్‌లతో 18-35 ఏళ్ల యువతను ఆకర్షించింది. ఆర్జేడీ యువ యాదవ్ ఓట్లు 10 శాతం వరకు కోల్పోయింది. ప్రశాంత్ కిషోర్ కుల రహిత వాదన చేసినా, ఓబీసీ-ఈబీసీల్లో ఆర్జేడీ ఓట్లు బదిలీ అయ్యాయి. ఇది మహాకూటమి బలహీనపరిచింది. 3,000 కి.మీ. పాదయాత్ర చేసినా, క్యాండిడేట్లకు గుర్తింపు లేకపోవడం వల్ల ఓట్లు కేంద్రీకరించలేకపోయింది. ఎగ్జిట్ పోల్స్ 1-5 సీట్లు అంచనా వేసినా, రియల్‌టీలో ఆర్జేడీ, కాంగ్రెస్ ఓటమికి మాత్రమే ఉపయోగపడింది.

# ఐ బొమ్మ నిర్వాహకుడు ఇమ్మడి రవి అరెస్టు

## కరేబియన్ దీవుల నుంచి వెబ్‌సైట్ నిర్వహణ

హైదరాబాద్ , నవంబర్ 15 సినిమాలను, వెబ్‌సిరీస్‌లను పైరసీ చేస్తూ వెబ్‌సైట్‌లో పెట్టిన ఐ బొమ్మ(ప్రస్తుతం బప్పమ్ టీవీ) నిర్వాహకుడు ఇమ్మడి రవిని పోలీసులు అరెస్టు చేశారు. పైరసీ విషయంలో పోలీసులకు గతంలో అతను సవాల్ చేశాడు. దమ్ముంటే పట్టుకోవాలని, అందరి పర్సనల్ వివరాలు బయటపెడతానంటూ బెదిరించాడు. ఈ బెదిరింపును పోలీసులు సీరియస్‌గా తీసుకొని ఇన్నిరోజులు కాపు కాసి ఆయన్ని పట్టుకున్నారు. హైదరాబాద్‌లోని కుకట్‌పల్లిలో అతన్ని అదుపులోకి తీసుకున్నారు.ప్రపంచవ్యాప్తంగా విడుదలైన సినిమాలను అదే రోజు వెబ్‌సైట్‌లో పెడుతూ తీవ్ర చర్చనీయాంశమైందీ ఐ బొమ్మ పైరేటెడ్ వెబ్‌సైట్. ఈ అంశం ప్రస్తావనకు వచ్చిన ప్రతిసారి కూడా ఈ వెబ్‌సైట్‌పేరు సినిమా నిర్మాతల మధ్య చర్చకు వచ్చేది. పోలీసులకు నిర్మాతల మండలి ఫిర్యాదులు చేసేది. కానీ ఇంత వరకు సీరియస్‌గా యాక్షన్ తీసుకున్నది లేదు. ఈ మధ్యకాలంలో సినిమా పరిశ్రమ నుంచి ఒత్తిడి రావడంతో పోలీసులు గట్టి చర్యలు ప్రారంభించారు. అందులో భాగంగా నెల రోజుల క్రితం కీలకమైన ఓ ముఠాను అరెస్టు చేశారు.ఐదుగురు సభ్యులు ఉన్న ముఠాను అరెస్టు చేసిన సందర్భంగా అప్పటి సీపీ సీవీ ఆనంద్ మాట్లాడుతూ పైరసీ వెబ్‌సైట్‌లు ఎలాంటి టెక్నాలజీ ఉపయోగించినా సరే పట్టుకుంటామని అన్నారు. ముఖ్యంగా ఐ బొమ్మ వంటి సంస్థలను వదిలిపెట్టేదేలేదని హెచ్చరించారు. పోలీసులు ఈ హెచ్చరిక జారీ చేసిన వెంటనే ఐబొమ్మ పోలీసులకు సవాల్ చేసింది. దమ్ముంటే తమను పట్టుకోవాలని ఛాలెంజ్ చేసింది. తమను పట్టుకుంటే ఎవరిని ఎక్కడ ఫోకస్ చేయాలో తమకు తెలుసని చెప్పుకొచ్చింది. అంతే కాకుండా తమ దగ్గర చాలా మంది ప్రైవేటు డేటా ఉందంటూ బెదిరింపులకు దిగింది. మొత్తాన్ని ఇన్ని రోజులు విచారణ చేసిన పోలీసులు కీలక వ్యక్తిని అరెస్టు చేశారు. కరేబియన్ దీవుల్లో ఉంటూ అక్కడి నుంచి ఈ పైరసీ సినిమాలను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేస్తూ వచ్చారు.

ఫ్రాన్స్‌లో ఉంటూ సినిమా వాళ్లకు చుక్కలు చూపించాడు రవి. ఫ్రాన్స్ నుంచి వచ్చిన వెంటనే ఇతన్ని అదుపులోకి తీసుకున్నారు. థియేటర్లలో లేదా ఒటిటిలో సినిమా రిలీజ్ అయిన వెంటనే అప్‌లోడ్ చేస్తున్నాడు. దీనివల్ల సినిమా నిర్మాతలు భారీగా నష్టపోతున్నారు. ఇప్పటికే ఈ వెబ్‌సైట్‌పై వందల ఫిర్యాదులు ఉన్నాయి. వీళ్లంతా కూడా విదేశాల్లో ఉంటూ సినిమాలు పైరసీ చేస్తుండటంతో పోలీసులు ఎలాంటి చర్యలు తీసుకోలేకపోతున్నారు. అలాంటి వాళ్లు దేశానికి వచ్చినప్పుడు మాత్రమే అరెస్టు చేయగలుగుతున్నారు. పైరసీ ఈ స్థాయిలో పెరిగిపోవడానికి ఇది కూడా కారణమని పోలీసులు చెబుతున్నారు.రవి భార్య నుంచి విడాకులు తీసుకొని ఒంటరిగా ఉంటున్నాడు. ఫ్రాన్స్‌లో ఉంటూ వివిధ దేశాల్లో తన నెట్‌వర్క్‌ను విస్తరించాడు. ముఖ్యంగా కరేబియన్ దీవుల నుంచి వెబ్‌సైట్‌ను మేనేజ్ చేస్తూ వచ్చాడు. ఈ విషయాలు తెలిసినప్పటికీ పోలీసులు ఏం చేయలేని పరిస్థితి ఏర్పడింది. మరోవైపు ఆయన్ని అరెస్టు చేసిన తర్వాత కీలక విషయాలు తెలుసుకున్నారు. అతని వద్ద లెటెస్ట్ సినిమాలకు సంబంధించిన వివరాలు, ప్రింట్‌లు స్వాధీనం చేసుకున్నారు.

ఆయన అకౌంట్‌లో ఉన్న 3 కోట్ల రూపాయలను కూడా అధికారులు ఫ్రీజ్ చేశారు

## సజ్జనార్ పేరుతో మోసం

హైదరాబాద్ , నవంబర్ 15 పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్ పేరును వాడుకుని, ఆయన స్నేహితుడిని బురిడీ కొట్టించి ?20,000 కొట్టేశారు. ఈ విషయాన్ని స్వయంగా వీసీ సజ్జనార్ తన ఫేస్‌బుక్ ద్వారా వివరించారు. "నా పేరు వాడుకుని ఫేక్ ఫేస్‌బుక్ ఖాతాలు సృష్టించి, నా స్నేహితులకు 'నేను ఆపదలో ఉన్నాను. డబ్బులు పంపించండి' అని సైబర్ నేరగాళ్లు సందేశాలు పంపిస్తున్నారు. దురదృష్టవశాత్తు, నిజమేనని నమ్మి నా స్నేహితుడు ఒకరు ?20,000ను మోసగాళ్ల ఖాతాకు పంపారు," అని ఆయన ఫేస్‌బుక్‌లో పేర్కొన్నారు.

తన వ్యక్తిగత ఫేస్‌బుక్ పేజీ లింక్ ష్టబిబిజూబ://లిలిలి.టజీఇవఎనీనీఎ.ఇనీఎ/బష్ట్రజీతీవ/1ఆఊఖనిటంజూచితీ/. ఇది మినహా నా పేరుతో ఉన్న మిగతా ఖాతాలన్నీ నకిలీవే. ఈ ఫేక్ ఖాతాలను మెటా సహకారంతో హైదరాబాద్ సైబర్ క్రైమ్ టీమ్ తొలగించే పనిలో ఉంది," అని సజ్జనార్ వివరించారు.

ప్రజలకు సజ్జనార్ సూచనలు

- "నా పేరుతో, లేదా ఏ అధికారి/ప్రముఖ వ్యక్తి పేరుతో ఫేస్‌బుక్‌లో వచ్చే రిక్వెస్ట్‌లకు స్పందించవద్దు."
- "డబ్బులు పంపాలని వచ్చే సందేశాలను అసలు నమ్మవద్దు."
- "ఒకవేళ ఎవరైనా డబ్బులు పంపమని మెసేజ్‌లు చేస్తే, ముందుగా ఫోన్ ద్వారా ఆ వ్యక్తిని స్వయంగా సంప్రదించి పరిశీలించాలని" ఆయన కోరారు.
- అనుమానాస్పద లింకులు, మెసేజ్‌లు, వీడియో కాల్స్‌ను వెంటనే బ్లాక్ చేసి రిపోర్ట్ చేయడం ద్వారా ఇలాంటి సైబర్ నేరాల బారిన పడకుండా ఉండవచ్చని తెలిపారు.
- సైబర్ మోసాలను వెంటనే 1930 హెల్ప్‌లైన్‌కు లేదా లిలిలి.ఇఎవతీఇతీతిఎవ.ఐనీల.తిని లో రిపోర్ట్ చేయాలని విజ్ఞప్తి చేశారు.

# ఏపీ లిక్కర్ స్కామ్‌లో అనిల్ చోకరా అరెస్ట్..

విజయవాడ , నవంబర్ 15 ఆంధ్రప్రదేశ్‌లో వైఎస్‌ఆర్ కాంగ్రెస్ ప్రభుత్వ కాలంలో జరిగిన మద్యం విధాన కుంభకోణంలో మరో కీలక నిందితుడు అరెస్టయ్యాడు. ముంబైకు చెందిన అనిల్ చోకరాను స్పెషల్ ఇన్వెస్టిగేషన్ టీమ్ (సిట్) అధికారులు శుక్రవారం అరెస్టు చేశారు. ఆయనను విజయవాడ సిట్ కార్యాలయానికి తీసుకువచ్చి ప్రశ్నిస్తున్నారు. ఈ అరెస్ట్‌తో మద్యం సిండికేట్‌లకు చెల్లించిన ముడుపులు, బ్లాక్ మనీ మార్పిడి విషయాలు మరింత వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది అనిల్ చోకరా ముంబై కేంద్రంగా పనిచేసే మనీ లాండరింగ్ నిపుణుడు. గతంలో రెండుసార్లు మనీ లాండరింగ్ కేసుల్లో అరెస్టయ్యాడు. ఈ కేసులో అతడిని 49వ నిందితుడిగా చేర్చారు. ముంబైలో షెల్ కంపెనీల ద్వారా అక్రమ డబ్బును మార్చడంలో ప్రసిద్ధి చెందాడు. ఏపీ మద్యం కుంభకోణంలో అతని పాత్ర చాలా కీలకంగా ఉంది, ఎందుకంటే అతను బ్లాక్ మనీని వైట్ మనీగా మార్చి, మద్యం వ్యాపారంలో పెద్దలకు చేర్చడంలో ముఖ్యమైన లింక్‌గా పనిచేశాడు. ఏపీ మద్యం విధానంలో జరిగిన అక్రమాలు, ముడుపులు, షెల్ కంపెనీల ద్వారా × ఏ1 నిందితుడు కాసిరెడ్డి రాజశేఖర్ రెడ్డి, ఏ7 నిందితుడు ముప్పిడి అవినాశ్ రెడ్డి లకు సంబంధించిన బ్లాక్ మనీని వైట్ మనీగా మార్చడంలో కీలకపాత్ర పోషించాడు.మద్యం సిండికేట్‌లు 'ఆదాన్', 'లీలా', 'ఎస్‌పీవై' వంటి కంపెనీల నుంచి సేకరించిన రూ. 77.55 కోట్లు ముంబైకి చెందిన నాలుగు షెల్ కంపెనీల ద్వారా వైట్ మనీగా మార్చారు. చట్టానికి దొరకకుండా ఉండేలా 32 ఇతర షెల్ కంపెనీలకు వివిధ మార్గాల ద్వారా నగదుగా పంపిణీ చేశారు. ఈ డబ్బును మద్యం సిండికేట్‌లకు, అప్పటి ప్రభుత్వ పెద్దలకు ముడుపులుగా చెల్లించారు. ఈ కుంభకోణం వైఎస్‌ఆర్‌సీపీ ప్రభుత్వ కాలంలో జరిగింది. ఇప్పటికే ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) మనీ లాండరింగ్ కేసు నమోదు చేసి విచారణ జరుపుతోంది.అనిల్ చోక్రా ఆర్థిక నేరాల్లో దిట్ట. అతను ఇప్పటికే రెండుసార్లు మనీ లాండరింగ్ కేసుల్లో అరెస్టయ్యాడు. ఇవి ప్రధానంగా 2017-2018లో జరిగిన ఫేక్ ఇంపోర్ట్ రెమిటెన్స్ స్కామ్‌లకు సంబంధించినవి. ఈ కేసుల్లో ఇండస్‌ఇండ్ బ్యాంక్‌కు రూ. 1,100 కోట్లకు పైగా నష్టం కలిగించారని కేసు నమోదు అయింది. ఏప్రిల్ 2017 మొదటి సారి ఈడీ అరెస్టు చేసింది. డూప్లికేట్ బిల్స్ ఆఫ్ ఎంట్రీలను వివిధ బ్యాంకులకు సమర్పించి, లెజిటిమేట్ ఇంపోర్ట్‌లను ఫేక్‌గా చూపించారు. 2018 లో ఫేక్ డాక్యుమెంట్లతో ఫ్రాడ్ చేయడంతో పోలీసులు అరెస్టు చేశారు.

ఇఆ ఆస్తులు అటాచ్ చేసింది. 2022లో బాంబే హైకోర్టు బెయిల్ ఇచ్చింది.అయితే ఆయన పద్ధతి మార్చుకోలేదు. ఆర్థిక అక్రమాలకు పాల్పడుతూనే ఉన్నారు

## అనంతపురం జిల్లాలో రేమాండ్ ప్రాజెక్టులు–

## విశాఖ నుంచి వర్చువల్‌గా శంకుస్థాపన చేసిన సీఎం

విశాఖపట్టణం , నవంబర్ 15 విశాఖలో జరుగుతున్న 30వ సీఐఐ భాగస్వామ్య సదస్సు కేవలం ఒప్పందాలు చేసుకోవడమే కాకుండా శంకుస్థాపనలు కూడా జరుగుతున్నాయి. ఇవాళ అనంతపురంలో రేమాండ్ ప్రాజెక్టులకు పునాది రాయి పడింది.విశాఖ- 30వ సీఐఐ భాగస్వామ్య సదస్సు నుంచి రేమాండ్ ప్రాజెక్టులకు వర్చువల్ గా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు శంకుస్థాపన చేశారు. ఈ శంకుస్థాపన కార్యక్రమానికి హాజరైన రేమాండ్ గ్రూప్ మేనేజింగ్ డైరెక్టర్ గౌతమ్ మైనీ, ఆ సంస్థ కార్పోరేట్ డెవలప్మెంట్ హెడ్ జతిన్ ఖన్నారూ.1201 కోట్ల పెట్టుబడులతో రాష్ట్రంలో మూడు ప్రాజెక్టులు రేమాండ్ గ్రూప్ ఏర్పాటు చేయననుంది.సిల్వర్ స్పార్క్ అప్పారెల్, జేకే మైనీ గ్లోబల్ ఏరోస్పేస్ లిమిటెడ్, జేకే మైనీ గ్లోబల్ ప్రెసిషన్ లిమిటెడ్ యూనిట్లకు సీఎం చేతుల మీదుగా శంకుస్థాపన జరిగింది. రాప్తాడులో రూ.497 కోట్ల వ్యయంతో సిల్వర్ స్పార్క్ అప్పారెల్ మాన్యుఫాక్చరింగ్ పార్క్ ను ఏర్పాటు చేస్తున్నారు. అనంతపురం జిల్లా గుడిపల్లిలో రూ.441 కోట్లతో ఆటో కాంపోనెంట్ మాన్యుఫాక్చరింగ్ ప్లాంట్ ఏర్పాటు చేయనున్నారు. అనంతపురం జిల్లా టెకులోదు వద్ద రూ.262 కోట్లతో ఏరోస్పేస్ పరికరాల తయారీ యూనిట్ ఏర్పాటు చేయనున్నారు.మొత్తంగా రూ.1201 కోట్ల పెట్టుబడులతో మూడు వేర్వేరు పరిశ్రమల ఏర్పాటు ద్వారా 6500 మందికి ప్రత్యక్షంగా ఉద్యోగ అవకాశాలు కల్పించనుంది రేమాండ్ సంస్థ. ఈ మేరకు ప్రభుత్వంతో ఒప్పందం జరగడమే కాకుండా పనులకు శంకుస్థాపన కూడా చేసుకున్నారు.30వ సిఐఐ సదస్సు రెండో రోజు సీఎం చంద్రబాబుతో దేశ విదేశాలకు చెందిన ప్రతినిధులు ఎల్జీ కెమ్, అట్మాస్పియర్ కోర్, ఇఫ్కో, కార్డెలియా క్రూయిజెస్, సుమిటోమో మిత్సుయ్ బ్యాంకింగ్ కార్పొరేషన్ అధిపతులు, ప్రతినిధులతో భేటీ జరగనుంది. శ్రీసిటీలోని పలు ప్రాజెక్టులతో ఎంవోయూ కుదుర్చుకోనున్నారు. న్యూజిలాండ్, జపాన్, మెక్సికో దేశాల ప్రతినిధులతో సీఎం భేటీ అవుతారు. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు ఉన్న అవకాశాలు గురించి వాళ్లకు వివరిస్తారు. గ్రీన్ హైడ్రోజన్ వ్యాలీ, సస్టైనబుల్ సిటీస్, ఏపీ టూరిజం విజన్ సెషన్లలో సీఎం పాల్గొంటారు. ఆయా రంగాల్లో ప్రభుత్వం కల్పిస్తున్న ప్రోత్సాహకాలు గురించి తెలియజేస్తారు. సీఎం చంద్రబాబు సమక్షంలో కంపెనీలు పెద్ద ఎత్తున ఎంఓయూలు చేసుకోనున్నాయి.

# 75 ఎంఓయూల

## 7,14,780 కోట్ల పెట్టుబడులు,

## 5,42,361 ఉద్యోగాలు

విశాఖపట్టణం , నవంబర్ 15 భారతీయ పరిశ్రమల సమాఖ్య (అఎఎ)30వ భాగస్వామ్య సదస్సు 2025 రెండో రోజు మరింత ఉత్సాహంగా జరిగింది. తొలి రోజు తరహాలోనే ముఖ్యమంత్రి ఎన్. చంద్రబాబు నాయుడు సమక్షంలో రాష్ట్ర ప్రభుత్వం వివిధ జాతీయ, అంతర్జాతీయ సంస్థలతో 40 ఎంఓయూలు కుదుర్చుకుంది. ఈ ఒప్పందాల ద్వారా ?3,49,476 కోట్ల పెట్టుబడులు ఆకర్షించగా, 4,15,890 కొత్త ఉద్యోగాలు సృష్టించే అవకాశం ఏర్పడింది. సదస్సు ప్రారంభానికి ముందే గురువారం కూడా పలు ఎంవోయూలు చేసుకున్నారు. మొత్తం లో 75 ఎంఓయూల ద్వారా ?7,14,780 కోట్ల పెట్టుబడులు, 5,42,361 ఉద్యోగాలు వచ్చే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. ఈ సదస్సు ఆంధ్రప్రదేశ్‌ను గ్రీన్ ఎనర్జీ, మాన్యుఫాక్చరింగ్, ఎ, టూరిజం హబ్‌గా మార్చే మలుపుగా మారింది. వైస్ ప్రెసిడెంట్ సి.పి. రాధాకృష్ణన్, కేంద్ర మంత్రులు పీయూష్ గోయల్, కె. రామ్ మోహన్ నాయుడు, ఐటీ మంత్రి నారా లోకేష్ సహా పలువురు పారిశ్రామివేత్తలు పాల్గొన్నారు. రెన్యువబుల్ ఎనర్జీ, మాన్యుఫాక్చరింగ్, గ్రీన్ హైడ్రోజన్, మైనరల్స్, అగ్రిబిజినెస్, ఎ సెక్టార్లపై దృష్టి సారించాయి. రెండో రోజు మొత్తం పెట్టుబడులు రూ. 3,49,476 కోట్లు, ఇవి 4,15,890 ఉద్యోగాలు సృష్టిస్తాయని ప్రభుత్వం అంచనా. రెన్యూవబుల్ ఎనర్జీ రంగంలో రూ. 2.94 లక్షల కోట్ల పెట్టుబడులతో 69,800 ఉద్యోగాలు. ఔఖఅ గ్రీన్ హైడ్రోజన్ హబ్ , టైవాన్ కంపెనీలు అలియన్స్ గ్రూప్, ఈజూల్ ఇండియా ఏఎతో మాన్యుఫాక్చరింగ్ ప్రాజెక్టులతో ఒప్పందాలు జరిగాయి. కోరమండల్ ఇంటర్నేషనల్ విశాఖలో రూ. 2,000 కోట్లతో ఫెర్టిలైజర్ ఫ్యాక్టరీ, పెట్టనుంది. పోర్ట్స్, సెమెంట్, డేటా సెంటర్లు, అడ్వాన్స్‌డ్ మాన్యుఫాక్చరింగ్‌లో రూ 1 లక్ష కోట్ల అదనపు పెట్టుబడుల ఒప్పందాలు జరిగాయి. ఇవి కాకుండా, మంత్రి నారా లోకేష్ సహా వివిధ శాఖల మంత్రులు మరిన్ని ఒప్పందాలు కుదుర్చుకుంటున్నారు. లోకేష్ ఎ, డిజిటల్ ఎకానమీ సెషన్లలో పాల్గొని, విశాఖపట్నంను ఎ హబ్‌గా ప్రమోట్ చేస్తున్నారు. దిగ్గజాలు ఇన్వెస్టర్స్ సమ్మిట్ లో కీలక ప్రకటనలు చేశారు. అదానీ సంస్థ డేటా సెంటర్లు, ఓడరేవులు, సిమెంట్ ఉత్పత్తి తదితర రంగాల్లో పెట్టుబడులను ప్రకటించింది. బజాజ్ విజయవాడ, విశాఖ, రాజమండ్రి, శ్రీసిటీ, తిరుపతిలో స్కిల్ సెంటర్లు ఏర్పాటు చేస్తామని ప్రకటించింది. నౌకా నిర్మాణం, పర్యాటకం లాంటి రంగాల్లో పెట్టుబడులు పెట్టాలని భారత్ ఫోర్జ్ నిర్ణయించింది. రిలయెన్స్ ఇండస్ట్రీస్ ంఎ డేటా సెంటర్, సోలార్ పవర్ ప్లాంట్, గ్రీన్ ఫీల్డ్ ఇంటిగ్రేటెడ్ ఫుడ్ పార్క్ ఏర్పాటు చేసేందుకు ఒప్పందం కుదుర్చుకుంది. 1 ఉచి ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ డేటా సెంటర్ ఏర్పాటుతో ప్రపంచంలో అత్యంత అధునాతనమైన ఉఖజలు, ంఖజలు, ంఎ ప్రాసెసర్‌లను హోస్ట్ చేసేలా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ డేటా సెంటర్ ఏర్పాటు చేయనుంది. కర్నూలులో 170 ఎకరాల్లో గ్రీన్‌ఫీల్డ్ ఇంటిగ్రేటెడ్ ఫుడ్ పార్క్‌ను ప్రపంచ స్థాయి ఆటోమేటెడ్ సౌకర్యంతో నిర్మించనుంది. ప్రతిష్టాత్మక ప్రాజెక్టులైన డ్రోన్ సిటీ, స్పేస్ సిటీలకు వర్చువల్ శంకుస్థాపన చేశారు. కర్నూలు జిల్లా ఓర్వకల్లులో 300 ఎకరాల్లో డ్రోన్ సిటీని నిర్మించనున్నారు. అంతర్జాతీయ స్థాయిలో డ్రోన్ డిజైన్, తయారీ, సేవలు, ఆర్ అండ్ డీ రంగాల్లో అభివృద్ధి చెందేలా డ్రోన్ సిటీ నిర్మాణం జరగనుంది. దేశంలోనే తొలిసారిగా రాష్ట్రంలోని శ్రీ సత్యసాయి, తిరుపతి జిల్లాల్లో ట్విన్ స్పేస్ సిటీస్ ఏర్పాటు అవుతున్నాయి. స్పేస్ సిటీలో 10 ఏళ్లలో రూ.25,000 కోట్ల పెట్టుబడులు, 35,000కు పైగా ఉద్యోగాలు వస్తాయని అంచనా. స్పేస్ సిటీకి సంబంధించి బ్లూ స్పేస్, ఎథర్నల్ ఎక్స్‌ప్లోరేషన్ గిల్డ్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థలు రాష్ట్ర ప్రభుత్వంతో అవగాహనా ఒప్పందం చేసుకున్నాయి. అలాగే డ్రోన్ సిటీలో పెట్టుబడులకు అల్గోబోటిక్స్ ప్రైవేట్ లిమిటెడ్, అకిన్ అనలిటిక్స్ సొల్యూషన్ ప్రైవేట్ లిమిటెడ్, సెన్సెల్మేజ్, ఏర్వేస్ ఇండస్ట్రీస్ సంస్థలు ఎంఓయూ చేసుకున్నాయి.

## 2005 తర్వాత తమకు ఇవే అత్యుత్తమ ఫలితాలు అన్న చిరాగ్

పాట్నా , నవంబర్ 15 బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్డీయే అద్భుత విజయం సాధించిన నేపథ్యంలో కూటమిలోని లోక్ జనశక్తి పార్టీ (రామ్ విలాస్ పాశ్వాన్) అధినేత చిరాగ్ పాశ్వాన్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. నిన్న ఫలితాలు వెలువడిన నేపథ్యంలో ఈ రోజు ఆయన ముఖ్యమంత్రి నితీశ్ కుమార్‌తో సమావేశమయ్యారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ, 2020 నాటి అసెంబ్లీ ఎన్నికల ఫలితాలను చూసిన తర్వాత తన పని అయిపోయిందని చాలామంది అనుకున్నారని పేర్కొన్నారు.ఈ విజయం తనకు ఎంతో విలువైనదని ఆయన అన్నారు. ప్రభుత్వం ఏర్పాటు చేయనున్న నేపథ్యంలో తదుపరి చర్యలపై నితీశ్ కుమార్‌తో చర్చించినట్లు వెల్లడించారు. బీహార్‌లో చారిత్రాత్మక విజయం సాధించిన నేపథ్యంలో ఎమ్మెల్యేలతో కలిసి వెళ్లి ముఖ్యమంత్రిని అభినందించామని అన్నారు. ప్రభుత్వం ఏర్పాటు, అనుసరించాల్సిన వ్యూహాలపై చర్చించినట్లు వెల్లడించారు.2005లో తమ పార్టీ ఒంటరిగా పోటీ చేసి 29 స్థానాల్లో విజయం సాధించిందని, ఆ తర్వాత ఇవే తమకు అత్యుత్తమ ఫలితాలు అని అన్నారు. తమ కూటమిలో ఎల్‌జేపీ, జేడీయూ పాత్రపై ఎన్నికల సమయంలో ఎన్నో అసత్య ప్రచారాలు చేశారని గుర్తు చేశారు. అయినప్పటికీ తాము కలిసికట్టుగా ముందుకు సాగామని అన్నారు. 2025లో మాపై నమ్మకం ఉంచి ఎన్డీయే మాకు ఐదు ఎంపీ స్థానాలు కేటాయిస్తే విజయం సాధించామని, ఒక్క ఎమ్మెల్యే లేని మాకు 29 స్థానాలు కేటాయిస్తే 19 గెలుచుకున్నామని అన్నారు.

గెలవలేని స్థానాలను తమకు కావాలనే ఇచ్చారని జేడీయూపై విమర్శలు చేశారని, తద్వారా తమ మధ్య విబేధాలు సృష్టించే ప్రయత్నం చేశారని అన్నారు. కానీ ఈ ఫలితాలు ఆ ఆరోపణలను తిప్పికొట్టాయని అన్నారు. ఆర్జేడీ క్రమంగా తన ప్రాబల్యాన్ని కోల్పోతోందని చిరాగ్ పాశ్వాన్ అన్నారు. 90లలో నడిచిన జంగిల్ రాజ్‌ను ప్రజలు మరోసారి తిప్పికొట్టారని అన్నారు.



ఇన్సిట్యూట్ ఆఫ్ హోటల్ మేనేజ్మెంట్ శ్రీ శక్తి తన క్యాంపస్‌లో వార్షిక క్రిస్మస్ ప్లం కేక్ ఫ్రూట్ మిక్సింగ్ వేడుకను నిర్వహించింది, ఇది పండుగ సీజన్‌తో ముడిపడి ఉన్న గొప్ప సంస్కృతి మరియు సంప్రదాయాన్ని జరుపుకుంటుంది. ఈ సంవత్సరం వేడుకలో 5 నుండి 12 సంవత్సరాల వయస్సు గల పిల్లలు ఉత్సాహంగా పాల్గొనడాన్ని స్వాగతిస్తూ ప్రత్యేక ఆకర్షణను కలిగి ఉంది.
ఈ ఉత్సాహభరితమైన కార్యక్రమంలో శ్రావ్యమైన క్రిస్మస్ కరోల్స్ మరియు సంప్రదాయ చరిత్రపై విద్యార్థుల అంతర్దృష్టి ప్రదర్శన ఉన్నాయి. ఉత్సాహాన్ని పెంచుతూ, శాంతా క్లాజ్ ప్రత్యేకంగా కనిపించి, పిల్లలకు ఆశ్చర్యకరమైన వస్తువులను పంపిణీ చేశాడు. పిల్లల కోసం వినోదభరితమైన కార్యకలాపాల శ్రేణితో కార్యక్రమం ముగిసింది. ఈ సాంస్కృతికంగా గొప్ప వేడుక నిర్వహణ, సిబ్బంది మరియు విద్యార్థులు ఈ కార్యక్రమం అంతటా యువకులను చురుకుగా ప్రోత్సహించడం ద్వారా సాధ్యమైంది.

# 16 న జరిగే బీసీల న్యాయసాదన దీక్షను విజయవంతం చేయలి

## బీసీ జేఏసీ చైర్మన్ ఆర్ కృష్ణయ్య



**హైదరాబాద్ నవంబర్ 15 ప్రజాబలం ప్రతినిధి:** బీసీల న్యాయసాదన దీక్షను విజయవంతం చేయలని బీసీ జేఏసీ చైర్మన్ ఆర్ కృష్ణయ్య పిలుపునిచ్చారు. శనివారం కచిగుడలో మీడియా సమావేశం లో మాట్లడుతూ బీసీల న్యాయసాదన కోసం ఈ నెల 16 రాష్ట వ్యాప్తంగా అన్ని జిల్లా ,మండల కేంద్రాలలో బీసీల న్యాయసాదన దీక్షలు నిర్వహిస్తున్నట్లు తిలిపారు ఇందులో బాగంగా ఇందిరాపార్క్ వద్ద మహా ధర్నాను నిర్వహిస్తున్నతులు తెలిపారు. ఈ సందర్బంగా రాష్ట్ర ప్రభుత్వం అఖిలపక్షంతో ఢిల్లీ వెళ్లాలని డిమాండ్ చేసారు.లేని పక్షం లో బీసీ ఉద్యమన్నీ బలోపేతం చేస్తామని హెచ్చరించారు.జాతీయ బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యకుడు బీసీ జేఏసీ కో ఆర్డినేటర్ గుజ్జ సత్యం అధ్యక్షతన జరిగిన మీడియా సమావేశంలో ముఖ్యఅతిధిగా విచ్చేసిన రాజ్యసభ సభ్యులు బీసీ జీవిసి చైర్మన్ ఆర్ కృష్ణయ్య మాట్లాడారు. 77 సంవత్సరాల స్వాతంత్ర తర్వాత కూడా మెజారిటీ ప్రజలైన బీసీలకు న్యాయం జరగడం లేదు. రాజ్యాంగాన్ని 130 సార్లు సవరణ చేశారు. మెజారిటీ ప్రజలు 56% జనాభా గల బీసీల కోసం ఒక్కసారి కూడా రాజ్యాంగాన్ని సవరించలేకపోవడం దుర్మార్గం. ఇన్నాళ్లు బీసీలను నిర్లక్ష్యం చేశారు. అన్యాయం చేస్తున్నారన్న బీసీలు అనేక పోరాటాలు చేసి బీసీలను 42 శాతం సాధిస్తే కోర్టులలో కేసులు వేసి ఆపవేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్రంలో బీసీలకు స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయడం కోసం కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేలా రాష్ట్ర ప్రభుత్వం దర్యలు తీసుకోవాలని, రాష్ట్రంలోని అఖిలపక్షాల తరపున బీసీ సంఘాల ప్రజాసంఘాల తరపున ప్రధానమంత్ర నరేంద్ర మోడీ ని కలిసేలా చర్యలు తీసుకోవాలని అన్నారు.. ఈ మేరకు రాజ్యాంగ సవరణ చేసి, బీసీ రిజర్వేషన్లను భారత రాజ్యాంగంలోని తొమ్మిదేదో షెడ్యూల్ చేర్చాలని ఆయన కోరారు. ఈ సమావేశం లో నీలా వెంకటేష్ పగిల్ల సతీష్, అనంతయ్య, రాందేవ్, బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

# బీసీ సాధికారిత సంఘం బలోపేతంకై డిసెంబర్ 12 నుండి సభ్యత నమోదు ప్రారంభం.

మొదటి విడతలో లక్ష సభ్యత్వాల నమోదు లక్ష్యం.
సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ప్రతి ఒక్క బీసీ బిడ్డ భాగస్వాములు కావాలి.
బీసీ సాధికారిత రాష్ట్ర అధ్యక్షులు కొండ దేవయ్య.



**వేములవాడ టౌన్, (ప్రజాబలం),** బీసీ సాధికారిత సంఘం బలోపేతంకై, ఐక్యతకు, బీసీ హక్కుల సాధనకు, సమస్యలపై సమిష్టిగా పోరాడుటకు, బీసీలు రాజకీయంగా, ఆర్థికంగా, సామాజికంగా, విద్యాపరంగా, ఉపాధి, ఉద్యోగాలలో అన్ని రంగాలలో అభివృద్ధి చెందుటకు గాను జనాభా దామాషా ప్రకారం బీసీలకు రాజకీయంగా రావలసిన కోటాను, బడ్జెట్లో రావలసిన వాటాను సాధించుకొనుటకు గాను, ఐక్యంగా ఉండి, ఐక్యమత్యమే మహాబలం అని నిరూపించి బీసీ హక్కులను సంపూర్ణంగా, శాస్త్రీయంగా, చట్టబద్ధంగా, రాజ్యాంగబద్ధంగా సాధించుకొనుటకు గ్రామస్థాయి నుండి రాష్ట్రస్థాయి వరకు బీసీ సాధికారిత సంఘం పటిష్టవంతంకై డిసెంబర్ 12వ తేదీ నుండి తెలంగాణ రాష్ట్రంలో బీసీ సభ్యత్వ నమోదు కార్యక్రమం జరుగుతుందని, అట్టి సభ్యత నమోదు కార్యక్రమంలో వేములవాడ పుణ్యక్షేత్రం నుండి ప్రారంభమగునని కొండ దేవయ్య రాష్ట్ర బీసీ సాధికారిత సంఘం , పొలాస నరేందర్ ఉమ్మడి కరీంనగర్ జిల్లా బీసీ సాధికారిత సంఘం అధ్యక్షులు తెలిపారు.
మొదటి విడతలో రాష్ట్రంలో లక్ష సభ్యత్వాల నమోదుకై లక్ష్యం పెట్టుకున్నామని, సభ్యత్వ నమోదు కార్యక్రమంలో బీసీ సాధికారిత సంఘం సభ్యులు, నేతలు చురుకుగా పాల్గొని నిర్ణీత గడు లోపల సభ్యత్వాలను పూర్తిచేయాలని, అలాగే బీసీ హక్కుల సాధన కోసం జరుగుతున్న పోరాటాలలో బీసీ సాధికారిత సంఘ సభ్యులు, నేతలు చురుకుగా పాల్గొనాలని బీసీలను మన హక్కుల కోసం పోరాడకపోతే, పాలకవర్గాలు ఎప్పటికీ అధికారాన్ని బీసీలకు అప్పగించారని, మన బీసీ బిడ్డల భవిష్యత్తు కోసం, మన హక్కులను చట్టబద్ధంగా, శాస్త్రీయంగా సాధించుకోవడం కోసం బీసీ ఉద్యమాలు ఎవరు చేపట్టినను, మన వంతు బాధ్యతగా పాల్గొనాలని బీసీ నేతలు కొండ దేవయ్య, పొలాస నరేందర్ పిలుపునిచ్చారు.
బీసీ జనాభా దామాషా ప్రకారం రావలసిన హక్కులకై, న్యాయపోరాటం, రాజకీయ పోరాటం చేయకుంటే, రేపటి తరాలకు మనం అన్యాయం చేసిన వాళ్ళ మగుదుమని, బీసీ ఉద్యమాన్ని అనుగదొక్కాలని, మన స్వరాన్ని అణచివేయడానికి పన్నుతున్న బీసీ వ్యతిరేకుల కుట్రలను, కుతంత్రాలను పన్నుతుంటే, మౌనంగా ఉండకుండా ఎదిరించాల్సిన బాధ్యత మన పైన ఉన్నదని, బీసీ ఓట్లతో గెలుపొందిన నేతలు బీసీ రిజర్వేషన్లు అమలు చేయకుంటే, రాజీనామా చేయాలని డిమాండ్ చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని, కేంద్రంలో పెండింగ్లో ఉన్న బీసీ బిల్లులు పార్లమెంటులో చర్చకు ప్రవేశపెట్టాలని ముక్తకంఠంతో డిమాండ్ చేద్దామని, డీసీ బిల్లులు పార్లమెంటులో ప్రవేశపెడితే, బిల్లులకు మద్దతు ఇచ్చే మిత్రులు ఎవరు, వ్యతిరేకించే ద్రోహులు ఎవరో తెలుస్తుందని కొండా దేవయ్య, పొలాస నరేందర్ అన్నారు.
బీసీ సాధికారిత సంఘం సభ్యత్వ నమోదు పుస్తకాలు సిద్ధంగా ఉన్నాయని, డిసెంబర్ 12వ తేదీ నుండి సభ్యత్వ నమోదు కార్యక్రమం వేములవాడ పుణ్యక్షేత్రం ప్రారంభించబడునని కొండ దేవయ్య, పొలాస నరేందర్ పేర్కొన్నారు.

# బీసీలకు సంపూర్ణ న్యాయం చేసే పార్టీ కాంగ్రెస్ పార్టీ మాత్రమే

## న్యాయవాది కోవూరి సత్యనారాయణ గౌడ్



**హైదరాబాద్ నవంబర్ 15ప్రజాబలం ప్రతినిధి:** తెలంగాణ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జూబ్లీహిల్స్ ఎన్నికల ఫలితాల లో ఘనవిజయం సాధించిన బీసీ బిడ్డ నవీన్ యాదవ్ కు న్యాయవాది కోవూరి సత్యనారాయణ గౌడ్ హృదయపూర్వక అభినందలు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జూబ్లీహిల్స్ ఉప( బై )ఎన్నికల్లో బీసీలకు చట్టసభల్లో పంపించాలనే ఆకాంక్షతో తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థిగా నవీన్ యాదవ్ ను బరిలో దింపి జూబ్లీహిల్స్ ఓటర్ మహాశయులకు కాంగ్రెస్ పార్టీ ప్రాముఖ్యత గురించి తెలియజేసారన్నారు. కాంగ్రెస్ పార్టీ మంత్రులను, ఎమ్మెల్యేలను కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ ఆదేశాల మేరకు పనిచేసేలా కట్టుదిట్టంగా ఏర్పాటు చేసి నవీన్ యాదవ్ జూబ్లీహిల్స్ ఎమ్మెల్యేగా విజయం కైవసం చేసుకోవడం ఎంతో ఆనందదాయకం అని అన్నారు. ఈ కార్యక్రమంలో టిపిసిసి సీనియర్ నాయకులు ఇంచార్జ్ ఉపాధ్యక్షులు కుమార్ రావు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత దయానంద్ , కాంగ్రెస్ పార్టీ సేవాదళ్ మహిళ కార్యకర్తలు, సంగారెడ్డి బీసీ సంఘం నాయకులు జి శంకర్ గౌడ్, హ్యూమన్ రైట్స్ సదాశివపేట డైరెక్టర్ రుద్ర శ్రీనివాస్ మరియు కాంగ్రెస్ పార్టీ నాయకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# అనుమానస్పద లింకులు మెసేజ్ లు, వీడియో కాల్స్ బ్లాక్ చేయాలి

## వెంటనే ఆయా సైట్లు బ్లాక్ చేసి పోలీసులకు ఫిర్యాదు చేయాలి



**హైదరాబాద్ నవంబర్ 15ప్రజాబలం ప్రతినిధి::** డబ్బు పంపాలన్న మెసేజ్ లు ఎవరూ నమ్మవద్దు అని సిపి కమిషనర్ సజ్జనార్ తెలిపారు. అనుమానస్పద లింకులు మెసేజ్ లు, వీడియో కాల్స్ బ్లాక్ చేయాలని అన్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఆయా సైట్లు బ్లాక్ చేసి పోలీసులకు ఫిర్యాదు చేయాలని, తన పేరుతో నకిలీ ఫేస్ బుక్ ఖాతా సృష్టించారని సజ్జనార్ తెలియజేశారు. ఆపదలో ఉన్నానని.. డబ్బు పంపాలని మెసేజ్ లు పంపిస్తున్నారని మండిపడ్డారు. ఇప్పటికే ఒక స్నేహితుడు రూ. 20 వేలు పంపి మోసపోయారని అన్నారు. సైబర్ మోసాలపై 1930 లేదా https://cybercrime.gov.in% లో ఫిర్యాదు చేయాలని సిపి సజ్జనార్ సూచించారు.

# స్కాలర్షిప్పు ప్రభుత్వ బిక్ష కాదు విద్యార్థుల హక్కు ఏబివిపి



**హైదరాబాద్ నవంబర్ 15 ప్రజాబలం ప్రతినిధి:** అఖిల భారతీయ విద్యార్థి పరిషత్-సికింద్రాబాద్ జిల్లా, మారేడుపల్లి శాఖ ఆధ్వర్యంలో స్కాలర్షిప్ ఫీజు రియంబర్స్మెంట్ బకాయిలు చెల్లించాలని విదార్థులతో భారీ నిరసనలు జరిపారు. ఈ సందర్భంగా ఎబివిపి సికింద్రాబాద్ జిల్లా కన్వీనర్ చెర్క బాలు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అధికారం చేపట్టి రెండు సంవత్సరాలు పూర్తి కావస్తున్న గత 3 సంవత్సరాలుగా విద్యార్థులకు చెల్లించవలసిన స్కాలర్షిప్ ఫీజు రియంబర్స్మెంట్ బకాయిలు 8500 కోట్ల విడుదల చేయక విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటం ఆడుతోందని సకాలంలో స్కాలర్షిప్ ఫీజు రియంబర్స్మెంట్ విడుదల కాకపోవటం వలన ప్రైవేట్ కళాశాల యాజమాన్యాలు కళాశాలలను మూసుకునే దుస్థితి దాపురించిందని, ప్రైవేటు విద్యాసంస్థలతో పాటు ప్రభుత్వం విద్యాసంస్థలు కూడా విద్యార్థులకు సర్టిఫికెట్స్ జారీ చేయటం లేదని ఫలితంగా విద్యార్థులు ఉన్నత విద్య కొనసాగించటంలేదని , స్కాలర్షిప్ ఫీజు రియంబర్స్మెంట్ ప్రభుత్వ బిక్ష కాదని విద్యార్థుల హక్కు అని వెంటనే ప్రభుత్వం పెండింగ్లో ఉన్న 8500 కోట్ల స్కాలర్షిప్ ఫీజు రియంబర్స్మెంట్ బకాయిలను విడుదల చేయాలని లేని పక్షంలో ఎబివిపి ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వనికి వ్యతిరేకంగా విద్యార్థుల పక్షాన భారీ స్థాయి ఉద్యమాలు చేస్తుందని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్డి హైదరాబాద్ మహానగర కన్వినర్ పాండురంగ్,మారేడుపల్లి టౌన్ సెక్రటరీ కృష్ణ, వెంకట్, రామ్,శ్రీరామ్, రిషి, వినోద్, పవన్, తదితరులు విద్యార్థి నాయకులు పాల్గొన్నారు

# జూబ్లీహిల్స్ లో 51శాతం ఓట్లతో కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ ను గె లిపించినందుకు ధన్యవాదాలు

## డాక్టర్ లింగం యాదవ్... టీపీసీసీ అధికార ప్రతినిధి



జూబ్లీహిల్స్ లో 51శాతం ఓట్లతో కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ ను గె లిపించినందుకు ధన్యవాదాలు
మహేష్ కుమార్ గౌడ్, సీఎం రేవంత్ రెడ్డి జోడెద్దుల్లగా పని చేసి గెలిపించారు
నిత్యం అందుబాటులో ఉంటూ, చదువుకున్న యువకుడికి టికెట్ ఇస్తే బీజేపీ, brs తప్పుడు ప్రచారం చేశారు
బలహీన వర్గాని చెందిన వ్యక్తి కి టికెట్ ఇస్తే %ఎతీం%, బీజేపీ నాయకులు తప్పుడు ప్రచారం చేశారు
ఇప్పటికైన brs, బీజేపీ పార్టీలు బుద్ది తెచ్చుకోండి
కేటిఆర్ అధికారం కోల్పోయాక ఫ్రస్టేషన్ తో మాట్లాడుతుండు
ప్రతి పక్ష పార్టీగా ప్రభుత్వానికి మద్దతు ఇవ్వాలి
పదేండ్ల అధికారంలో ఉన్న కేటిఆర్ కు కనీస అవగాహన లేదా?తెలంగాణ రాష్ట్రాన్ని దేశంలోని అగ్రగామి గా తీర్చి దిద్దాడానికి సీఎం రేవంత్ రెడ్డి ప్రయత్నం చేస్తున్నాడుసీఎం రేవంత్ రెడ్డి విజన్ 2047 లక్ష్యంతో ముందుకు పోతుందురానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో,%స్త్రష్ట్రఎఫ% ఎన్నికల్లో 90 గెలవబోతుంది

# ఖమ్మం జిల్లా పెన్షనర్ల సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక



**ఖమ్మం ప్రతినిధి నవంబర్ 15 (ప్రజాబలం/** ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం జిల్లా శాఖ ఎన్నికలు ఉత్కంఠ భరితంగా శుక్రవారం రాత్రి ప్రజాస్వామిక పద్ధతిలో బ్యాలెట్ ద్వారా ఎన్నుకోవడం జరిగింది ఈ సందర్భంగా రాష్ట్ర ఎన్నికల అధికారిగా మైస నాగయ్య పరిశీలకులుగా ప్రహ్లాద రావు వ్యవహరించారు. జిల్లా అధ్యక్షులుగా మేదరమెట్ల సుబ్బయ్య ప్రధాన కార్యదర్శిగా తాళ్లూరి వేణు ఆర్థిక కార్యదర్శిగా రాయల వెంకటనారాయణ తోపాటు జిల్లా అసోసియేట్ అధ్యక్షులుగా వి చెంచిరెడ్డి ఉపాధ్యక్షులుగా సాధినేని పూర్ణచంద్రరావు పి సాంబశివరావు ఆర్ దుర్గా దేవి కార్యదర్శిగా టీ జనార్దన్ రావు ఎస్ లక్ష్మీపతిరావు జాయింట్ సెక్రటరీగా కాజా మొయినుద్దీన్ పి జానయ్య ఆర్గనైజింగ్ కార్యదర్శిగా బి ఉపేందర్ రావ్ డి రఘుపతి రెడ్డి ఎస్ సుగుణ రాజేంద్రన్ ప్రచార కార్యదర్శిగా బి కృష్ణారెడ్డి రాష్ట్ర కౌన్సిలర్ గా సి బాబురావు కె రామ్మోహన్రావు వద్ద శ్రీనివాసరావు అనంతరం జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఎం సుబ్బయ్య తాళ్లూరి వేణు మాట్లాడుతూ ప్రభుత్వం పెన్షనర్లకు ఇచ్చిన హామీ మేరకు రిటైర్డ్ ఉద్యోగుల ఆర్థిక ప్రయోజనాలను వెంటనే విడుదల చేయాలని





పెన్షనర్ల ఆరోగ్య కార్డులను అన్ని ఆసుపత్రులలో అమలయ్యే విధంగా ఒప్పందం మేరకు ఈ నెల 30లోగా ఉత్తర్వులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. పెండింగ్లోని కరువు భత్యం పి అర్ సి ప్రయోజనాలు తదితర దీర్ఘకాలిక పెండింగ్ సమస్యల పరిష్కారం కొరకు వెంటనే ప్రభుత్వం వెంటనే రిటైర్డ్ ఉద్యోగుల సంఘంతో సమావేశం ఏర్పాటు చేసి పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలని తెలిపారు. జిల్లా సంఘ కార్యవర్గ ఎన్నికలలో ఖమ్మం జిల్లాలోని సత్తుపల్లి తల్లాడ పెనుబల్లి వైరా ఏనుకూరు మధిర ఎర్రుపాలెం నేలకొండపల్లి కూసుమంచి ఖమ్మం నగరంలోని నాలుగు శాఖల బాధ్యులు ఈ ఎన్నికలలో పాల్గొన్నారు

# కమ్మ వనసమారాధనకు భారీ ఏర్పాట్లు



**ఖమ్మం ప్రతినిధి నవంబర్ 15 (ప్రజాబలం)** ఖమ్మంలో ఆదివారం జరగనున్న కార్తీక మాస కమ్మ వనసమారాధనకు భారీ ఎత్తున ఏర్పాట్లు పూర్తయ్యాయి ఈసారి కార్యక్రమం మరింత ఘనంగా సమగ్రంగా నిర్వహించేందుకు కమ్మ మహాజన సంఘం ప్రత్యేక ప్రణాళికతో ముందుకొచ్చింది వేదిక చుట్టుప్రక్కల 16 ఎకరాల్లో పూజా స్థలం శివాలయం సభవేదిక సాంస్కృతిక కార్యక్రమాల వేదికలు భోజనశాలలు, ఎన్టీఆర్ ఫోటో గ్యాలరీ, పిల్లలు%-%మహిళల కోసం ప్రత్యేక పోటీ ప్రాంగణాలు, కబడ్డీతో సహా పలు క్రీడల కోసం ప్రత్యేక మైదానాలు సిద్ధం చేశారు. వాహనాల రద్దీ దృష్ట్యా 45 ఎకరాల్లో పార్కింగ్ ఏర్పాట్లు చేశారు వైరా రోడ్ నుంచి వచ్చే వాహనాలకు గొల్లగూడెం%-%కొత్తగూడెం రోడ్ ద్వారా ప్రత్యేక ఎంట్రీ మార్గం కల్పించారు. తోట ఎదురుగా కుడి వైపు పార్క్ చేసిన వాహనాలకు అశ్విని (ఆదిత్య) నర్సింగ్ స్కూల్ వెనుక నుంచి ఆర్టీసీ కాలనీ, మధురానగర్%-%1 మీదుగా గొల్లగూడెం రోడ్కు ఎగ్జిట్ మార్గం ఏర్పాటు చేశారు. తోట ఎడమవైపు పార్కింగ్ చేసిన వాహనాలు బృందావనం వెంచర్%-%ఎడ్గా వైపు నుంచి గొల్లగూడెం రోడ్కు వెళ్లేలా మార్గాలు ఏర్పాటు చేశారు. త్రీటౌన్, వన్టౌన్ ప్రాంతాలనుంచి వచ్చే వాహనాలకు అల్లిపురం రోడ్, చిన్న తోట ప్రాంతాల్లో ప్రత్యేక పార్కింగ్ కల్పించారు ఈ వనసమారాధనలో భక్తి కార్యక్రమాలు, దేవతారాధనలు, పిల్లల గేమ్స్, మహిళల పోటీలు, వంటల పోటీలు, ఫ్యాన్సీ డ్రస్, సాంస్కృతిక ప్రదర్శనలు, తెలుగు సంప్రదాయ కళలను ప్రతిబింబించే వినోద కార్యక్రమాలు ప్రధాన ఆకర్షణగా నిలవనున్నాయి. అదనంగా, సినీ కళాకారుల సంగీత విభావరి, కబడ్డీతో సహా పలు క్రీడా పోటీలు కూడా నిర్వహించనున్నారు. సమాజంలో ఏకతా భావం, బంధుత్వం, పరస్పర అవగాహన పెంపొందించే వేదికగా కమ్మ వనసమారాధన రూపుదిద్దుకుంటోంది. కుటుంబ సమేతంగా పెద్ద సంఖ్యలో సభ్యులు, యువత, మహిళలు పాల్గొనే అవకాశం ఉంది ఈ మహోత్సవానికి రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రాజ్యసభ సభ్యురాలు గారపాటి రేణుకా చౌదరి, ఎమ్మెల్సీ తాత మధు, మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్, మాజీ ఎంపీ నామా నాగేశ్వరరావు, మేయర్ పునుకుల్ల నీరజ, వివిధ సంస్థల చైర్మన్లు, జిల్లా నాయకులు తదితరులు హాజరుకానున్నారు. కార్తీకమాస ఆధ్యాత్మికత, తెలుగు సంస్కృతి సారాన్ని ప్రతిబింబించేలా ఈ వనసమారాధన ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించేందుకు సంఘం ఏర్పాట్లు పూర్తి చేసింది అని తెలిపారు

## భీమేశ్వర ఆలయంలో భక్తుల రద్దీ, అధికారుల పర్యవేక్షణ.



**వేములవాడ టౌన్, (ప్రజాబలం),** ప్రముఖ శైవ క్షేత్రం వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానానికి అనుబంధ దేవాలయమైన శ్రీ భీమేశ్వర స్వామి ఆలయంలో కార్తీకమాసం ముగుస్తున్న సందర్భంగా శుక్రవారం రోజున రాజన్న భక్తులు భారీగా తరలివచ్చారు. భక్తుల రద్దీ విపరీతంగా పెరగడంతో భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ అధికారులు పలు చర్యలు చేపట్టారు.

రాజన్న ఆలయ ఈవో రమాదేవి, వేములవాడ పట్టణ సర్కిల్ ఇన్స్పెక్టర్ వీరప్రసాద్ కలిసి ఆలయ పరిసర ప్రాంతాలను క్షేత్రస్థాయిలో ప్రత్యక్షంగా పర్యవేక్షించారు. కోడె మొక్కులు, క్యూలైన్లు, ఉచిత దర్శనం, 300/బిరూపాయల ప్రత్యేక దర్శనం, లడ్డు ప్రసాదాల కౌంటర్, ప్రోటోకాల్ ఆఫీస్ వంటి ముఖ్యమైన ప్రాంతాలలో భక్తులకు తగిన ఏర్పాట్లు సక్రమంగా ఉన్నాయా అనే విషయమై అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపారు.

ఈ పర్యవేక్షణ కార్యక్రమంలో వేములవాడ పట్టణ ఎస్ఐ ఎల్లా గౌడ్, వేములవాడ రాజన్న ఆలయ డి ఈ రఘునందన్, ఏ ఈ ఓ శ్రావణ్ కుమార్, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

## పరస్పర రాజీ తోనే సత్వర న్యాయం
## హై కోర్ట్ న్యాయ సేవల కమిటీ చైర్మన్ : జస్టిస్ కె. లక్ష్మణ్




**మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ప్రతినిధి ప్రజాబలం నవంబర్ 15:**జిల్లా న్యాయ సేవల అథారిటీ మేడ్చల్ - మల్కాజిగిరి జిల్లా వారి ఆధ్వర్యంలో తేది: 15-11-2025 శనివారం రోజున ఉదయం జిల్లా న్యాయస్థానాల భవన సముదాయం, కుషాయిగూడ లో ప్రత్యేక లోక్ అదాలత్ (ప్రజా న్యాయస్థానం) కార్యక్రమం నిర్వహింపబడింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథి గా హై కోర్ట్ న్యాయ సేవల కమిటీ చైర్మన్ %ఒ% మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అడ్మినిస్ట్రేటివ్ జడ్జ్ జస్టిస్ కె. లక్ష్మణ్ హాజరయినారు. ఈ సందర్భంగా జస్టిస్ లక్ష్మణ్ మాట్లాడుతూ 1977 నుండి అపరిష్కృతంగా వున్న కుటుంబ తగాదా కు సంబంధించిన కేసు లోక్ అదాలత్ తోనే పరిష్కారం అయ్యి నా చేతుల మీదుగా జడ్జిమెంట్ అవార్డు అందించడం సంతోషాన్నిచ్చింది అన్నారు. ప్రత్యేక ప్రజా న్యాయస్థానం (లోక్ అదాలత్) లో పరస్పర రాజీ తో కక్షి దారులకు సత్వర న్యాయం జరగడం వల్ల మానసిక ఒత్తిడి తగ్గుతుందన్నారు. జ్యుడిషరీ విభాగంలో అధునాతన నవీకరణ లో భాగంగా వచ్చిన ఈ - కోర్ట్ లు, లైవ్ స్ట్రిమింగ్స్, 18 భాషల్లో తీర్పులను వెబ్ సైట్ లలో అప్లోడ్ చేయడం శుభపరిణామమని తెలిపినారు.

ఈ కార్యక్రమంలో మేడ్చల్ - మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ మను చౌదరి మాట్లాడుతూ ఇరు వర్గాల వారు రాజీ కుదుర్చుకోవటం వలన ఖర్చు లేకుండా సమస్యకు పరిష్కారం తో ఉపశమనం పొందవచ్చని, లోక్ అదాలత్ ద్వారా కక్షి దారులు సమస్యలు నేరుగా చెప్పుకుని అర్థవంతమైన, నిష్పక్షపాతమైన ఉచిత న్యాయ సేవలు త్వరితగతిన పొందవచ్చని, ఆర్థికంగా బలహీనంగా వున్నవర్గాలు ఇట్టి మెరుగైన సేవలు ఉపయోగించుకోవాలని తెలిపినారు.

ఇందులో ప్రిన్సిపుల్ సెషన్ జడ్జ్ శ్రీదేవి, జడ్జిలు, డీసీపీ లు పద్మజారెడ్డి, సుధీర్ బాబులు, న్యాయవాదులు, కక్షిదారులు ఇతరులు పాల్గొన్నారు.

# సైడ్ డ్రైనేజీ పనులు దగ్గరుండి పర్యవేక్షించిన కార్పొరేటర్ చామకూరి వెంకటనారాయణ



**ఖమ్మం ప్రతినిధి నవంబర్ 15 (ప్రజాబలం)** ఖమ్మం కార్పొరేషన్ పరిధిలో గల 19వ డివిజన్ లోని రోడ్ నెంబర్ 9 నుండి రోడ్ నెంబర్ 13 వరకు సైడ్ డ్రైనేజీ సమస్య ఉంటే అక్కడ ఉన్న పబ్లిక్ తో సమస్యను పరిష్కరించి 19వ డివిజన్ కాంగ్రెస్ పార్టీ కార్పొరేటర్ చామకూరి వెంకట నారాయణ గారు దగ్గర ఉండి సమస్యను పరిష్కరించడం జరిగినది. ఈ కార్యక్రమంలో ఏ ఈ. యాకుబ్ నాయక్, వర్క్ ఇన్స్పెక్టర్ శ్యామ్, కాంట్రాక్టర్ పాలకుర్తి కృష్ణ, పాషా, నర్సిరెడ్డి, భాస్కర్, బాల, శివరాం, శ్యామల, రాజు, వరికోటి భాస్కర్, విజయలక్ష్మి, కన్నెబోయిన ముత్తయ్య మరియు తదితరులు పాల్గొన్నారు

## మాంట్ ఫోర్ట్ హై స్కూల్ లో ఘనంగా సైన్స్ ఎక్స్పో వేడుక




**ఖమ్మం నవంబర్ 15 (ప్రజాబలం బ్యూరో)** స్థానిక గుట్టల బజార్ ఏరియా లోని మాంట్ ఫోర్ట్ హై స్కూల్ లో నిర్వహించిన సైన్స్ ఎక్స్పో %-% 2025 కార్యక్రమం అద్భుతంగా జరిగింది . విద్యార్థుల తల్లిదండ్రులు పాఠశాలను సందర్శించి విద్యార్థులు చేసిన సైన్స్ ప్రాజెక్ట్స్ ప్రత్యక్షంగా చూసి వారి యొక్క ప్రతిభను అభినందించారు . వివిధ తరగతుల విద్యార్థులు శాస్త్రీయ సూత్రాలను ఆధారంగా చేసుకుని మోడల్స్ , ప్రయోగాలు , ప్రాజెక్టులను సృజనాత్మకంగా ప్రదర్శించారు . తల్లిదండ్రులు విద్యార్థుల ఆలోచనా దక్షత , సైన్స్ పట్ల ఆసక్తి , తయారు చేసిన నమూనాల వినూత్నతను ప్రశంసించారు . పాఠశాల ప్రిన్సిపాల్ బ్రదర్ జాన్ పాల్ మాట్లాడుతూ "ఇలాంటి కార్యక్రమాలు పిల్లల్లో పరిశోధనా దృక్పథాన్ని పెంపొందిస్తాయి అని అన్నారు . తల్లిదండ్రుల భాగస్వామ్యం వారి ఉత్సాహాన్ని మరింత పెంచుతుంది" అని తెలిపారు . కార్యక్రమాన్ని విజయవంతం చేసిన ఉపాధ్యాయులకు , పాల్గొన్న విద్యార్థులకు స్కూల్ యాజమాన్యం వారి అభినందనలు తెలిపారు . ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ జోష్ ఉపాధ్యాయుని , ఉపాధ్యాయులు , విద్యార్థినీ , విద్యార్థులు మరియు పేరెంట్స్ పాల్గొన్నారు



## వేములవాడ రూరల్ బిజెపి పార్టీ బూత్ అధ్యక్షుల సమావేశం.



**వేములవాడ టౌన్, (ప్రజాబలం),** శనివారం రోజున భారతీయ జనతా పార్టీ వేములవాడ రూరల్ మండల అధ్యక్షులు బూరుగుపల్లి పరమేష్ ఆధ్వర్యంలో మండలంలోని బూత్ అధ్యక్షుల సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా జిల్లా కార్యదర్శి గోపాటి సురేందర్రావు, జిల్లా కౌన్సిల్ నెంబర్ పోంచెట్టి రాకేష్ హాజరయ్యారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఈనెల 19వ తేదీన భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో హుజురాబాద్ లో నిర్వహించే ఆత్మీయ సమ్మేళనానికి వేములవాడ రూరల్ మండలంలోని జిల్లా మరియు మండల పదాధికారులు, శక్తి కేంద్రం ప్రముక్, ప్రబారీలు, అన్ని గ్రామాల అధ్యక్షులు, ముఖ్య నాయకులు హాజరు కావాల్సిందిగా ఆదేశించడం జరిగింది. అదేవిధంగా నవంబర్ 18వ తేదీన సర్దార్ వల్లభాయ్ పటేల్ 15వ జయంతి సందర్భంగా రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో నిర్వహిస్తున్న ర్యాలీలో పాల్గొనాలని ఈ యొక్క ర్యాలీకి కేంద్ర హెూం శాఖ సహాయ మంత్రి, కరీంనగర్ పార్లమెంటు సభ్యుడు బండి సంజయ్ కుమార్ ముఖ్యఅతిథిగా వస్తున్నందున ప్రతి కార్యకర్త తప్పనిసరిగా హాజరు కావాలని తెలపడం జరిగింది.

ఈ కార్యక్రమంలో మండల అధికార ప్రతినిధి సుంకరి నరేందర్, ప్రధాన కార్యదర్శులు తోట శేఖర్, వనపర్తి పరశురాములు, ఉపాధ్యక్షులు గుంటి వంశీకృష్ణ, లింగంపల్లి కుంటయ్య, శక్తి కేంద్రం ప్రముఖ ఉప్పుల గౌతం, భూత్ అధ్యక్షులు కల్లెడ నరేష్, లింగంపల్లి రాజు, నల్ల వెంకట్రెడ్డి, మారం కరుణాకర్ రెడ్డి, కటారి తిరుపతి, జంగం నరేష్, రోడ్ల మహేష్, సామోజి గౌతమ్ తదితరులు పాల్గొన్నారు.

## గ్రంథాలయాలు ఆధునిక దేవాలయాలు

### టీజీఈ జేఏసీ రాష్ట్ర కార్యదర్శి ఏలూరు శ్రీనివాసరావు





**ఖమ్మం నవంబర్ 15 (ప్రజాబలం బ్యూరో)** గ్రంథాలయాల ఆధునిక దేవాలయాలని పుస్తక పఠనంతో జ్ఞానభివృద్ధి సాధ్యమని తెలంగాణ ఉద్యోగుల సంఘం జేఏసీ ఏలూరు శ్రీనివాసరావు అన్నారు . జిల్లా కేంద్ర గ్రంథాలయంలో గ్రంథాలయ వారోత్సవాలలో పాల్గొని ఆయన మాట్లాడుతూ గ్రంథాలయాలు విజ్ఞాన బాండగారాలని నిరుద్యోగులు ఎంతోమంది గ్రంథాలయంలో చదువుకొని ఉద్యోగాలు సాధించారని అన్నారు . గ్రంథాలయ వారోత్సవాలు సందర్భంగా రెండోవ రోజు పుస్తక ప్రదర్శన పోటీలు నిర్వహించారు . ఈ కార్యక్రమంలో టీఎన్జీవోఎస్ జిల్లా అధ్యక్షులు గుంటుపల్లి శ్రీనివాసరావు రాష్ట్ర కమిటీ కార్యదర్శి జైపాల్ జిల్లా గ్రంథాలయ సంస్థ జిల్లా గ్రంథాలయ ఉద్యోగుల సంఘం అధ్యక్షులు కెవిఎస్-ఎల్ ఎన్ రాజు సెక్రటరీ ఇమామ్ గ్రంథాలయ ఉద్యోగులు జె భాస్కరరావు లలిత కుమారి సిహెచ్ శ్రీనివాస్ భూక్యా బాబు కే రవిబాబు తదితరులు పాల్గొన్నారు

## వృద్ధులు భవిష్యత్ తరాలకు మార్గదర్శకులు

### జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్







**ప్రజాబలం మంచిర్యాల జిల్లా ప్రతినిధి నవంబర్ 15** : వృద్ధులు భవిష్యత్తు తరాలకు మార్గదర్శకులని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవం పురస్కరించుకొని శనివారం జిల్లా కేంద్రంలోని ఐ.బి. చౌరస్తా నుండి జిల్లా సంక్షేమ శాఖ అధికారి రౌఫ్ ఖాన్, జిల్లా విద్యాధికారి యాదయ్య, మంచిర్యాల ఎ.సి.పి. ప్రకాష్,అధికారులు, వృద్ధులతో కలిసి వాకథాన్ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... వృద్ధులు తమ జీవితంలో ఎదురైన సవాళ్లను అధిగమించి ఎంతో అనుభవంతో తమ పిల్లలకు భవిష్యత్తు మార్గదర్శకాలను సూచిస్తారని తెలిపారు. వృద్ధుల సంక్షేమం కోసం ప్రభుత్వం అనేక చర్యలు చేపడుతుందని,వయో వృద్ధులు హక్కులు, చట్టంపై అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. వృద్ధులు తమ యవ్వనంలో చేసిన అభివృద్ధి ఫలాలను మనం అనుభవిస్తున్నామని తెలిపారు. ఈ నెల 21వ తేదీన పోలీస్, సంక్షేమ శాఖల సమన్వయంతో వయోవృద్ధులకు వారి హక్కులు, చట్టంపై అవగాహన కార్యక్రమం నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నామని, వయోవృద్ధులకు పోలీస్ శాఖ నుండి చట్టం ప్రకారం సంక్షేమ శాఖ పరిధిలో సహాయం చేసేందుకు ముందుంటామని తెలిపారు. తల్లిదండ్రులు తమ పిల్లలకు ఆస్తులు, ఉద్యోగాలు ఇప్పించి తర్వాత వారి నిరాదరణతో పోషణ కష్టంగా మారే పరిస్థితులు వస్తున్నాయని, వయోవృద్ధుల చట్టం ప్రకారం పోషణ తమ హక్కు అని తెలుసుకునే విధంగా వృద్ధులకు అవగాహన కల్పించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## మహాత్మా గాంధీ ఆశయ సాధనకు యువత ముందుకు రావాలి

### ఖమ్మం పార్లమెంట్ సభ్యులు రామ సహాయం రఘురాం రెడ్డి

### స్వదేశీ వస్తు వినియోగం తోటే దేశ అభివృద్ధి తుమ్మల యుగేందర్









**ఖమ్మం నవంబర్ 15 (ప్రజాబలం బ్యూరో)** స్థానిక భక్త రామదాస్ కళాక్షేత్రంలో గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ మరియు యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిర్వహించిన వందేమాతరం 150 కార్యక్రమంలో ఖమ్మం పార్లమెంట్ సభ్యులు రామ సహాయం రఘురాం రెడ్డి , కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు తుమ్మల యుగేందర్ పాల్గొన్నారు . రాష్ట్ర యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి యడ్లపల్లి సంతోష్ మరియు గ్లోబల్ ఫ్యామిలీ అధ్యక్షుడు సంజయ్ రెడ్డి ల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో మహాత్మా గాంధీ 1156 విగ్రహాల ప్రదర్శన మరియు 156 చరకాల ప్రదర్శన నిర్వహించి , ఖమ్మం జిల్లా కళాశాలలో నిర్వహించిన వ్యాసరచన పోటీ విజేతలను సత్కరించారు . అలాగే భారతదేశ స్వతంత్రం మరియు వందేమాతర గీతం విశిష్టతను తదితర అంశాలపై సమావేశం నిర్వహించారు ఈ కార్యక్రమంలో పాల్గొన్న పార్లమెంట్ సభ్యులు రామసయం రఘురాం రెడ్డి మాట్లాడుతూ నేటి యువకులే రేపటి పౌరులు భారతదేశానికి అతి శక్తివంతమైన యువశక్తి ఉందని అన్నారు . యువత సరైన మార్గంలో మహాత్మా గాంధీ సూచించిన విధంగా సత్యం న్యాయం ధర్మం పాటిస్తూ చెడు అలవాట్లకు బానిసలు కాకుండా దేశ అభివృద్ధికి దోహదపడాలని యువతకు పిలుపునిచ్చారు

ఈ కార్యక్రమంలో పాల్గొన్న తుమ్మల యుగంధర్ మాట్లాడుతూ మహాత్మా గాంధీ తన అభిప్రాయంలో ఈ దేశం నుండి బ్రిటిష్ వాళ్ళని పారితోలితే మనకు స్వతంత్రం వచ్చినట్టు కాదు వారు మనకి అలవర్చినటువంటి బ్రిటిష్ సంస్కృతిని ప్రారంభోలినాడే అసలైన భారత దేశ స్వతంత్రం వచ్చిందని తెలిపినట్టుగానే నేడు మహాత్మా గాంధీ స్ఫూర్తితో ప్రతి ఒక్కరూ స్వదేశీ వస్తు వినియోగించాలని పిలుపునిచ్చారు అలాగే దేశ యువత నేడు పాశ్చాత్త కల్చర్ లో మగ్గుతూ మత్తుకు బానిస అవుతుందని అటువంటి చెడు అలవాట్లకి దూరంగా ఉంటూ దేశ అభివృద్ధికి సంస్కృతి సంప్రదాయాలకు పీఠం వేయాలని యువతకు పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో వైరా నియోజకవర్గ నాయకురాలు విజయబాయి మహిళా సభ్యురాలు శ్రీ లక్ష్మీ గాంధీ సంస్థల చైర్మన్ దున్న రాజేందర్ రెడ్డి వైస్ చైర్మన్ యానాల ప్రభాకర్ రెడ్డి రాష్ట్ర కన్వీనర్ గాంధారి ప్రభాకర్ , ఆర్గనైజేషన్ సెక్రటరీ మెరుగు మధు , ఖమ్మం జిల్లా యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి క్రాంతి కుమార్ , పాలేరు యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు బానోత్ కిరణ్ కుమార్ , వైరా యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు గరిడేపల్లి కిషోర్ , సత్తుపల్లి యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు పసుమర్తి విశ్వనాథ్ , యూత్ కాంగ్రెస్ సీనియర్ నాయకులు షేక్ అప్సర్ , స్టేట్ సెక్రటరీ మదన్మోహన్ , ప్రచారం కమిటీ చైర్మన్ మాజిద్ ఖాన్ , గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ మహిళా అధ్యక్షురాలు బొమ్మ ప్రవళిక ఉపాధ్యక్షులు వెరమా రెడ్డి సంతోష్ రెడ్డి అడ్వైజర్ దయాకర్ రెడ్డి , అనిపర్తి శ్రీకాంత్ రాజ్ కుమార్ , షేక్ ఖలీల్ , మోత్కూరు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు

## అభివృద్ధికే పట్టం కట్టిన జూబ్లీహిల్స్ ప్రజలు

## అసత్య ప్రచారాలకు లొంగని జూబ్లీహిల్స్ ఓటర్



**అందోల్ నియోజకవర్గం ప్రతినిధి నవంబర్ 15 (ప్రజాబలం )సంగారెడ్డి జిల్లా :** జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్, భారీ మెజారిటీతో గెలుపొందిన సందర్భంగా, టేక్మాల్ లో కాంగ్రెస్ నాయకులు సంబరాలు జరుపుకున్నారు, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నిమ్మ రమేష్,ఆధ్వర్యంలో, టేక్మాల్ మండల కేంద్రంలో, విజయోత్సవ సంబరాలు ఘనంగా నిర్వహించారు, బాణసంచా కాల్చి,స్వీట్లు పంచి, విజయోత్సవ సంబరాలు నిర్వహించారు, ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, జూబ్లీహిల్స్ ప్రజలు, బిఆర్ఎస్ పార్టీ నాయకులు ఎన్నికల ప్రచారంలో, కాంగ్రెస్ పార్టీపై చేసిన అసత్య ప్రచారాలను, ప్రజలు నమ్మలేరని అన్నారు, ఆయా పార్టీలు కాంగ్రెస్ పార్టీని చాలా రకాలుగా దెబ్బతీయాలని ప్రయత్నించిన, ప్రజలు రాష్ట్రంలో ప్రభుత్వం చేస్తున్న, అభివృద్ధి పనులకు, సీఎం రేవంత్ రెడ్డి పాలనను మెచ్చి,ప్రజలు ఈ గెలుపును, అందించారాని, ఆనందం వ్యక్తం చేశారు, ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నిమ్మ రమేష్, మెదక్ రవాణా శాఖ సభ్యులు మల్లారెడ్డి, జోగిపేట, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సత్యనారాయణ, మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు సంగమేశ్వర్ గౌడ్, మైనార్టీ సెల్ అధ్యక్షుడు షేక్ మజార్, ఎస్టీ సెల్ అధ్యక్షుడు సేవాలాల్, సొసైటీ డైరెక్టర్ ఆకులపల్లి పాపయ్య, సత్యనారాయణ, మండల సీనియర్ నాయకులు విష్ణువర్ధన్ రెడ్డి, పట్టణ అధ్యక్షుడు భక్తుల కిషోర్, రాజు గౌడ్, నరసింహారెడ్డి, యాదవ్ గౌడ్, సక్రు నాయక్, చల్ల అనిల్, శ్రీధర్ చారి, అవినాష్, సుబ్బారావు, తుకారం గౌడ్, ఖలీల్, లక్ష్మీనారాయణ, యువజన కాంగ్రెస్ మండల ప్రధాన కార్యదర్శి సిద్దు, మండల యువజన కాంగ్రెస్ నాయకులు, సాయ గౌడ్, వెంకట్ గౌడ్, సాయి శేషు గౌడ్, శ్రీకాంత్, కార్యకర్తలు తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు......



## సంగారెడ్డిలో 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు



**సంగారెడ్డి జిల్లా ప్రతినిధి నవంబర్ 15(ప్రజాబలం)సంగారెడ్డి జిల్లా:**సంగారెడ్డి/జిల్లా గ్రంథాలయ సంస్థ, సంగారెడ్డి యందు 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు శనివారం నాడు జిల్లా గ్రంథాలయ సంస్థ, అధ్యక్షులు మరియు కార్యదర్శి అధ్వర్యంలో బాలల దినోత్సవం సందర్భంగా పుస్తక ప్రదర్శన ఏర్పాటు చేయడం జరిగింది. ముఖ్య అతిదిగా రిటైర్డ్ ఉద్యోగుల సంఘం మాజీ అధ్యక్షుడు అంజయ్య హాజరయ్యారు. వారు మాట్లాడుతూ గ్రంథాలయాలలో పూర్వము నుండి నేటి వరకు పుస్తకాల ప్రాముఖ్యత, లభ్యత, ఉపయోగం, పఠన ఆసక్తి, ఒక పుస్తకానికి ఉండే ప్రాధాన్యత గురించి సమీక్ష వంటి అంశాలను వ్యక్త పరచడం జరిగింది,పుస్తక ప్రదర్శనలో బహు భాషా పుస్తకాలు అనగా తెలుగు,ఆంగ్లం, ఉర్దూ,హిందీ, తో పాటు దాతలు బహుకరించిన పోటీ పరీక్షల, సాహిత్యం,ఆయుర్వేదం,న్యాయ సంబందిత పుస్తకాలు ఉంచబడినవి వాటిని గ్రంథాలయ అధ్యక్షులు,పాఠకులు,సాహితీ మూర్తులు మరియు పాఠశాల బాల బాలికలు తిలకించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ పాఠకులు అధిక సంఖ్యలో పాల్గోన్నారు మరియు గ్రంథాలయ సిబ్బంది శ్రీనివాస్, ప్రశాంత్, శోబారాణి, వరలక్ష్మీ, సావిత్రి, కృష్ణమూర్తి, నాగరాజు, తదితరులు హాజరయ్యారు.

## జోగిపేటలో కాంగ్రెస్ శ్రేణులు విజయోత్సవ సంబరాలు

### రేవంత్ రెడ్డి నాయకత్వాన్ని ప్రజలు స్వాగతించారు

### జోగిపేట మాజీ కౌన్సిలర్ చిట్టిబాబు



**అందోల్ నియోజకవర్గం ప్రతినిధి నవంబర్ 15 (ప్రజాబలం )సంగారెడ్డి జిల్లా:** జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల ఫలితాలలో, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్, 25 వేల మెజారిటీతో గెలుపొందడం పట్ల, జోగిపేటలో కాంగ్రెస్ పార్టీ శ్రేణులు, సంబరాలు జరుపుకున్నారు, పట్టణంలోని ప్రధాన రహదారి పైన, కాంగ్రెస్ శ్రేణులు ర్యాలీ నిర్వహించి, టపాసులు కాల్చి, మిఠాయిలు పంచి సంబరాలు జరుపుకున్నారు, ఇది రేవంతన్న పాలనకు, జూబ్లీహిల్స్ ప్రజలు ఇచ్చిన, సరైన పని తీరు అని, పట్టణ మాజీ కౌన్సిలర్ చిట్టిబాబు, సంతోషం వ్యక్తం చేశారు, ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ చిట్టిబాబు, మాజీ కౌన్సిలర్ కోరబోయిన నాని, మాజీ కౌన్సిలర్ దుర్గేష్, మాజీ కౌన్సిలర్ శరత్ బాబు, సత్యం,పిట్ల లక్ష్మణ్, ఆత్మ కమిటీ డైరెక్టర్లు, చిట్యాల మధు, తుడుం యాదయ్య, నాయకులు డాకూరి శ్రీనివాస్, చింతకుంట శివ, గుర్రపు కృష్ణ, కోషికే రాజశేఖర్, బేగరి అనిల్,ఆకుల నందు, కుమ్మరి భాస్కర్, మైనార్టీ నాయకులు గోహేర్ అలీ, అబ్బాస్ అలి, జిషాన్, చోటు ఖాన్, అడ్డు,నజీర్, తదితరులు పాల్గొన్నారు.....



# రైతులు లబ్ధి పొందే విధంగా పంట సాగు చేయాలి

## జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్





**ప్రజాబలం మంచిర్యాల నియోజకవర్గ రిపోర్టర్ నవంబర్ 15 :** జిల్లాలోని రైతులు లబ్ధి పొందే విధంగా పంట సాగు చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు.శనివారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భావన సమావేశం మందిరంలో జిల్లా వ్యవసాయ అధికారి సురేఖ తో కలిసి మండల వ్యవసాయ అధికారులు, వ్యవసాయ విస్తరణ అధికారులతో యాసంగి 2025-26 సీజన్ సిద్దత,వ్యవసాయ కార్యకలాపాలు,పంట సాగు,కొనుగోలు వ్యవస్థలపై ప్రాథమిక చర్యలు, మార్గదర్శకాలు అంశాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... రాబోయే యాసంగి కాలంలో లబ్ధి పొందే విధంగా రైతులు పంట సాగు చేయాలని,ఆ దిశగా అధికారులు రైతులకు అవసరమైన మెలకువలు, సలహాలు అందించాలని తెలిపారు.జిల్లాలో వచ్చే యాసంగి సీజన్లో సుమారు 1 లక్ష 43 వేల ఎకరాలలో పంటలు సాగు జరిగే అవకాశం ఉందని,ఈ నేపథ్యంలో అధికారులు తమ పరిధిలో అవసరమైన ప్రణాళికలను సిద్ధం చేయాలని తెలిపారు. మండలాల వారీగా ఎరువులు,యూరియా నిల్వలను సమీక్షించి రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా సరఫరా వుండేలా చర్యలు తీసుకోవాలని, పంట ఉత్పత్తి విధానాలు,ఆధునిక సాంకేతిక పద్ధతులు, రాష్ట్ర ప్రభుత్వ పథకాలు,రాయితీలు, సేవల గురించి గ్రామ స్థాయిలో విస్తృత ప్రచారం చేపట్టి రైతులకు అవగాహన కల్పించాలని తెలిపారు. 2%-%5ఎకరాల పంట సాగు చేసే రైతులకు టి.ఆర్.లను మండల వ్యవసాయ అధికారులు సకాలంలో జారీ చేయాలని,5ఎకరాలకు పైబడిన రైతుల విషయమై క్షేత్రస్థాయి పరిశీలన నిర్వహించి, ధృవీకరించిన నివేదికలను జిల్లా వ్యవసాయ కార్యాలయానికి అందించాలని తెలిపారు ఇటీవల జిల్లాలో చోటు చేసుకున్న సహజ కారణాల వల్ల నష్టపోయిన పంటలపై వ్యవసాయ విస్తరణ అధికారులు వెంటనే క్షేత్రస్థాయిలో పర్యవేక్షించి పంట నష్టం నివేదికలను స్పష్టంగా రూపొందించి సమర్పించాలని తెలిపారు.రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి వరి ధాన్యం,పత్తి, మొక్కజొన్న పంట ఉత్పత్తులను కొనుగోలు చేస్తుందని,ఈ క్రమంలో నిబంధనలను పాటిస్తూ నాణ్యమైన పంట ఉత్పత్తులను కొనుగోలు చేసేలా చర్యలు తీసుకోవాలని,వరి ధాన్యం ధ్రువీకరణ కొనుగోలు కేంద్రాలలో మాత్రమే జరిగేలా చూడాలని తెలిపారు. పత్తి సగటు కొనుగోలు వివరాలు ఖచ్చితంగా నమోదు చేసి రోజువారీగా సమర్పించాలని తెలిపారు. యాసంగి 2025-26 సీజన్లో పంట సాగు నుండి కొనుగోలు వరకు ప్రతి దశలో రైతులకు సకాలంలో సేవలు అందించాలని, వ్యవసాయ శాఖ సిబ్బంది సమన్వయంతో పని చేయాలని తెలిపారు. పంట సాగులో డ్రోన్స్ వినియోగంపై క్రాప్ క్రాఫ్ట్ ఇన్నోవేషన్స్ కంపెనీ ప్రతినిధులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. వ్యవసాయ సాగులో నూతన సాంకేతికత డ్రోన్స్ వినియోగం ద్వారా విప్లవాత్మక మార్పులతో అధిక పంట దిగుబడి పొందవచ్చని, అధిక అధికారులు రైతులకు అవగాహన కల్పించాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా భగవాన్ శ్రీ బిర్సా ముండా జయంతి వేడుకలు



**సంగారెడ్డి జిల్లా ప్రతినిధి నవంబర్ 15(ప్రజాబలం)సంగారెడ్డి జిల్లా:**సంగారెడ్డి/తెలంగాణ రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో భారతదేశ అటవీ జాతుల స్వాతంత్ర సమరయోధుడు, జానపద నాయకుడు భగవాన్ శ్రీ బిర్సా ముండా జయంతి వేడుకలు శనివారం కలెక్టరేట్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు,ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) చంద్రశేఖర్,బిర్సా ముండా చిత్రపటానికి పూలమాల వేసి ఆయన చేసిన మహోన్నత పోరాటాన్ని స్మరించుకుంటూ నివాళులు అర్పించారు,ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ భారత అటవీ జాతుల స్వాతంత్ర పోరాటానికి బిర్సా ముండా ప్రేరణాత్మక చిహ్నమని, ఆయన జయంతి దేశవ్యాప్తంగా గౌరవంతో జరుపుకుంటున్నామన్నారు. ఆధునిక శాస్త్ర విజ్ఞానాన్ని ఆకళింపు చేసుకుని బ్రిటిష్ పాలనలో జరిగిన దోపిడీని బిర్సా ముండా అర్థం చేసుకున్నారని వివరించారు. ఆరోజుల్లో నేటి బీహార్ జార?ండ్ ప్రాంతాల్లో జరిగిన మిలీనేరియన్ ఉద్యమానికి ఆయన సారథ్యం వహించారని, కేవలం 22 ఏళ్ల వయసులోనే బ్రిటీషర్లపై యుద్ధాన్ని ప్రకటించి అటవీ జాతుల హక్కుల కోసం అప్రతిహతంగా పోరాడారని గుర్తుచేశారు,అటవీ జాతుల హక్కులు, గిరిజనుల అభ్యున్నతి,స్వాభిమాన రక్షణ కోసం బిర్సా ముండా చేసిన త్యాగాలు నేటికీ ప్రేరణగా నిలుస్తున్నాయని అదనపు కలెక్టర్ పేర్కొన్నారు,ఈ కార్యక్రమంలో డిఆర్ఓ పద్మజారాణి, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్లు దీపిక, ప్రతిభ , గిరిజన సంక్షేమ శాఖ అధికారులు,కలెక్టరేట్ సిబ్బంది విద్యార్థులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# మిడ్ మానేరు బ్యాక్ వాటర్ లో పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి.

### వేములవాడ అర్బన్ బిజెపి నేతల డిమాండ్.




**వేములవాడ టౌన్, (ప్రజాబలం),** రాజరాజేశ్వర మిడ్ మానేరు బ్యాక్ వాటర్ ప్రభావిత పట్టా భూములలో పంటలు మునిగిపోవడంతో రైతులు తీవ్ర నష్టాన్ని ఎదుర్కొంటున్నారని వేములవాడ అర్బన్ మండల భారతీయ జనతా పార్టీ నాయకులు రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ కు శనివారం రోజు వినతి పత్రం సమర్పించడం జరిగింది. ప్రభుత్వ అధికారులు వెంటనే పంట పొలాలను సందర్శించి, పంట నష్టపోయిన రైతులకు న్యాయం చేయాలని, అలాగే ముంపు గ్రామాల పెండింగ్ సమస్యలను పరిష్కరించి భూ నిర్వాసితులకు ఇచ్చిన హామీ మేరకు ఐదు లక్షల 4 వేల రూపాయలను విడుదల చేయాలని ఈ సందర్భంగా బిజెపి అర్బన్ నాయకులు కోరారు. ఈ కార్యక్రమంలో వేములవాడ అర్బన్ మండల అధ్యక్షుడు బుర్ర శేఖర్ గౌడ్, జిల్లా ప్రధాన కార్యదర్శి సిరికొండ శ్రీనివాస్, రాష్ట్ర నాయకులు ఎర్ర మహేష్, లింగంపల్లి శంకర్ తో పాటు పలువురు అర్బన్ బిజెపి నాయకులు, మరియు రైతులు పాల్గొన్నారు.



**గోషామహల్ ప్రజాబలం ప్రతినిధి:** జూబ్లీహిల్స్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి మద్దతు ఇచ్చి నవీన్‌యాదవ్ గెలుపుకు కృషిచేసిన హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ ని దారుసాలంలోని కార్యాలయంలో కలిసి కృతజ్ఞతలు తెలిపిన ఎఐసీసీ ఓబీసీ కోఆర్డినేటర్ నిర్మల్ కూమార్ యాదవ్ విజయ్‌సింగ్

# జిల్లాలో నిమోనియా నివారణకు ప్రత్యేక చర్యలు

## జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



**ప్రజాబలం మంచిర్యాల నియోజకవర్గ రిపోర్టర్ నవంబర్ 15 :** జిల్లాలో నిమోనియా వ్యాధి నివారించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శనివారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని కలెక్టర్ ఛాంబర్ లో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ అనిత, ఉప వైద్యాధికారి సుధాకర్ నాయక్,ఆర్.ఎస్.పద్మ,మాస్ మీడియా అధికారి ఒక వెంకటేశ్వర్లు లతో కలిసి నిమోనియా రాకుండా తీసుకోవలసిన జాగ్రత్తలకు సంబంధించి గోడ ప్రతులు, కరపత్రాలను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... జిల్లాలోని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు,ఆయుష్మాన్, ఉప కేంద్రాలలో వైద్యులు,సిబ్బంది ద్వారా నిమోనియా రాకుండా తీసుకోవలసిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించాలని,5 సంవత్సరాలలోపు పిల్లలు ఉన్న ప్రతి ఇంటిలో కుటుంబ సభ్యులకు వివరించాలని తెలిపారు.నిమోనియా వ్యాధి బ్యాక్టీరియా, వైరస్ ల కారణంగా ఊపిరితిత్తులకు వచ్చే ఇన్ఫెక్షన్ అని, చలికాలంలో పిల్లలు జలుబు,దగ్గు,జ్వరంతో బాధపడుతుంటే వెంటనే సమీప వైద్యులను సంప్రదించి, టీకాలు ఇప్పించి,తగు చికిత్స పొందాలని తెలిపారు.నిమోనియా నివారణపై అవగాహన కార్యక్రమాలను 3 నెలల పాటు జిల్లాలో కొనసాగించాలని, స్వచ్ఛంద సంస్థలు, అంగన్వాడీ కార్యకర్తలు తమ పరిధిలో ప్రతి ఇంటి పెద్దలకు అవగాహన కల్పించాలని,వ్యాధి నివారణ పై ఆరోగ్య సిబ్బందికి శిక్షణ అందించాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# టిఆర్ఎస్ (డి)తెలంగాణ ఉద్యమకారుల కు మద్దతు




**ఉమ్మడి ఖమ్మం జిల్లా ప్రతినిధి నవంబర్ 15 (ప్రజాబలం)** టిఆర్ఎస్ (డి)తెలంగాణ ఉద్యమకారుల కోసం పోరాటం చేస్తుంది. తెలంగాణ ఉద్యమకారులు తెలంగాణ ఉద్యమ సమయంలో తమ ప్రాణాలను సహితం లెక్కచేయకుండా, కుటుంబాలను విడిచిపెట్టి, జైలు పాలై ఎన్నో కేసులు బనాయించుకొని ఇబ్బందులు పడుతుంటే వారి సమస్యను పట్టించుకున్న నాధుడే లేడు. అందుకే తెలంగాణ ఉద్యమకారుల కోసం టిఆర్ఎస్ ( డి) పార్టీ ఉద్యమం చేయాలని నిర్ణయించుకున్నదితెలంగాణ ఉద్యమకారులకు ఇండ్ల స్థలం కేటాయించడంతోపాటు ఇండ్లు నిర్మించాలని వారికి నెలకు 25 వేల రూపాయలు జీతముగా చెల్లించాలని, వారి కుటుంబ సభ్యులకు పెన్షన్ సౌకర్యం కల్పించాలని ఫ్రీ బస్సు సౌకర్యం కల్పించాలని వారికి ఉచిత వైద్యం, అదేవిధంగా కుటుంబంలో ఒకరికి ఉద్యోగం, ఉచిత విద్య కల్పించాలని టిఆర్ఎస్ ( డి) డిమాండ్ చేస్తున్నట్లు ఆ పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు నరాల సత్యనారాయణ తెలియజేశారు

## నవీన్ గెలుపు రేవంత్ రెడ్డి గెలుపు లాగే చూడాలి

## కాంగ్రెస్ తెలంగాణ లో పది ఏళ్ళు అధికారం పక్క



గాంధీ భవన్ ప్రెస్ మీట్ లో
చనగాని దయాకర్న్
టీపీసీసీ జెన్రల్ సెక్రటర్న్
జూబ్లీ హిల్స్ గెలుపు ప్రజా పాలన కు 5 స్టార్ రేటింగ్ లాంటిద్ని
రానున్న రోజుల్లో యువతకు అధిష్టానం పెద్దపీట వేస్తుందని అన్నారు.
ప్రజలు కాంగ్రెస్ ప్రభుత్వం సంక్షేమ పథకాల పట్ల నమ్మకం పెరిగింద్ని
కాంగ్రెస్ పాలన తెలంగాణ ప్రజలకు నచ్చింది..
గద్దర్, అందేశ్రీ లాంటి వారికి ప్రజా ప్రభుత్వం వారి త్యాగాలను గుర్తించింది..
75 ఏళ్ల రాష్టంలో ఉద్యమ కారుల పాడే మోసిన సీఎం రేవంత్ రెడ్డి చరిత్ర లో ఉంటారు..
KTR డ్రామా కానీ రికార్డింగ్ , డీజే ప్రచారంను చెంప చెల్లుమనిపించారు..
BRS నేతల హంకారా పూరిత మాటలు బంద్ చేయాలి..
kcr కాంగ్రెస్ నాయకుల కంటే, కుటుంబ సభ్యులు పెట్టి బాధ ఎక్కువ ఉంది..
స్థానిక సంస్థల ఎన్నికల్లో, కానీ రానున్న ఎన్నికల్లో ఇవే పలితాలు పునరావృతం అవుతాయ్ను
బీహార్ ఎన్నికలకు, తెలంగాణ లో చాలా తేడా ఉంది..
బీజేపీ పార్టీ తెలంగాణ లో 100 ఏండ్లు అయినా డిపాజిట్ రాని పార్టీ గానే ఉంటది..
తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం విజన్ ప్రజలకు అర్థం అయింది..
జూబ్లీ హిల్స్ ఉప ఎన్నిక పలితాలతో బస్తీ ప్రజలకు అభివృద్ధి తో విముక్తి ఉంటది
కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాకే బీసీ లకు గౌరవం పెరిగింది

Edited ,Printed Published & Owned by A.SRAVANTHI ,Printed at: SRAVANTHI ENTER PRISES 1-9-18/A,Ramnagar,Hyderabad - 500020, T.S
and Published at 5-2-518,Osmangunj ,Risala Abdulla,Hyderabad -95 Editor; A.SRAVANTHI, RNI NO ; TELTEL/2005/16755 Cell ; 92921 04449
Email;prajaabalamnews@gmail.com